అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
గురువారం 11-1-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 11
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar
14 పేజీలు వెల : 6.50



మణిపూర్‌లో 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'కు
అనుమతి నిరాకరణ

న్యూఢిల్లీ : కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ చేపట్టనున్న భారత్ జోడో న్యాయ్ యాత్రకు అడ్డంకులు ఎదురయ్యాయి. జనవరి 14న తూర్పు ఇంఫాల్‌లోని హట్టా కాంగ్జెబుంగ్‌లో బహిరంగ ర్యాలీతో యాత్రను ప్రారంభించనున్నట్టు పార్టీ ముందుగా ప్రకటించింది. అయితే బహిరంగ ర్యాలీ చేపట్టేందుకు మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. అనుమతి నిరాకరణపై సీనియర్ కాంగ్రెస్ నేత కెసి. వేణుగోపాల్ స్పందించారు. ఎన్నికల సన్నాహాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా యాత్ర చేపడతామని అన్నారు. ఇది రాజకీయ యాత్ర కాదని, ఈ దేశ ప్రజలకు న్యాయం చేయాలని కోరుతున్నామని అన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర యూనిట్ తగిన సమయంలోనే పోలీస్ క్లియరెన్స్‌ను అభ్యర్థించిందని చెప్పారు. ఎదురు దెబ్బలు యాత్రను అడ్డుకోలేవన్నారు. ఈ సమస్యను రాజకీయం చేయబోమని ఆయన స్పష్టం చేశారు.

రాష్ట్రంలో శాంతిభద్రతల పేరుతో ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ రాహుల్ యాత్రకు అనుమతి నిరాకరించారని మణిపూర్‌పీసీసీ అధ్యక్షుడు కె.మేఘచంద్ర తెలిపారు. ప్రభుత్వ నిర్ణయం దురదష్టకరమని, ఈ చర్య ప్రజల, రాజకీయ హక్కుల ఉల్లంఘనగా పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో యాత్రకు అనుమతి లేకపోవడంతో.. థౌబాల్ జిల్లాలోని ఓ ప్రైవేటు స్థలానికి మార్చినట్టు మేఘచంద్ర వెల్లడించారు. రాహుల్ చేపట్టనున్న 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' జనవరి 14న ప్రారంభమై మార్చి 30న ముగుస్తుంది. 66 రోజులపాటు 15 రాష్ట్రాల్లోని 110 జిల్లాల మీదుగా దాదాపు 6,713 కిలోమీటర్ల పాటు కొనసాగనుంది.



గృహజ్యోతి
త్వరలో 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు
ఏర్పాట్లు చేయండి
కొత్త విద్యుత్ పాలసీ రూపకల్పన

200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌కు సంబంధించిన 'గృహజ్యోతి' పథకం అమలు కోసం అవసరమైన ఏర్పాట్లన్నీ త్వరగా పూర్తిచేయాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి విద్యుత్ అధికారుల్ని ఆదేశించారు. ఆరు గ్యారెంటీల అమల్లో భాగంగా వంద రోజుల్లోపే 'గృహజ్యోతి'ని అమల్లోకి తీసుకురావల్సి ఉందనీ, దీనికి సంభందించిన లెక్కాపత్రాల్ని వారం రోజుల్లో పూర్తిచేసి, నివేదిక ఇవ్వాలని చెప్పారు. బుధవారంనాడిక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, డీ శ్రీధర్‌బాబుతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యుత్‌శాఖపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

- విద్యుత్ కొనుగోళ్లను సమీక్షించండి : అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం సందర్భంగా ప్రస్తుతం రాష్ట్రంలోని విద్యుత్ స్థితిగతులపై అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సీఎంకు వివరించారు. విద్యుత్‌రంగంపై అసెంబ్లీలో ప్రవేశపెట్టిన శ్వేతపత్రంలోని అంశాలు కాకుండా, ఇతర వివరాలు చెప్పాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి అధికారుల్ని కోరారు. గృహజ్యోతిపై ఇప్పటికే ఒక అంచనాకు వచ్చినందున, 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరాపై దృష్టి పెట్టాలని సూచించారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలన్నారు.



రాష్ట్రంలో ఇప్పటి వరకు విద్యుత్ పాలసీనే లేకపోవడాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. దానిపైనే సుదీర్ఘ చర్చ జరిగింది. కొత్త విద్యుత్ పాలసీ ...13లో

మరో 275 బస్సులు కొనుగోలు
- 'మహాలక్ష్మి' రద్దీ నివారణ కోసం...
- జులైలో వెయ్యి అద్దె బస్సులు
- కండక్టర్ కారుణ్య నియామకాలు : రవాణాశాఖ మంత్రి పొన్నం వెల్లడి
- రెగ్యులర్ ప్రాతిపదికన నియమించండి-కార్మిక సంఘాలు

3లో..

టీఎస్‌పీఎస్సీ చైర్మెన్, సభ్యుల
రాజీనామా ఆమోదం
లీకేజీపై సమగ్ర విచారణ
- గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వెల్లడి
- ఇంకా కొనసాగుతున్న ఇద్దరు సభ్యులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) చైర్మెన్ డాక్టర్ బి జనార్ధన్‌రెడ్డి, ముగ్గురు సభ్యులు ఆర్ సత్యనారాయణ, ప్రొఫెసర్ బండి లింగారెడ్డి, కారం రవీందర్‌రెడ్డి రాజీనామాలను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఎట్టకేలకు బుధవారం ఆమోదించారు. వారి రాజీనామాల ఆమోదానికి తమకు ఎలాంటి అభ్యంతరం



లేదని రాష్ట్ర ప్రభుత్వం తెలపడంతో అడ్వకేట్ జనరల్‌తో న్యాయ సలహాలు తీసుకున్న తర్వాత గవర్నర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే ఆ నలుగురి రాజీనామాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ...13లో

సీపీఐ(ఎం) కారేపల్లి ఆఫీస్ ముట్టడి
- ఆఫీస్‌లోని పోడుదారుల అరెస్టుకు ఫారెస్ట్ అధికారుల యత్నం
- అడ్డుకున్న పార్టీ నాయకులు



వివరాలు 2లో..



ఫిబ్రవరి 16న విద్యుత్ ఉద్యోగుల
దేశవ్యాప్త ఆందోళనలు
పదేండ్లలో ప్రజలు చాలా నష్టపోయారు
- వారి భాగస్వామ్యంతో ప్రత్యేక ఫోరంలు ఏర్పాటు
- ప్రభుత్వ విధాన వ్యతిరేక ప్రజాఉద్యమాలు నిర్మిస్తాం : ఈఈఎఫ్ఐ వర్కింగ్ కమిటీ నిర్ణయం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16వ తేదీ దేశవ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులు ఆందోళనలు నిర్వహిస్తారని ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ...13లో

పరిపాలనపై దృష్టి సారించి.. పార్టీకి సమయమివ్వలేకపోయాం...
ప్రజలు మనతోనే ఉన్నారనుకున్నాం
- అసెంబ్లీ ఫలితాలను పక్కనబెట్టి.. లోక్‌సభపై దృష్టి సారించండి : వరంగల్ సన్నాహక సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదేండ్లుగా పరిపాలనపై పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించటం ద్వారా పార్టీకి తగిన సమయం కేటాయించలేకపోయామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఇప్పుడు జరుగుతున్న మాదిరిగానే ఎప్పటికప్పుడు సమావేశాలను నిర్వహించుకోవటం ద్వారా పార్టీని బలోపేతం చేస్తామని ఆయన కార్యకర్తలకు భరోసానిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన 'వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ సన్నాహక సమావేశం'లో నేతలు, కార్యకర్తలనుద్దేశించి కేటీఆర్ మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడినప్పుడు కూడా ప్రజలు మనతోనే ఉన్నారనే ధీమాతో, అదే అంచనాతో తామున్నామని వివరించారు. ఈ క్రమంలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే నేతలు కూడా ఓడిపోయారని తెలిపారు. అయితే ప్రజలు బీఆర్ఎస్‌ను పూర్తిస్థాయిలో తిరస్కరించలేదని గుర్తు చేశారు. 39 సీట్లతో బలమైన ప్రతిపక్ష హోదానిచ్చారని చెప్పారు. అందువల్ల ...13లో

నేడు ఢిల్లీకి సీఎం, మంత్రులు
- ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి కూడా
- పార్లమెంటరీ నియోజకవర్గాల సమన్వయకర్తలు



వివరాలు 5లో..

ట్రాఫిక్ చలాన్ల రాయితీ గడువు పొడిగింపు
- ఈ నెల 31 వరకు పెంచుతూ ఉత్తర్వులు జారీ



వివరాలు 5లో..

కర్నాటక శకటానికి కేంద్రం 'నో'
- రిపబ్లిక్ డే పెరేడ్‌కు అనుమతి నిరాకరణ
- ఇది కన్నడిగులకు అవమానం : సిద్ధరామయ్య



వివరాలు 13లో..

పాత పద్ధతిలోనే...
వర్సిటీ అధ్యాపకుల నియామకాలు!

విశ్వవిద్యాలయం యూనిట్‌గా పోస్టుల భర్తీ
- కామన్ నియామక బోర్డును వెనక్కి తీసుకోవాలని సర్కారు యోచన
- త్వరలో గవర్నర్‌తో విద్యాశాఖ సంప్రదింపులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలకు సంబంధించి ప్రభుత్వం దృష్టిసారించింది. కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం మినహా రాష్ట్రంలోని 15 వర్సిటీల పరిధిలో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ ప్రక్రియ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కామన్ నియామక బోర్డును ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అందుకు సంబంధించి అసెంబ్లీలో బిల్లును ఆమోదించి గవర్నర్ ఆమోదానికి పంపించారు. అయితే గవర్నర్ ఆ బిల్లును ఆమోదించకుండా రాష్ట్రపతి పరిశీలనకు సిఫారసు చేశారు. దీంతో కామన్ నియామక బోర్డు బిల్లు ప్రస్తుతం రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నది. దీంతో తెలంగాణ ఆవిర్భవించినప్పటి నుంచి విశ్వవిద్యాలయాల్లో నియామకాల ప్రక్రియను ప్రభుత్వం ఇప్పటి వరకు చేపట్టలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త విధానాన్ని అమలు చేయాలని భావించి బిల్లును తెచ్చింది. గవర్నర్ ఆమోదించకపోవడంతో ఆ ప్రయత్నం ఫలించలేదు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. విద్యాశాఖపై సమీక్ష సమయంలో వర్సిటీల్లో ఖాళీలు, నియామకాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరాతీశారు. కామన్ నియామక బోర్డు బిల్లు గురించి అధికారులు వివరించారు. ప్రత్యామ్నాయాలను ఆలోచించాలని సీఎం సూచించారు. విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల పోస్టుల భర్తీని పాత విధానంలో చేపడితే బాగుంటుందని ఉన్నత విద్యామండలి అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దాన్ని పరిశీలించాలని సూచించినట్టు తెలిసింది. దీంతో త్వరలోనే గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వద్దకు విద్యాశాఖ అధికారులు వెళ్లి కామన్ నియామక బోర్డు బిల్లు గురించి వివరాలు తెలుసుకునే అవకాశమున్నది. రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతలు, విశ్వవిద్యాలయాల్లో ఖాళీల భర్తీకి చేపట్టబోయే నిర్ణయాల గురించి చెప్తారని తెలుస్తున్నది. కామన్ నియామక బోర్డు బిల్లును వెనక్కి తీసుకోవాలని గవర్నర్‌కు విన్నవించాలని అధికారులు భావిస్తున్నారు. ఆ ప్రక్రియ పూర్తయితేనే పాత విధానంలో విశ్వవిద్యాలయాల వారీగా అధ్యాపక పోస్టుల భర్తీకి మార్గం ...5లో



గుజరాత్‌లోని వీహెచ్‌పీ కార్యాలయంలో విడుదలైన నిందితులకు ఘన స్వాగతం (ఫైల్)

వారిలో 9 మంది
కనబడుట లేదు
బిల్కిస్ బానో కేసులో దోషుల మిస్సింగ్

అహ్మదాబాద్ : బిల్కిస్ బానో కేసులో 11 మంది ముద్దాయిలకు క్షమాభిక్ష ప్రసాదిస్తూ గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు రెండు రోజుల క్రితం తోసిపుచ్చిన విషయం తెలిసిందే. రెండు వారాలలో లొంగిపోవాలని కూడా ముద్దాయిలను న్యాయస్థానం ఆదేశించింది. అయితే వీరిలో 9 మంది ఆచూకీ తెలియడం లేదు. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రిక విలేకరి ముద్దాయిలు నివసిస్తున్న గ్రామాలను సందర్శించారు. ముద్దాయిలు ఇచ్చిన చిరునామాలలో సంప్రదించగా తొమ్మిది మంది కనబడడం లేదని ఆయన గుర్తించారు. వీరందరూ ఎక్కడికి వెళ్లారని బంధువులను ప్రశ్నించగా సమాధానం ఇచ్చేందుకు వారు ఇష్టపడలేదు.

తన కుమారుడు వారం రోజుల క్రితమే ఇల్లు వదిలి వెళ్లాడని ఓ ముద్దాయి తండ్రి గోవింద్ నాయ్ చెప్పారు. సుప్రీంకోర్టు విధించిన శిక్షను కాంగ్రెస్ కుట్రగా ఆయన అభివర్ణించారు. పత్రికా విలేకరి వెళ్లినప్పుడు రాధేశ్యామ్ షా అనే ముద్దాయి కూడా ఇంటి వద్ద లేదు. అతను పదిహేను నెలల ...13లో

సీపీఐ(ఎం) కారేపల్లి ఆఫీస్ ముట్టడి

- పోడుదారుల అరెస్టుకు ఫారెస్టు అధికారులు యత్నం
- ప్రతిఘటించిన పార్టీ శ్రేణులు
- ఘటనపై పోలీసులకు తెలంగాణ గిరిజన సంఘం ఫిర్యాదు
- ఎమ్మెల్యే, ఎస్‌ఐ ఆదేశాలతో వెనక్కు తగ్గిన అటవీ అధికారులు



నవతెలంగాణ-కారేపల్లి

ఖమ్మం జిల్లా కారేపల్లి మండల కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంపై బుధవారం ఫారెస్టు అధికారులు దాడికి యత్నించారు. ఈ నెల 5వ తేదీ రాత్రి మాణిక్యారం, ఊటవాగు సమీపంలోని పోడు ప్లాంటేషన్‌ను కొందరు ధ్వంసం చేశారు. దానిపై ఆరుగురు పోడు సాగుదారులపై ఫారెస్టు అధికారులు కేసులు పెట్టారు. కేసుల విషయమై కారేపల్లి ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో ఎఫ్ఆర్వో సిద్దార్థరెడ్డితో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీకాంత్, భూక్య వీరభద్రం ఆధ్వర్యంలో పోడుదారులు చర్చించారు. అటవీ సమస్యలపై రెండు రోజుల్లో ఫారెస్టు హైలెవల్ కమిటీ పర్యటన ఉందని, పర్యటన అనంతరం నిర్ణయం తీసుకోవాలని ఫారెస్టు, పోలీసు అధికారులను సీపీఐ(ఎం) నాయకులు కోరారు. ఇదే సమయంలో ఆదివాసీ గిరిజన సంఘం సమావేశం సీపీఐ(ఎం) ఆఫీస్‌లో జరుగుతుండగా కొందరు గిరిజనులు పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. సీపీఐ(ఎం) నాయకులు.. పోలీసులతో చర్చలు నడుస్తుండగానే ఎఫ్ఆర్వో సిద్దార్థరెడ్డి ఆధ్వర్యంలో 40 మంది ఫారెస్టు శాఖ అధికారులు పార్టీ కార్యాలయాన్ని ముట్టడించారు. పోడుదారులను అరెస్టు చేసేందుకు యత్నించారు. సీపీఐ(ఎం) నాయకులు వారిని అడ్డుకోవటంతో ఇరువురి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. సీపీఐ(ఎం) కార్యాలయానికి ఎందుకు వచ్చారని ప్రశ్నించినా ఫారెస్టు శాఖ అధికారులు మాట్లాడకుండా గొడవకు దిగే ప్రయత్నం చేశారు.

సీపీఐ(ఎం) కార్యాలయంపై దాడికి ఖండన

ప్రజాసమస్యల పరిష్కార వేదికైన సీపీఐ(ఎం) కార్యాలయంపై కారేపల్లి ఎఫ్ఆర్వో సిద్దార్థరెడ్డి అత్యుత్సాహంతో దాడికి ప్రయత్నించారని, అతన్ని సస్పెండ్ చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీకాంత్, భూక్య వీరభద్రం డిమాండ్ చేశారు. పోడు సమస్యపై చర్చలు నడుస్తుండగానే పోడుదారులను అరెస్టు చేసే సాకుతో పార్టీ కార్యాలయంపై దాడికి దిగడం దారుణమన్నారు. కొత్త ప్రభుత్వంను బదనాం చేసే పనుల్లో భాగంగానే ఎఫ్ఆర్వో చర్యలు ఉన్నాయని ఆరోపించారు. సీపీఐ(ఎం) ఆందోళనకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, మేదరి వీరప్రతాప్(టోనీ), మల్లెల నాగేశ్వరరావు, గుగులోత్ భీముడు, దారావత భద్రునాయక్, గడ్డం వెంకటేశ్వర్లు, తొగరు శ్రీను సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు కొండెబోయిన నాగేశ్వరరావు, యర్రా శ్రీనివాసరావు, కే.నరేంద్ర, తలారి దేవప్రకాశ్, ముక్కా సీతారాములు, కే.ఉమావతి, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వజ్జా రామారావు, దుగ్గి కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు ఎస్‌కె. గౌసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) కార్యాలయం వద్ద మోహరించిన ఫారెస్టు శాఖ ఫోర్స్

పోడుదారుల అరెస్టుకు సీపీఐ(ఎం) కార్యాలయంపై దాడికి యత్నించిన విషయం స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా తెలుసుకున్న వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ ఫారెస్టు రేంజ్ అధికారితో మాట్లాడారు. అయినా ఫారెస్టు శాఖ అధికారులు వెనక్కు తగ్గకుండా కార్యాలయం వద్దే కాపుకాశారు. రెండు గంటల పాటు సీపీఐ(ఎం) కార్యాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఒక సమయంలో ఆందోళన జరుగుతుండగానే ఎఫ్ఆర్వో సిద్దార్థరెడ్డి తన సిబ్బందిని పురమాయించడంతో అరెస్టుకు దూసుకొచ్చారు. దాంతో సీపీఐ(ఎం) నాయకులు అడ్డుపడి అధికారులతో వాగ్వివాదానికి దిగి నిలువరించారు. సీపీఐ(ఎం) కార్యాలయంపై దాడి చేసి భయాందోళనకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కారేపల్లి ఎస్ఐ పుష్పాల రామారావుకు తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు వజ్జా రామారావు ఫిర్యాదు చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారి శాంతి భద్రతల సమస్య ఉత్పన్నమవుతున్న తరుణంలో ఎస్ఐ పుష్పాల రామారావు జోక్యం చేసుకొని ఇరు గ్రూపులను నిలువరించారు. ఈ లోపు ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ఉన్నతాధికారులతో మాట్లాడటం, అధికారుల నుంచి వచ్చిన ఆదేశాలతో ఫారెస్టు అధికారులు వెనక్కు తగ్గారు.

మాకు చైర్మెన్ గిరీ ఇవ్వరూ...

కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు

- సీఎంతోపాటు ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షికి ఆశావాహుల అర్జీలు
- చైర్మెన్ పదవుల కోసం ఎదురుచూపులు
- మంత్రుల చుట్టూ తిరుగుతున్న నేతలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పదేండ్లుగా అధికారానికి దూరమై...నైరాశ్యంలో ఉన్న కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఈ జోష్‌లో ఉన్న ఆ పార్టీ గంపెడాశాలు పెట్టుకున్నారు. సీఎం రేవంత్ నేతృత్వంలో మంత్రివర్గం ఏర్పడిన తర్వాత ప్రభుత్వానికి అత్యంత కీలకమైన చైర్మెన్ పదవులు భర్తీ చేయడం ప్రభుత్వముందున్న కర్తవ్యం. రాష్ట్రంలో 93 కార్పొరేషన్లు ఉన్నాయి. వాటిలో 54 కార్పొరేషన్ల చైర్మెన్ పదవులను సర్కారు రద్దు చేసింది. అందులో కొంత మంది ముందస్తు రాజీనామాలు చేసిన సంగతి తెలిసిందే. కార్పొరేషన్లు, మార్కెటింగ్ కమిటీ చైర్మెన్లు, సభ్యులు, గ్రంథాలయ చైర్మెన్లు, సభ్యులను ప్రభుత్వమే నియమించాల్సి ఉంటుంది. ఇలాంటి పదవులను భర్తీ చేయడం ద్వారా ప్రభుత్వానికి, ప్రజలకు చైర్మెన్లు సంధాన కర్తలుగా ఉంటారు. వీటి నియామకం ద్వారా చాలా మంది నాయకులకు పదవులు లభిస్తాయి. వాటి కోసం ఇప్పుడు దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా వస్తున్నాయి.తాము నమ్ముకున్న నాయకులకు దరఖాస్తులు ఇవ్వడంతోపాటు పార్టీ కార్యాలయంలోనూ అర్జీలు సమర్పిస్తున్నారు. సీఎం, మంత్రుల అండదండలు పుష్కలంగా ఉన్న చైర్మెన్ పదవులు నాయకులు తమకు వస్తాయన్న ఆశతో ఉన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సన్నిహితులు, అనుయాయులు, ఆయన్ను నమ్ముకున్న నేతలు కూడా సీఎంకు విజ్ఞాపనలు పంపిస్తున్నారు. చైర్మెన్ పదవులను అధిష్టానమే ఇస్తుందనీ, పైరవీలకు తావులేదంటూ సీఎం చెబుతున్నా...వినకుండా ఓ కాగితం పడేస్తే పోలే అన్నట్టు వ్యవహరిస్తున్నారు. పదేండ్లుగా పార్టీ కోసం కష్టపడిన నాయకులతో కూడిన జాబితా సిద్ధం చేయాలని దీపాదాస్‌మున్షిని అధిష్టానం ఆదేశించింది. ఈ నేపథ్యంలో చైర్మెన్ పదవులు ఆశిస్తున్న నేతలు ఆమెకు కూడా దరఖాస్తులు అందజేస్తున్నారు. ఏఐసీసీ ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొనేందుకు గురువారం ఆమె ఢిల్లీ వెళ్లనుండటంతో బుధవారం గాంధీభవన్‌లో దరఖాస్తుల తాకిడి ఎక్కువైంది. అంతేకాకుండా ఆశావహులు తమకు తెలిసిన వారి ద్వారా కూడా ఇందుకోసం పైరవీలు చేస్తున్నారు. దరఖాస్తులు ఇవ్వడంతోపాటు ఏఐసీసీ నేతలతో ఉన్న పరిచయాలను కూడా ఉపయోగించుకుంటున్నారు. అధిష్టానం పెద్దలు సీఎం చెపితే పనైపోతుందనే భావనలో ఢిల్లీలో ఉంటూ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు, పార్టీ సంస్థాగత ఇన్‌చార్జి మహేష్‌కుమార్‌గౌడ్‌పై కూడా తీవ్ర ఒత్తిడి పెంచుతున్నారు.ఆయనకు కూడా చైర్మెన్‌పదవుల కోసం దరఖాస్తులు ఇస్తున్నారు. ముఖ్యంగా ఎన్నికల్లో టికెట్ దక్కని వారితోపాటు ఓడిపోయిన అభ్యర్థులు, పార్టీ సీనియర్ నాయకులు సైతం చైర్మెన్ పదవులకు పోటీ పడుతున్నారు.

సీపీఎస్ రద్దు చేయాలని ఫిబ్రవరి 16న జాతీయ సమ్మె

- ఏఐఎస్‌జీఈఎఫ్ అధ్యక్షులు సుభాష్ లంబ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దు చేయాలని కోరుతూ వచ్చేనెల 16న జాతీయ సమ్మెను విజయవంతం చేయాలని అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య (ఏఐఎస్‌జీఈఎఫ్) జాతీయ అధ్యక్షులు సుభాష్ లంబ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని టీఎన్జీవో రాష్ట్ర కార్యాలయంలో సమ్మె సన్నాహక సమావేశాన్ని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్ లంబ మాట్లాడుతూ గతనెల 28, 29, 30 తేదీల్లో కలకత్తాలో నిర్వహించిన ఏఐఎస్‌జీఈఎఫ్ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో తీర్మానాన్ని అనుసరించి సీపీఎస్ రద్దు, ఉద్యోగుల ఆదాయపు పన్ను రూ.10 లక్షలకు పెంపు, పెండింగ్‌లో ఉన్న డీఏలను మంజూరు డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ప్రయివేటీకరణ విధానాలను ఉపసంహరించుకోవాలని చెప్పారు. కార్మిక చట్టాల రద్దును వ్యతిరేకిస్తున్నామని అన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. మారం జగదీశ్వర్ మాట్లాడుతూ జాతీయ కౌన్సిల్ తీర్మానం మేరకు వచ్చేనెల 16న ఒక రోజు జాతీయ సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో కేంద్ర అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకట్, జాతీయ కార్యవర్గ సభ్యులు లక్ష్మణ్‌తోపాటు 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బోనస్, ఈఎస్ఐలపై సీలింగ్ ఎత్తేయాలి



- కనీస వేతనాలను జీవోలను సవరించాలి : సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి.మధు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం బోనస్, ఈఎస్ఐలపై విధించిన సీలింగ్‌ను వెంటనే ఎత్తేయాలనీ, కనీస వేతనాల జీవోలను సవరించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి.మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో పెట్రోలియం, గ్యాస్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(పీజీడబ్ల్యూఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఆయిల్ సెక్టార్‌లోని కాంట్రాక్టు కార్మికులు డిమాండ్స్‌డేను నిర్వహించారు. డిప్యూటీ లేబర్ కమిషనర్(సెంట్రల్)కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బి. మధు మాట్లాడుతూ బోనస్, ఈఎస్ఐ చట్టాల అమలుకు అర్హతలపై కేంద్ర ప్రభుత్వం 2017లో రూ.21 వేల వేతన సీలింగ్‌ని విధించిందనీ, ఆరేండ్లుగా సీలింగ్‌ను సవరించలేదని తెలిపారు. దీని ఫలితంగా ఆయిల్ సెక్టార్‌తో సహా హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న అనేక ప్రభుత్వరంగ సంస్థల్లోని కాంట్రాక్ట్ కార్మికులు బోనస్‌ని పొందలేకపోతున్నారనీ, ప్రతి కాంట్రాక్ట్ కార్మికుడు నెలకు రూ.1,500 నుంచి రూ.2 వేల వరకు నష్టపోతున్నాడని వాపోయారు. ఈఎస్ఐ వర్తించకపోవడంతో వైద్యసౌకర్యాలను కూడా కోల్పోతున్న తీరును వివరించారు. బోనస్, ఈఎస్ఐ, పీఎఫ్‌కు సీలింగ్‌ను పెట్టడం అన్యాయమన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 2022లో సవరించాల్సిన జీఓలను నేటి వరకు సవరించలేదని విమర్శించారు.. ఫలితంగా ప్రభుత్వరంగ సంస్థలలోని కాంట్రాక్ట్ కార్మికులు అతి తక్కువ వేతనాలతో కుటుంబాలను గడపాల్సిన స్థితిలోకి నెట్టబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీనివాస్, నాయకులు పి.గణేష్, రామాచారి, నిమ్మ వెంకటేశ్వర్లు, సాగర్, మన్సూర్, మోహన్, సంపత్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో క్రైస్తవులకు ప్రాధాన్యత నివ్వాలి

- రాష్ట్ర క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్



హైదరాబాద్ : తెలంగాణలో ఉన్న క్రైస్తవులకు వెంటనే అన్ని నామినేటెడ్ పదవులు రాష్ట్ర స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ఇప్పించాలని రాష్ట్ర క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటి అధ్యక్షులు ఎం. సాల్మన్ రాజు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలకూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం రాష్ట్రంలోని క్రైస్తవుల సంక్షేమానికి మరింత కృషి చేయాలని కోరారు. గత ప్రభుత్వం పేద క్రైస్తవులకు ఒక లక్ష రూపాయలు మంజూరు చేసింది. ఎన్నికల కోడ్ వల్ల ఆ సహాయం ఆగిపోయిందన్నారు. దాన్ని వెంటనే మంజూరు చేసి నిరుపేద క్రైస్తవ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. క్రైస్తవుల అంతిమ సంస్కారాల కోసం బీఆర్ఎస్ సర్కార్ సుమారు 63.37 ఎకరాల భూమిని కేటాయిస్తూ జీవో జారీ చేసిందన్నారు. అయితే దీనికి సరిహద్దులు ఏర్పాటు చేసి ఇవ్వాలని కోరారు. అదే విధంగా రాష్ట్రంలో కొన్ని చర్చీల నిర్మాణంలో ఉన్నాయని వాటికి ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని కోరారు. ఉప్పల్ బగాయత్‌లో నిర్మించ తల పెట్టిన క్రిష్టియన్ భవన నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరారు. రాష్ట్రంలో క్రైస్తవులపైజరుగుతున్న దాడులను అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్లు జారీ చేసినా... మంజూరు కాలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కార్యదర్శి డాక్టర్ కె. ఎస్ జాకబ్, సంయుక్త కార్యదర్శి రాజేష్, సుధోష్, కెన్నీ, జయకుమార్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

రామమయం కాదు... రాజకీయం

బీజేపీ ఈవెంట్‌గా మారుతున్న ప్రాణప్రతిష్ట కార్యక్రమం



- ఎన్నికల లబ్ది కోసం ఆరాటం
- వెళ్లాలా వద్దా అని ప్రతిపక్షాల డైలమా
- వెళ్లమని ఇప్పటికే స్పష్టం చేసిన సీపీఐ (ఎం)

పాన్-ఇండియా కథనం తప్పదు

ఈ నెల 22న జరిగే కార్యక్రమానికి ఏ మత నాయకుడు నేతృత్వం వహించడం లేదు. నిర్వహణ అంతా మోడీదే. పూరీ శంకరాచార్య ఈ విషయాన్ని ఇప్పటికే స్పష్టం చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు వెళ్లడానికి ముందు మోడీ ప్రభుత్వం పది సంవత్సరాల ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించడానికి పాన్-ఇండియా కథనాన్ని వండి వార్చాలి. ఈ కథనం కాశ్మీర్ లేదా పాకిస్తాన్ అంశాల కంటే భావోద్వేగం కలిగించాలి. ముఖ్యంగా దేశంలోని దక్షిణ, తూర్పు ప్రాంతాలకు ఈ వంటకం ఎంతో అవసరం. రామజన్మభూమి తీర్థ క్షేత్రకు చెందిన మందిర నిర్మాణ కమిటీకి మోడీకి అత్యంత విశ్వాసపాత్రుడు, పీఎంఓ మాజీ ప్రధాన కార్యదర్శి నృపేంద్ర మిశ్రా నేతృత్వం వహించారు. మిశ్రా నేతృత్వంలోని ఈ ప్రాజెక్టు ఈ నెల 22న మోడీని హిందువుల హృదయ సామ్రాట్‌గా నిలిపేందుకు తీవ్ర కృషి చేస్తోంది.

న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీజేపీ యంత్రాంగం యావత్తూ ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలోనే మోహరిస్తోంది. తద్వారా రాజకీయాలతో మతాన్ని ముడిపెట్టింది. మరోవైపు రామమందిర ప్రాణప్రతిష్ట కార్యక్రమానికి హాజరు కావాలా వద్దా అనే విషయంపై అనేక పార్టీలు ఎటూ తేల్చుకోలేకపోతున్నాయి. ఒక్క సీపీఐ (ఎం) మాత్రమే తన వైఖరిని స్పష్టం చేసింది. ఈ కార్యక్రమానికి హాజరు కాబోనని పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తెలిపారు. వాస్తవానికి అయోధ్యలో రామ మందిర ప్రాణప్రతిష్ట కార్యక్రమం బీజేపీ ఈవెంట్‌గా మారిపోయింది. రాబోయే ఎన్నికలలో మోడీకి, పార్టీకి రాజకీయ ప్రయోజనం చేకూర్చేందుకు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకుంటోంది. ఎన్నికల విజయాల కోసం మతాన్ని వాడుకోవడం బీజేపీకి కొత్తేమీ కాదు. 1990వ దశకం నుండే అది ప్రారంభమైంది.

1991 సార్వత్రిక ఎన్నికల తర్వాత లోక్‌సభలో బీజేపీ రెండవ అతి పెద్ద పార్టీగా అవతరించింది. 1984 ఎన్నికలలో తొలిసారిగా బీజేపీ ఎన్నికల బరిలో దిగింది. అప్పుడు ఆ పార్టీకి లభించింది కేవలం రెండు స్థానాలు మాత్రమే. ఒకప్పటి జనసంఘ్ పొందిన స్థానాలతో పోలిస్తే ఇది తక్కువే. 1991 సాధారణ ఎన్నిక లలో ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ మంచి ఫలితాలు సాధించింది. దేశంలో అత్యధిక లోక్‌సభ స్థానాలు ఉన్నది ఆ రాష్ట్రం లోనే. సీట్లతో పాటు ఓట్ల శాతాన్ని కూడా బీజేపీ పెంచు కోగలిగింది. 1984లో 7.4 శాతం ఓట్లు పొందిన బీజేపీ, 1989లో 11.4శాతం, 1991లో 20.1శాతం ఓట్లు రాబట్టింది. హిందూత్వ పార్టీగా ముద్ర వేసుకొని 1996 ఎన్నికల నాటికి అతి పెద్ద పార్టీగా ఆవిర్భవించింది.

హిందూత్వ వాదమే బలం

1997లో జరిగిన ఉత్తరప్రదేశ్ శాసనసభ ఎన్నికలలో బీజేపీ అధికారాన్ని కైవసం చేసుకుంది. ఆ తర్వాత కొన్ని ఇతర హిందీ రాష్ట్రాలలోనూ గణనీయమైన సీట్లు సాధించింది. దేశంలో బీజేపీ బలం నిలకడగా పెరగడానికి ప్రధాన కారణం దాని హిందూత్వ వాదమే. అయోధ్యలో బాబ్రీ మసీదు స్థానంలో రామమందిరాన్ని నిర్మించాలన్న ఏకైక డిమాండ్‌తో 1990లో ఎల్‌కే అద్వానీ చేపట్టిన రథయాత్ర ఆ పార్టీకి మంచి ఊపు ఇచ్చింది. ఫలితంగా యూపీలో కల్యాణ్‌సింగ్ నేతృ త్వంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడింది. ఇదంతా గతం....

మళ్లీ తెరపైకి...

ఇప్పుడు లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీజేపీ తన అమ్ములపొది నుండి హిందూత్వ అస్త్రాన్ని మరోసారి బయటికి తీసింది. ఈ నెల 22న అయోధ్యలో ప్రధాని నరేంద్ర మోడీ స్వయంగా పూజారి అవతారం ఎత్తబోతున్నారు. గతంలో హిందూత్వ వాదాన్ని తెరపైకి తెచ్చి, ఎన్నికల విజయాలు సాధించిన కమలదళం ఇప్పుడు కూడా అందివచ్చిన ఏ అవకాశాన్నీ జారవిడవడం లేదు. అదే హిందూత్వ వాదంతో ప్రజలలో భావోద్వేగాలను రెచ్చగొట్టి మరోసారి ఎన్నికలలో విజయం సాధించేందుకు సమాయత్తమవుతోంది.

ప్రతిపక్షాల డైలమా


రాబోయే లోక్‌సభ ఎన్నికలలో ఇండియా కూటమిగా ఏర్పడి ఉమ్మడి పోరు సాగించేందుకు సమాయత్తమవుతున్న ప్రతిపక్ష పార్టీలను నిలువరించేందుకు అయోధ్య కార్యక్రమాన్ని బీజేపీ ఓ ఆయుధంగా ఉపయోగించు కుంటోంది. అయోధ్యలో ప్రాణప్రతిష్ట కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా సోనియాగాంధీ, మల్లిఖార్జున ఖర్గే వంటి కాంగ్రెస్ అగ్రనేతలకు, సీపీఐ (ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, ఐక్య జనతాదళ్ నేత నితీష్ కుమార్ తదితర నాయకులకు ఆహ్వానాలు పంపారు. ఆహ్వానాలు అందినా లేకున్నా ఈ కార్యక్రమంపై ప్రతిపక్ష నాయకులు మాత్రం గందరగోళంలో పడ్డారు. అధికార పార్టీ నేతృత్వంలో జరుగుతున్న ఈ కార్యక్రమానికి హాజరవ్వాలా వద్దా అనే విషయంపై మల్లగుల్లాలు పడుతున్నారు. దీనికి ఓ కారణం ఉంది. రామమందిర అంశం లక్షలాది మంది హిందువుల మత మనోభావాలతో ముడిపడింది. ఈ కార్యక్రమానికి ప్రతిపక్ష నేతలు హాజరైనా కాకపోయినా వారు ఓటర్ల ముందు రెండు వాదనలు విన్పించాల్సిన అవసరం ఉంది.

ఈ నెల 22వ తేదీ ప్రతిపక్షాలకు కూడా ముఖ్యమైనదే. జాతిపిత మహాత్మా గాంధీని గురించి ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉంది. ప్రార్థనా సమావేశంలో ఉండగా ఆయన శరీరంపై తుపాకీ తూటాల వర్షం కురిసింది. 'హే రామ్' అంటూ ఆయన నేలకొరిగారు. రామ భక్తుడైన గాంధీజీ జీవితాన్ని బలిగొన్నది ఆర్‌ఎస్‌ఎస్ ఓ సభ్యుడేనన్న విషయాన్ని ప్రజలకు గుర్తు చేయాలి.

ప్రతిపక్ష పార్టీలు మరో విషయాన్ని కూడా ఓటర్ల దృష్టికి తేవాల్సి ఉంది. ఒకవేళ తాము ఈ కార్యక్రమానికి హాజరైతే ఓ బీజేపీ నాయకుడి వెనుక నిలబడాల్సి వస్తుందని, ఆయన సామాజిక మాధ్యమాలన్నింటినీ తన చెప్పుచేతల్లో ఉంచుకున్నారని, వాటి ద్వారా ఎన్నికలలో విజయం సాధించడానికి ప్రచారం ప్రారంభిస్తారని తెలియజేయాలి. 'ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థకు మీరే గౌరవనీయులైన రక్షకులు. ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగం నడుపుతుంది. భారత్ సహా ఏ ప్రజాస్వామ్య దేశంలో ఏ రాజ్యాంగం అయినా ప్రధానిని నిరంకుశుడుగా, మత పెద్దగా ఉండేందుకు అనుమతించదు. మనది రాచరికం కాదు' అని బీజేపీయేతర పార్టీల నాయకులు ఓటర్లకు తెలియజేయాలి.

ఓటర్లకు ఏం చెప్పాలి?

ఈ పరిస్థితులలో ప్రతిపక్షాలు ఓటర్లకు ఏం చెప్పాలి? రాముడు రాజకీయాలకు అతీతుడన్న విషయాన్ని ప్రజల మనసులో నాటాలి. ఎన్నికలలో విజయం సాధించాలని కోరుకుంటున్న రాజకీయ పార్టీకి ప్రజల మత విశ్వాసాలు సాధనంగా మారడాన్ని అనుమతించకూడదని స్పష్టం చేయాలి. ఓ హిందువు, రాముడిని విశ్వసించే వాడు బీజేపీకి ఓటరు కానక్కరలేదని నచ్చచెప్పాలి. సుప్రీంకోర్టు తీర్పు మేరకే రామ మందిరాన్ని నిర్మించారన్న వాస్తవాన్ని ప్రతిపక్షాలు ప్రజలకు గుర్తు చేయాలి.



స్వామి నిశ్చలానంద సరస్వతిజీ | స్వామి భారతీ కృష్ణాజీ | స్వామి అభిముక్తేశ్వరానంద్ జీ | స్వామి సదానంద్ మహారాజాజీ

రాముడి కోసం కాదు ఎన్నికల కోసమే ఇలా ఆలయాన్ని ప్రారంభిస్తున్నారన్న సత్యాన్ని బట్టబయలు చేసిన నలుగురు శంకరాచార్యులు రామమందిర ప్రారంభ ఆహ్వానాన్ని తిరస్కరించారు.

పౌరులు ఇలా ప్రశ్నించాలి

ఏ రాజకీయ పార్టీకైనా ఓటు వేయాలని అనుకునే పౌరుడు తన రోజువారీ జీవితంపై ప్రభావం చూపే అంశాలపై ప్రశ్నించాలి. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఓటర్లు మోడీ ప్రభుత్వాన్ని ఏమని అడగాలంటే... ఉద్యోగావకాశాలు కల్పించేందుకు మీరు ఏం చేశారు? ధరలను అదుపు చేసేందుకు ఏం చేశారు? ప్రజలకు ఆరోగ్యం, విద్య అందుబాటులో ఉంచేందుకు ఏం చేశారు? మన సరిహద్దులు సురక్షితంగా, భద్రంగా ఉండేందుకు ఏం చేశారు?... ఈ ప్రశ్నలన్నీ సంధించాలి.

అయోధ్య రామాలయ ప్రారంభోత్సవానికి కాంగ్రెస్ దూరం

న్యూఢిల్లీ : అయోధ్య రామాలయ ప్రారంభోత్సవానికి తాము హాజరుకావడం లేదని కాంగ్రెస్ ప్రకటించింది. అది బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన పొలిటికల్ ప్రాజెక్ట్ అని వ్యాఖ్యానించింది. 'మతం అనేది వ్యక్తిగత అంశం. కానీ ఆర్‌ఎస్‌ఎస్/ బీజేపీ ఈ అయోధ్య రామాలయ అంశాన్ని పొలిటికల్ ప్రాజెక్టుగా మార్చాయి. ఆలయ నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. 2019లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి, రామభక్తుల మనోభావాలను గౌరవిస్తూ.. మర్యాదపూర్వకంగా ఈ ఆహ్వానాన్ని తిరస్కరిస్తున్నాం' అని కాంగ్రెస్ వెల్లడించింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, అగ్ర నాయకురాలు సోనియా గాంధీ, సీనియర్ నేత అధీర్ రంజన్ చౌధరికి ఆహ్వానం అందిన విషయం తెలిసిందే.

కార్మిక వ్యతిరేక విధానాలపై 19న సదస్సు 26న ట్రాక్టర్ ర్యాలీ

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు మల్లు నాగార్జున్‌రెడ్డి



నవతెలంగాణ-సూర్యాపేట

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, వ్యవసాయ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 19న సూర్యాపేటలో నిర్వహించనున్న కార్మిక, కర్షక సదస్సును జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు మల్లు నాగార్జున్‌రెడ్డి పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని స్థానిక మల్లు వెంకట నర్సింహారెడ్డి భవన్‌లో బుధవారం నిర్వహించిన సీఐటీయూ, తెలంగాణ రైతుసంఘం, తెలంగాణ వ్యవసాయకార్మిక సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం పదేండ్లకాలంలో అనుసరించిన విధానాల మూలంగా దేశం దివాలా తీసిందన్నారు. ప్రజల సంపద అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ శక్తులకు అప్పనంగా కట్టబెట్టిందన్నారు. దేశానికి తిండి పెట్టే రైతాంగంపై అనేక భారాలు మోపిందన్నారు. కార్మికుల హక్కులను కాలరాసే విధంగా కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చిందని చెప్పారు. వామపక్షాల పోరాట ఫలితంగా వచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని ఈ పదేండ్లకాలంలో పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపాధి కూలీల జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధానం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిబంధన పెట్టడం సరికాదన్నారు. రానురాను బడ్జెట్ తగ్గిస్తూ ఉపాధిహామీ చట్టానికి తూట్లు పొడుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ ఈనెల జనవరి 26న ట్రాక్టర్ ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. దేశవ్యాప్తంగా బీజేపీ అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక, మతోన్మాద విధానాలను ప్రజలకు వివరించేందుకు ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేస్తామన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ఓటమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎం.రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు, అధ్యక్షులు ములకలపల్లి రాములు, జిల్లా ఉపాధ్యక్షులు పులుసు సత్యం, రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దండ వెంకటరెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు కొప్పుల రజిత, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ చెరుకు ఏకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మరో 275 బస్సులు కొనుగోలు

'మహాలక్ష్మి' రద్దీ నివారణ కోసం...

- జులైలో వెయ్యి అద్దె బస్సులు
- కండక్టర్ కారుణ్య నియామకాలు : రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి
- రెగ్యులర్ ప్రాతిపదికన నియమించండి-కార్మిక సంఘాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీఎస్‌ఆర్టీసీలో మరో 275 బస్సుల్ని కొనుగోలు చేస్తున్నట్టు రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గత నెలలో ఆర్టీసీలోకి 80 కొత్త బస్సులు వచ్చాయన్నారు. ఈ ఏడాది జులై నాటికి ప్రయాణీకుల సౌకర్యార్థం వెయ్యి అద్దెబస్సులు వస్తాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' స్కీం ద్వారా మహిళల ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యాన్ని ఇప్పటి వరకు 9 కోట్ల మంది వినియోగించుకున్నారని తెలిపారు. మహాలక్ష్మి పథకం వల్ల ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నదనీ, అదనపు బస్సులు వస్తే ఆ రద్దీని కొంత నివారించుగలుగుతామని బుధవారంనాడొక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

కండక్టర్ కారుణ్య నియామకాలు

పదేండ్లుగా కండక్టర్ కారుణ్య నియామకాల కోసం ఎదురు చూస్తున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కారుణ్య నియామకాల ద్వారా 813 మందిని కండక్టర్లుగా తీసుకోవాలని నిర్ణయించినట్టు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. టీఎస్ ఆర్టీసీలో పని చేస్తూ విధి నిర్వహణలో మరణించిన సిబ్బంది వారసులకు కారుణ్య నియామకాల కింద కండక్టర్ పోస్టులను భర్తీ చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించామన్నారు. ఆర్టీసీలో బ్రెడ్ విన్నర్ (కారుణ్య నియామకాలు), మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ స్కీమ్ కింద ఉద్యోగుల జీవిత భాగస్వామి లేదా పిల్లలకు వారి విద్యార్హతల ప్రకారం ప్రత్యామ్నాయ ఉద్యోగాలు కల్పిస్తున్నామన్నారు. ఈ నియామకాల ద్వారా హైదరాబాద్ (66), సికింద్రాబాద్ (126). రంగారెడ్డి (52), నల్గొండ (56), మహబూబ్‌నగర్ (83), మెదక్ (93), వరంగల్ (99), ఖమ్మం (53), అదిలాబాద్ (71), నిజామాబాద్ (69), కరీంనగర్ (45) రీజియన్ల నుంచి మొత్తం 813 కండక్టర్ పోస్టులను సంస్థ భర్తీ చేస్తామని తెలిపారు.

రైలు ప్రమాదంపై మంత్రి పొన్నం విచారం

నాంపల్లి రైల్వే స్టేషన్‌లో చార్మినార్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పడంపై రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ విచారం వ్యక్తం చేశారు. పట్టాలు చిన్నగా పక్కకి ఒరగడంతో పెను ప్రమాదం తప్పిందని ఆయన తెలిపారు. హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రిగా ఘటనకు గల కారణాల పై ఆయన అధికారులతో ఆరా తీశారు. జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండి సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గాయపడిన ప్రయాణికులకు సరైన వైద్యం అందించాలని సూచించారు.



బట్టల వ్యాపారం ముసుగులో డ్రగ్స్ దందా

- రాజస్థాన్ టు హైదరాబాద్‌కు హెరాయిన్
- ఇద్దరిని అరెస్టు చేసిన ఎస్‌వోటీ పోలీసులు
- 80 గ్రాముల హెరాయిన్ స్వాధీనం

నవతెలంగాణ-సిటీబ్యూరో

బట్టల వ్యాపారం ముసుగులో రాజస్థాన్ నుంచి హైదరాబాద్‌కు హెరాయిన్ సరఫరా చేస్తున్న ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితులను ఎస్‌వోటీ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.50లక్షల విలువగల 80గ్రాముల హెరాయిన్, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం నేరేడ్‌మెట్‌లోని రాచకొండ సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో సీపీ సుధీర్‌బాబు వివరాలు వెల్లడించారు. రాజస్థాన్‌కు చెందిన అశోక్‌కుమార్ బీ-ఫార్మసీ చదువుతున్నాడు. మరో బాలునితో కలిసి మాదక ద్రవ్యాలను సేవించేవాడు. వాటికి బానిసైన ఇద్దరికీ డబ్బులు లేకపోవడంతో డ్రగ్స్ సరఫరా చేసి సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో రాజస్థాన్‌కు చెందిన ఓ డ్రగ్స్ సరఫరాదారునితో చేతులు కలిపారు. గ్రాము హెరాయిన్‌ను రూ.5000కు కొనుగోలు చేసిన నిందితులు కావాల్సిన వారికి, తెలిసిన వారికి రూ.6000కు విక్రయించారు. దాంతో సులువుగా డబ్బులు వస్తుండటంతో హైదరాబాద్‌లో సైతం హెరాయిన్ విక్రయించాలని ఆలోచించిన నిందితులు బట్టల వ్యాపారం పేరుతో తీసుకొస్తున్నారు. గ్రాము హెరాయిన్ రూ.10వేల నుంచి 12 వేల వరకు విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎల్బీనగర్ ఎస్‌వోటీ పోలీసులు, హయత్‌నగర్ పోలీసులతో కలిసి హయత్‌నగర్ శివారు ప్రాంతంలో ప్రత్యేక నిఘా వేసి నిందితులను అరెస్టు చేశారు. మాదక ద్రవ్యాలను విక్రయించినా, సరఫరా చేసినా, వినియోగించినా చట్టప్రకారం నేరమని, వారికి 10ఏండ్లు లేదా యావజ్జీవ జైలు శిక్షతోపాటు జరిమానా పడే అవకాశముందని సీపీ తెలిపారు. డ్రగ్స్ వినియోగించి జీవితాన్ని పాడుచేసుకోవద్దన్నారు. ఈ సమావేశంలో ఎస్‌వోటీ డీసీపీ కే.మురళీధర్, ఇన్‌స్పెక్టర్ సుధాకర్, హయత్‌నగర్ పోలీసులు ఉన్నారు.

రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కుతున్న కేంద్రం

- రాజకీయాల్లో మతాన్ని జొప్పించి లబ్దిపొందే యత్నం : కేవీపీఎస్



నవతెలంగాణ-ముషీరాబాద్

రాజ్యాంగ విలువలను కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కుతోందని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు అన్నారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవం, లూయిస్ బ్రెయిలీ 215వ జయంతి వారోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'మతోన్మాద ప్రమాదం-నేటి సవాళ్లు' అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ.. మతాన్ని రాజకీయాల్లో ఉపయోగించి లబ్ది పొందాలని బీజేపీ ప్రయత్నం చేస్తున్నదని తెలిపారు. అన్ని మతాల ప్రజలు గ్రామాల్లో సోదరభావంతో ఉంటారని, వారి మధ్య మత విద్వేషాలు పెట్టి చీల్చుతున్నారని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం కులమతాలకతీతంగా ప్రజలంతా ఉద్యమం చేశారనే విషయం కేంద్ర ప్రభుత్వం గుర్తించాలన్నారు. నోట్ల రద్దు, జీఎస్టీ వంటి అనాలోచిత నిర్ణయాలు దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీశాయని చెప్పారు. దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోతోందని, మహిళలపై లైంగికదాడులకు పాల్పడిన వారికి బీజేపీ ప్రభుత్వాలు అండగా ఉంటున్నాయని విమర్శించారు.

ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకట్ మాట్లాడుతూ.. వికలాంగుల పేరు దివ్యాంగులుగా మర్చి కేంద్ర ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు. దేశ వ్యాప్తంగా వికలాంగుల కోసం ఉన్న 9 విద్యాసంస్థలను విలీనం చేయడానికి కేంద్రం కుట్రలు చేస్తోందని, వికలాంగుల చట్టాలను అమలు చేయడం లేదని అన్నారు. ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, పెన్షన్ రూ.6 వేలకు పెంచాలని అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో వికలాంగులకు ఉచిత ప్రయాణం అమలు చేయాలన్నారు. వికలాంగుల హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ కేంద్ర కమిటీ సభ్యులు ఆర్.వెంకటేష్, సాయమ్మ, జెర్కొని రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.మధుబాబు, కాశప్ప, నాగలక్ష్మి, రాష్ట్ర సహాయ కార్యదర్శులు బాలేశ్వర్, దశరథ్ పాల్గొన్నారు.

బాధను దిగమింగి.. ధైర్యం చెప్పా..!

గత ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేసింది

- ఇందిరమ్మ రాజ్యంలోనే నిరుద్యోగ యువతకు భవిష్యత్తు : అభినందన సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ఈ నెలాఖరుకల్లా అందరికీ రైతు భరోసా: మంత్రి తుమ్మల

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

"గతేడాది ఇదే సమయంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం నాతో పాటు నన్ను నమ్ముకున్న వాళ్లను అనేక ఇబ్బందులు, అవమానాలకు గురిచేసింది. ఆ సమయంలో నేను బాధను దిగమింగి.. నా అనుచరులకు ధైర్యం చెప్పా.. బాధను వ్యక్తపరిస్తే నా వాళ్లు ఎక్కడ ఇబ్బంది పడతారోనని ఒంటరిగా కూర్చొని కన్నీళ్లు పెట్టుకున్నా.." అని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. రైట్ చాయిస్ అకాడమీ ఆధ్వర్యంలో ఖమ్మం పట్టణంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో బుధవారం ఏర్పాటు చేసిన అభినందన సభ, కూసుమంచిలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ ఏడాది రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేయబోతున్నామని.. టీఎస్పీఎస్సీ ప్రక్షాళనకు మొదటి అడుగు పడిందని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యంలో అన్ని వర్గాల వారికి న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు.

శపథం నెరవేర్చుకున్నా..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఎవరిని అసెంబ్లీ గేటు తాకనీయనన్న తన శపథం నెరవేర్చుకున్నానని.. అన్నం తినేటప్పుడు ఓ మెతుకు జారి పడినట్టు ఒక్క సీటు మాత్రమే ఆ పార్టీ గెలుచుకోగలిగిందన్నారు. ఇందిరమ్మ రాజ్యం కోసం ప్రజలు అనేక బాధలకు ఓర్చారని తెలిపారు. 'కర్కట ధమనికలు' ఎవరో ప్రజలు తేల్చారన్నారు. ఖమ్మంలో గత ప్రభుత్వ హయాంలో చోటు చేసుకున్న ఆక్రమణలను వెలికి తీశామని చెప్పారు. ఈ సందర్భంగా.. పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రస్థానాన్ని లఘుచిత్రం రూపంలో ప్రదర్శించారు. ఈ డాక్యుమెంటరీ రూపకర్త రైట్ చాయిస్ అకాడమీ చైర్మెన్ మెండెం కిరణ్ కుమార్‌ను పొంగులేటితో పాటు పలువురు అభినందించారు. ఈ సందర్భంగా రైట్ చాయిస్ అకాడమీ ఆధ్వర్యంలో గతేడాది నిర్వహించిన నిరుద్యోగుల సదస్సు నుంచే బీఆర్‌ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలపై తాను గళం వినిపించిన విషయాన్ని పొంగులేటి గుర్తు చేసుకున్నారు.

ఈ నెలాఖరుకల్లా అందరికీ రైతుభరోసా : మంత్రి తుమ్మల

ఈ నెలాఖరుకల్లా అందరికీ రైతు భరోసా పంట పెట్టుబడి లభిస్తుందని వ్యవసాయ, సహకార, చేనేత, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. పాలేరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రారంభోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. చరిత్ర తిరగబడిందని, అందర్నీ పీడించిన ఆనాటి నాయకులు మీ శక్తి ముందు నిలువలేకపోయారన్నారు. వచ్చే ఖరీఫ్ నాటికి గోదావరి జలాలు జిల్లాను సస్యశ్యామలం చేస్తాయని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు సొరంగం పనులు ఆలస్యం అవుతున్నాయన్నారు. పాలేరు - ఖమ్మం ఒక్కటే అని పునరుద్ఘాటించారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, టీపీసీసీ నాయకులు రాయల నాగేశ్వరరావు, మద్ది శ్రీనివాసరెడ్డి, సాధు రమేష్ రెడ్డి, తుంబూరు దయాకర్ రెడ్డి, విజయా బాయి, మద్దినేని బేబీ స్వర్ణకుమారి, కోట రాంబాబు, చావ శివరామకృష్ణ, రామసహాయం నరేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆగ్రహం అనేది విషం తాగడం లాంటిది, అది
మీ శత్రువులను కాదు.. మిమ్మల్ని చంపుతుంది - నెల్సన్ మండేలా


సంపాదకీయం

ప్రజల్ని పట్టించుకోండి...

కమిటీలు.. న్యాయ విచారణలు.. విజిలెన్సు ఎంక్వైరీలు... ఇప్పుడు రాష్ట్రంలో వీటి కాలం నడుస్తోంది. గత గులాబీ ప్రభుత్వం చేపట్టిన వివిధ ప్రాజెక్టులు, కార్యక్రమాలు, పనులపై రేవంత్ రెడ్డి నేతృత్వంలోని హస్తం సర్కార్... పలు కమిటీలను వేసింది. వాటి ఆధారంగా సంబంధిత అధికారులు పని మొదలుపెట్టారు. మరోవైపు ప్రజాపాలన, అభయహస్తం దరఖాస్తులపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో ప్రభుత్వం ఒక మంత్రివర్గ ఉపసంఘాన్ని కూడా నియమించింది. ఇవన్నీ మంచిదే. ఆయా కమిటీలు తమకు అప్పగించిన పనిని త్వరితగతిన పూర్తి చేసుకుని సత్వరమే ప్రజల ముందు వాస్తవాలుంచాలి. తద్వారా ఎవరిది తప్పు..? ఎవరిది ఒప్పు..? అనేది తేలాలి.

ఇక్కడ ఏ కమిటీ అయినా.. ఏ విచారణ అయినా పక్కాగా, పారదర్శకంగా జరగాలి. అలాగాక పార్టీల ప్రయోజనాల కోసమో లేక కక్ష సాధింపు చర్యల కోసమో వాటిని ఉపయోగించుకుంటే అది అర్థం పర్థం లేనిదవుతుంది. ఉమ్మడి రాష్ట్రంలో అటు టీడీపీ హయాంలో గానీ, ఇటు కాంగ్రెస్ జమానాలోగానీ జరిగింది అదే. వివిధ కుంభకోణాలు, స్కాములు, అవినీతి, అక్రమాలపై న్యాయ విచారణకు ఆదేశిస్తున్నామని చెప్పటం, వాటిని ఉపయోగించి చట్టసభల్లో ప్రత్యర్థులపై ఎదురుదాడి చేయటమనేవి పరిపాటిగా మారేవి. దీంతో అసెంబ్లీలో ప్రజా సమస్యలు చర్చకు రాకుండా పక్కదోవ పట్టటం షరా మామూలుగా మారింది.

ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దర్యాప్తును ప్రారంభించింది. ధరణి పోర్టల్‌లోని చిక్కులు, సమస్యలు, సవాళ్లను పరిష్కరించేందుకోసం కిసాన్ కాంగ్రెస్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి అధ్యక్షతన మరో ప్రత్యేక కమిటీని వేసింది. కేసీఆర్ హయాంలో హైదరాబాద్‌లో ఫార్ములా ఈ రేస్‌కు సంబంధించి 'వ్యక్తుల కోసం వ్యవస్థను వాడుకున్నారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన డిప్యూటీ సీఎం భట్టి



విక్రమార్క... ఈ తతంగంపై న్యాయపరంగా చర్యలు తీసుకుంటామంటూ ప్రకటించారు. ప్రతిగా ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ఈ ఆరోపణలపై ఎదురుదాడికి దిగిం ది. ఆరు గ్యారెంటీల అమలుపై తప్పించుకు నేందుకు కాంగ్రెస్ ఇలాంటి నాటకాలాడుతోందని కారు పార్టీ విమర్శ. అధికారం కోల్పోయిన రోజు నుండి చేస్తున్న విమర్శేమంటే ఇలా టైం పాస్ చేసి, ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల కోడ్‌ను బూచిగా చూపటం ద్వారా ప్రజల్ని మభ్యపెట్టేందుకు రేవంత్ సర్కార్ కుట్రలు పన్నుతోందన్నది ప్రస్తుతానికి పాచిపాటే.

ఇది రెండు పార్టీల రాజకీయ కొట్లాటని ఫిబ్రవరిలో నిర్వహించబోయే ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాల్లో తారాస్థాయికి చేరతుందని కొందరు రాజకీయ విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తద్వారా గత తప్పుల నుంచి తప్పించుకునేందుకు బీఆర్ఎస్.. ఇప్పటి హామీల ప్రస్తావన రాకుండా చూసుకునేందుకు కాంగ్రెస్... శతవిధాలా ప్రయత్నిస్తాయని వారి అంచనా. ఇది జరగనివ్వరాదు. ఎందుకంటే... నీళ్లు, నిధులు, నియామకాలనే మూడు నినాదాలే ప్రధాన అజెండాగా తెలంగాణ కోసం జనం కొట్లాడారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో తమ ఆశలు, ఆకాంక్షలు తీరని కారణంగానే మార్పును కోరుకుంటున్నామంటూ వారు మొన్నటి ఎన్నికల తీర్పుతో ప్రకటించారు. మరి అలాంటి జనం ఓటును, వారి తీర్పును అధికార, ప్రధాన ప్రతిప క్షాలు గౌరవిస్తాయా? లేదా..? అన్నది ముమ్ముందు తేలనున్నది.

ఇక్కడ ఇంకో విషయం చెప్పక తప్పదు. రాష్ట్రానికి సంబంధించిన అసలు విషయాలను పక్కనబెట్టి కొసరు కబుర్లన్నట్టు...'కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతోకాలం మనలేదు. త్వరలోనే మన సర్కార్ కొలువు దీరుతుంది...' అంటూ బీఆర్ఎస్ నేతలు పదేపదే వ్యాఖ్యానించటం, రాజాసింగ్ ప్రకటనలు, ప్రభుత్వాన్ని కూల్చేస్తామనేందుకు ఇచ్చే సంఖ్యలు రకరకాల వ్యాఖ్యానాలకు దారితీస్తున్నాయి. ఒక విషయం స్పష్టం. దేశంలో ఎక్కడా బీజేపీయేతర ప్రభుత్వాలను అధికారంలోకి రానివ్వం, వచ్చిన ఎక్కువకాలం బతకనివ్వమనేది కాషాయ దళపతుల నీతి,రీతి బాగుంది.

తెలంగాణ రావడం, కేసీఆర్ కొలువుదీరటం, 2018లో మళ్లీ గెలవడం ఇక ఏమి చేసినా చెల్లు తుందనే భావన బీఆర్ఎస్ నేతల్లో పెరిగిపోయింది. ఆయనే ఇంజనీర్ల అవతారమెత్తినట్లు చెప్పుకున్న బీఆర్ఎస్ నేతలకు కాళేశ్వరం కుంగుబాటుతో గొంతులో వెలక్కాయ పడ్డట్టైంది. 'అఫెన్స్ ఈజ్ దిబెస్ట్ వే ఆఫ్ డిఫెన్స్' అనే సూత్రాన్ని నేడు బీఆర్ఎస్ నేతలు అనుసరిస్తున్నారు. ఇది రెండు పార్టీల సమస్యగా మారకూడదు. నాలుగు కోట్ల ప్రజల బాగోగులకు సంబంధించిన అంశం. కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయించుకోవడం ప్రజల, ప్రజాసంఘాల బాధ్యత.

> **తెలంగాణ రావడం, కేసీఆర్ కొలువుదీరటం, 2018లో మళ్లీ గెలవడం ఇక ఏమి చేసినా చెల్లుతుందనే భావన బీఆర్ఎస్ నేతల్లో పెరిగిపోయింది. ఆయనే ఇంజనీర్ల అవతారమెత్తినట్లు చెప్పుకున్న బీఆర్ఎస్ నేతలకు కాళేశ్వరం కుంగుబాటుతో గొంతులో వెలక్కాయ పడ్డట్టైంది. 'అఫెన్స్ ఈజ్ దిబెస్ట్ వే ఆఫ్ డిఫెన్స్' అనే సూత్రాన్ని నేడు బీఆర్ఎస్ నేతలు అనుసరిస్తున్నారు. ఇది రెండు పార్టీల సమస్యగా మారకూడదు. నాలుగు కోట్ల ప్రజల బాగోగులకు సంబంధించిన అంశం. కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయించుకోవడం ప్రజల, ప్రజాసంఘాల బాధ్యత.**

ఆదివాసుల ఆత్మబంధువు 'హైమండార్ఫ్'



మన దేశం కాదు, మన ప్రాంతం కాదు, మన భాష కూడా తెలియదు. ఆయనకు తెలిసిందల్లా ఆదివాసీలకు అభివృద్ధిని పరిచయం చేయడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు గిరిజనుల దరికి చేరేలా చూడటం. ఆదివాసి గూడాలలో చెరగని ముద్ర, శాశ్వత స్థానం పదిలపరుచుకున్న ఆదివాసీల ఆత్మబంధువు మానవ పరిణామ శాస్త్రవేత్త కీ.శే. ప్రొఫెసర్ క్రిస్టఫర్ వాన్ ఫ్యూరర్ హైమండార్ఫ్. ఈయన ఆస్ట్రియా దేశం వియన్నా నగరంలో 1909 సంవత్సరంలో జన్మించాడు. లండన్ విశ్వవిద్యాలయం నుంచి మానవ పరిణామ శాస్త్రంలో డాక్టరేట్ పొందారు. 1936లో ఉద్యోగరీత్యా భారత్‌కు వచ్చి నిజాం కాలేజీలో ప్రొఫెసర్‌గా పనిచేశాడు. 1928 నుండి 1940 వరకు బ్రిటిష్ పాలనలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కెరమెరి మండలం జోడేఘాట్ అటవీ ప్రాంతంలో కుంరంభీం ఆధ్వర్యంలో జల్, జంగిల్, జమీన్ నినాదంతో నిజాం సైనికులకు, గోండులకు మధ్య తీవ్ర పోరాటం జరిగింది. నిజం సైన్యాన్ని ముప్పు తిప్పలు పెట్టిన తీరు నేటికీ ఆదివాసీలు చర్చించుకుంటూనే ఉంటారు. నాడు ద్రోహి ఇచ్చిన సమా చారంతో జోడేఘాట్ గుట్టల్లో ఈ యుద్ధ వీరుడు అసువులు బాశారు.

ఈ నేపథ్యంలో ఆదివాసీల తిరుగు బాటుకు గల కారణాలను మూలాలను వెతకాలని పరిశోధించడానికి నిజాం ప్రభుత్వం ప్రొఫెసర్ హైమండార్ఫ్‌ను ఆదిలాబాద్‌కు పంపింది. అలా 1940 సంవత్సరంలో ఆయన తన సతీమణి బెట్టి ఎలిజబెత్‌ను వెంటబెట్టుకొని, ఆదివాసీల జీవితాలపై అధ్యయనం చేయడానికి జైనూర్ మండలం మార్లవాయి గ్రామంలో అడుగు పెట్టాడు. వారి రాక గిరిజనుల తలరాతలు మార్చింది. అక్కడ చుట్టూ కొండల మధ్య జీవనం సాగిస్తున్న లచ్చు పటేల్ వీరికి ఆవాసం కల్పించాడు. ఇతడు ఆదివాసీల జీవితాలను పరిశోధించడమే కాకుండా వారి సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి ప్రభుత్వానికి నివేదికలు పంపారు. ఆదివాసీల అభివృద్ధికి సూచనలు చేయడమే కాకుండా పలు ప్రామాణిక గ్రంథాలు రాశారు. "ది గోండ్స్ ఆఫ్ అదిలాబాద్" అనే గ్రంథంలో ఆదివాసీల జీవన విధానం, సంస్కృతి, సాంప్రదాయాలను పొందుపరిచారు శక్తి వంచన లేకుండా పరిశోధన చేసి ఆదివాసీలకు జల్, జంగిల్, జమీన్‌పై పూర్తి అధికారాలు ఉండాలని గ్రంథంలో సూచించారు. హైమాండార్ఫ్ ఆదివాసీల జీవన విధానం, ఉద్యమాలను నిజం సర్కారుకు నివేదించడంలో వారికి సర్వహక్కులు కల్పించారు. లక్షల ఎకరాలు ఆదివాసీలకు పట్టాలు చేయించారు. వారికి జీవన భద్రత కల్పించారు. దీంతో వారిలో మమేకమైన మూలంగా గిరిజనుల్లో శాశ్వతంగా నిల్చి, వారి గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ఆదివాసీలతో ఏర్పడిన అనుబంధానికి ప్రత్యేకగా డార్ఫ్ దంపతులు తమ కుమారుడికి లచ్చు పటేల్ అని గిరిజనుడి పేరు పెట్టుకున్నారు.

కొంతకాలానికి 1990లో బెట్టి ఎలిజబెత్ కన్ను మూయడంతో ఆమె కోరిక మేరకు మార్లవాయి గ్రామంలో గోండు సాంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు జరిపించారు. 1995లో ఇంగ్లాండులో మృతి చెందిన హైమండార్ఫ్‌కు కూడా మార్లవాయిలోనే ఎలిజిబెత్ సమాధి పక్కన ఇతని సమాధి కట్టారు. వారి విగ్రహాలను కూడా గ్రామంలో ఏర్పాటు చేశారు. అయితే డార్ఫ్ మరణం తర్వాత 17 సంవత్సరాలకు అం టే 2012 ఫిబ్రవరి 27న అతని కుమారుడు లచ్చు పటేల్ అలియాస్ నికోలస్ తండ్రి అస్థికలను మార్లవాయికి తీసుకు వచ్చి తల్లి సమాధి పక్కన ఉన్న తండ్రి సమాధిలో ఐక్యం చేశాడు. ప్రతి సంవత్సరం ఇక్కడి ఆదివాసులు హైమాండార్ఫ్ వర్ధంతిని ప్రతి యేటా జనవరి 11న గోండు సాంప్రదాయం ప్రకారం నిర్వహించి గిరిజనుల అభివృద్ధి కోసం వారు అందించిన సేవలను, సహకారాన్ని స్మరించుకుంటున్నారు. ప్రతి ఏడాది పుష్య మాసంలో నిర్వహించే కేస్లాపూర్ నాగోబా జాతరలో గిరిజన దర్బార్ ఏర్పాటు చేయడం ఆయన పుణ్యమే. ఈ విధంగా హైమండార్ఫ్ ఒక శాస్త్రవేత్తగానే మిగిలిపోకుండా ఆదివాసీల బతుకుల్లో వెలుగులు నింపిన బాంధవ్యుడుగా చరిత్రకెక్కాడు.

(నేడు హైమాండార్ఫ్ దంపతుల స్మృతిదినం)

- పెనుక ప్రభాకర్, 9494283038

కాళేశ్వరంలో ఏం జరుగుతోంది?




సారంపల్లి మల్లారెడ్డి
9490098666

గోదావరి నదిపై 2016 మే 2న కన్నెపెల్లి వద్ద మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు కాళేశ్వరం రీ-డిజైన్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ప్రాణహిత-చేవెళ్ళ పథకాన్ని రూ. 38,500 కోట్లతో కాంగ్రెస్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.యస్. రాజశేఖర్‌రెడ్డి ప్రాణహిత నదిపై కౌటాల వద్ద ప్రా జెక్టు నిర్మించి, అక్కడి నుండి రంగారెడ్డి జిల్లా చేవెళ్ళ వరకు సాగునీటి వనరులు కల్పించాలని నిర్ణయించారు. ఈ పథకం ద్వారా 18.50లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందించాలి. దీనికి 2014 వరకు రూ.5522.79 కోట్లు వ్యయం చేశారు. ఆ తరువాత వచ్చిన టిఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకాన్ని రీ-డిజైన్ చేసింది. గోదావరి నదిపై మేడిగడ్డవద్ద, ప్రధాన జలశయం (16.17 టిఎంసీలు) నిర్మించి దానికి ఎదురుగా 46 కి.మీ దూరంలో అన్నారం ప్రాజెక్టును (10.87 టిఎంసీలు) నిర్మించాలి. దానికి ఎగువన 31.5 కి.మీ దూరంలో సుందిల్ల ప్రాజెక్టు (8.83 టిఎంసీలు) నిర్మించి ఎగువకు 31 కిలోమీటర్ల దూరంలో ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి నీటిని పంపు చేయాలి. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుండి మిడ్ మానేర్ ద్వారా మల్లన్నసాగర్, రంగనాయక సాగర్, కొండపోచమ్మ, బస్వాపూరం ప్రాజెక్టు లకు నీటిని సరఫరా చేయాలి.

ఈ ప్రాజెక్టులో 20 లిఫ్టులు, 19 పంపు హౌజ్‌లు, 147.1 టిఎంసీల నిల్వతో 19 జలశయాలు నిర్మాణం చేపట్టాలి. కేసీఆర్ మానస పుత్రికగా పేరుగాంచిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 19.63 లక్షల ఎకరాల ఆయకట్టుతోపాటు మరో 18.82 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరికరించడానికి, హైదరాబాద్ నగరానికి 30 టిఎంసీల నీటిని సరఫరా చేస్తూ, పారిశ్రామిక అవసరాలకు 16 టిఎంసీలు కేటాయిస్తూ మొత్తం ఈ ప్రాజెక్టు ద్వారా 225 టిఎంసీల నీటిని వినియోగించాలి. కాళేశ్వరానికి చెందిన మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల, ఎల్లంపల్లి ప్రాజెక్టులతో పాటు మొత్తం 19 జలాశయాలలో 147 టిఎంసీలు నిల్వ ఉన్నప్పటికీ 225 టిఎంసీలు వినియోగించాలి. ఈ ప్రాజెక్టుకు అత్యంత వేగంగా నిర్మాణం చేయడానికి బడ్జెట్ కేటాయింపులతో పాటు, కార్పొరేషన్ ఏర్పాటు చేసి బ్యాంకుల నుండి రుణాలు తీసుకొచ్చారు. 2022లో నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ ప్రాజెక్టులను ప్రభుత్వ అధీనంలోకి తెచ్చారు. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ ప్రాజెక్టులను రాష్ట్ర ప్రజలకు అంకితం కూడా చేశారు.

ప్రాజెక్టుకు ఏం జరిగింది ?

2023 అక్టోబర్ 21న మేడిగడ్డ 7వ బ్లాక్‌లోని 19-21 పియర్స్ కుంగిపోయాయి. పియర్స్ కుంగడంతో మొత్తం ప్రాజెక్టు పైనున్న రహదారి కూడా కుంగింది. ప్రాజెక్టుపై నుండి మహారాష్ట్రకు గల రవాణా సౌకర్యాన్ని నిషేధించారు. అదే సందర్భంలో అన్నారం ప్రాజెక్టు ముందు భాగంలో బుంగపడి నీరు బయటకు రావడం జరిగింది. ఈ ప్రమాదాలు జరుగడంతో రెండు ప్రాజెక్టులలోని నీరు పూర్తిగా తొలగించారు. కేంద్రం నుండి ప్రాజెక్టు సెఫ్టి డిపార్ట్‌మెంట్ వారు వచ్చి పరిశీలించి వెళ్లారు. ఒకవైపున రాష్ట్రంలో శాసనసభకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ప్రాజెక్టులు నిర్మాణం చేసిన ఎల్అండ్‌టి కంపెనీ వారు "ప్రాజెక్టును మెమే రిపేర్ చేస్తాం" అన్నారు. ఎన్నికల తరువాత బీఆర్ఎస్ ప్రభుత్వం మారి కాంగ్రెస్ 2023 డిసెంబర్ 9న అధికారంలోకి వచ్చింది. దీనితో నిర్మాణ కంపెనీ ఎల్అండ్‌టి తాము నిర్మాణ వ్యయం భరించలేమని రూ. 560 కోట్లు చెల్లిస్తే రిపేర్లు చేస్తామని ప్రకటించారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వంలోని ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కంపెనీకి నోటీసుమలివ్వడంతో పాటు సంబంధిత ఇంజనీర్లపై చర్యలు చేపట్టారు. దీంతో కంపెనీ వారు తామే రిపేరు చేస్తామని మరల మాట మార్చారు. 29డిసెంబర్2023న మంత్రుల బృందం ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌లతోపాటు ఇరిగేషన్ ఇంజనీరు మురళిధర్, కార్యదర్శి రజత్ కుమార్‌తో పాటు విలేకర్లు కాళేశ్వరంలో పర్యటనలు చేశారు. వీరికి ఇంజ నీరు మురళిధర్ పవర్ ప్రజెంటేషన్ ద్వారా ఈ దిగువ సమాచారాన్ని వివరించారు.



వాస్తవ ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం (29డిసెంబర్2023 నాటికి)

ప్రాజెక్టు	కార్పొరేట్ రుణం (రూ. కోట్లలో)	బడ్జెట్ (రూ. కోట్లలో)	మొత్తం (రూ. కోట్లలో)	విద్యుత్ మె.గా
2 టిఎంసీలు	44,614.06	28,885.93	73,499.99	4627.24
1 టిఎంసీలు	17,051.04	3,320.93	20,372.07	3772.76
మొత్తం	61,665.10	32,206.86	93,872.06	8,400
1. ప్రాజెక్టు ప్రతిపాదిత ఆయకట్టు			19,63,360 ఎకరాలు.	
2. 29డిసెంబర్ 2023 సృష్టించిన ఆయకట్టువరకు			98,570 ఎకరాలు	
3. ఇంకా కల్పించాల్సింది			18,64,790 ఎకరాలు	

ఇందుకు రూపొందించిన ప్రణాళిక	
1. 2024-25	2,83,404 ఎకరాలు
2. 2025-26	5,13,054 ఎకరాలు
3. 2026-27	2,91,867 ఎకరాలు
4. 2027-28	3,35,300 ఎకరాలు
5. 2028-29	4,41,165 ఎకరాలు
మొత్తం	18,64,790 ఎకరాలు

> **ప్రాజెక్టులు నిర్మాణం చేసిన ఎల్అండ్‌టి కంపెనీ వారు "ప్రాజెక్టును మెమే రిపేర్ చేస్తాం" అన్నారు. ఎన్నికల తరువాత టీఆర్ఎస్ ప్రభుత్వం మారి కాంగ్రెస్ 2023 డిసెంబర్ 9న అధికారంలోకి వచ్చింది. దీనితో నిర్మాణ కంపెనీ ఎల్అండ్‌టి తాము నిర్మాణ వ్యయం భరించలేమని రూ.560 కోట్లు చెల్లిస్తే రిపేర్లు చేస్తామని ప్రకటించారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వంలోని ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కంపెనీకి నోటీసు లివ్వడంతో పాటు సంబంధిత ఇంజనీర్లపై చర్యలు చేపట్టారు. దీంతో కంపెనీ వారు తామే రిపేరు చేస్తామని మరల మాట మార్చారు.**

ప్రాజెక్టు సమాచార వివరాలు : మొదటి 2 టిఎంసీలకు నిర్మాణ అంచనా రూ.94,413.27 కోట్లు, రెండవ 1 టిఎంసీలు నిర్మాణ వ్యయ అంచనా 33,459.01 కోట్లు. మొత్తం 1,27,872.28 కోట్లు.

ప్రాజెక్టుకు తెచ్చిన రుణాలు

బ్యాంకులు : యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంకు కన్సార్టియం, బ్యాంక్ ఆఫ్ బరోడా, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, నాబార్డ్, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ సంస్థల నుండి అప్పులు తెచ్చారు.

1. మంజూరైన అప్పులు	రూ.87,449.16 కోట్లు
2.విడుదల చేసిన అప్పు	రూ. 71,565.69 కోట్లు
3.ఇంకా రావాల్సింది.	రూ.15,883.47 కోట్లు

29.12.2023 వరకు చెల్లించిన అప్పులు

1. రూ.16,201.91 కోట్లు వడ్డీ (10.78 శాతం)
2.రూ. 4,696.38 కోట్లు అసలు
3. మొత్తం రూ. 20,898.29 కోట్లు.

ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం నుండి పదకొండు అనుమతులు వచ్చాయి. ఇంతవరకు ఈ ప్రాజెక్టులో 173 టిఎంసీలు మాత్రమే లిఫ్ట్ చేశారు. పై వ్యయ అంచనాలను పరిశీలించినప్పుడు రూ.1,27,872.28 కోట్లు కాగా, ఈ అంచనా మరింత పెరిగే అస్కారం ఉంది. ప్రస్తుతం రిపేర్లు జరిగే వరకు నీటిని నిల్వ పెట్టడం సాధ్యం కాదు. మేడిగడ్డ, అన్నారం ప్రాజెక్టులను రిపేర్లు చేయాలి. ఇందుకు జరిగే వ్యయాన్ని ఎవరు భరించాలి అన్నది నిర్ణయించాలి. ప్రస్తుత కాంగ్రెస్ మంత్రి వర్గం పర్యటించిన తరువాత కాళేశ్వరం ప్రాజెక్టుకు బదులుగా ప్రాణహిత-చేవెళ్ళ ప్రాజెక్టును నిర్మాణం చేస్తామని ప్రకటించింది. ఈ ప్రాజెక్టు ప్రారంభించబడిన కౌటాల నుండి 110 కిలో మీటర్ల దూరంలోని ఎల్లంపల్లి వరకు గ్రావిటి ద్వారానే నీరు వస్తుంది. ఎల్లంపల్లి నుండి లిఫ్టు ద్వారా దిగువ ప్రాజెక్టులకు నీటిని సరఫరా చేయాలి.ఎల్లంపల్లి ప్రాజెక్టు నుండి మిడ్ మానేర్ ద్వారా మల్లన్న సాగర్, రంగనాయక సాగర్ కొండపోచమ్మ, బస్వాపురం ప్రాజెక్టులకు నీటిని సరఫరా చేయాలి.

> **ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం నుండి పదకొండు అనుమతులు వచ్చాయి. ఇంతవరకు ఈ ప్రాజెక్టులో 173 టిఎంసీలు మాత్రమే లిఫ్ట్ చేశారు. పై వ్యయ అంచనాలను పరిశీలించినప్పుడు రూ.1,27,872.28 కోట్లు కాగా, ఈ అంచనా మరింత పెరిగే అస్కారం ఉంది. ప్రస్తుతం రిపేర్లు జరిగే వరకు నీటిని నిల్వ పెట్టడం సాధ్యం కాదు. మేడిగడ్డ, అన్నారం ప్రాజెక్టులను రిపేర్లు చేయాలి. ఇందుకు జరిగే వ్యయాన్ని ఎవరు భరించాలి అన్నది నిర్ణయించాలి. ప్రస్తుత కాంగ్రెస్ మంత్రి వర్గం పర్యటించిన తరువాత కాళేశ్వరం ప్రాజెక్టుకు బదులుగా ప్రాణహిత-చేవెళ్ళ ప్రాజెక్టును నిర్మాణం చేస్తామని ప్రకటించింది.**

టీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన "శ్రీ రాంసాగర్ పునరుజ్జీవ పథకం"

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిల్లా ఎల్లంపల్లి ద్వారా వచ్చు నీటిని శ్రీరాంసాగర్ వరద కాలువ 99వ కిలో మీటరు వద్ద నుండి ఎగువకు శ్రీరాంసాగర్‌కు నీటిని మళ్లించడానికి పథకం అమలు చేశారు. వరద కాలువ 99వ కిలోమీటరు వద్ద ప్రాజెక్టును నిర్వహించి లిఫ్టులు పెట్టారు. దానికి ఎగువన 33 కిలో మీటర్ల దూరంలో మరో లిఫ్టును అమర్చారు. దాని ఎగువన 43 కిలో మీటర్ల దూరంలో మరోక లిఫ్టును అమర్చారు. చివరికి శ్రీరాంసాగర్ వద్ద లిఫ్టు పెట్టి 4 లిఫ్టుల ద్వారా శ్రీరాంసాగర్‌కు నీటిని మళ్ళించారు. మేడిగడ్డ నుండి ఎల్లంపెల్లి వరకు 110 కిలోమీటర్లు కాగా, ఎల్లంపల్లి నుండి వరద కాలువ వరకు 32 కి.మీ కాగా, వరద కాలువ నుండి 100 కి.మీ దూరంలో గల శ్రీ రాంసాగర్‌కు నీటిని పంపిణీ చేయాలి. ఆ విధంగా శ్రీ రాంసాగర్ ఆయకట్టు విస్తరణ 4.4 లక్షల ఎకరాలకు పెరుగుతుందని అంచనా వేశారు.

ప్రస్తుతం ఈ పథకానికి 15 టిఎంసీల నీటిని ఎల్లంపల్లి నుండి వరద కాలువ ద్వారా శ్రీరాంసాగర్‌కు పంపించాలి. శ్రీరాంసాగర్ నుండి రెండవదశకు అనగా కాకతీయ కాలువ 284 నుండి 347 కి.మీ వరకు గల ఆయకట్టు వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లోని 4 లక్షల ఎకరాలకు 40 టిఎంసీలతో మెట్ట పంటలకు సాగునీటి వసతి కల్పించాలి. శ్రీ రాంసాగర్ పునరుజ్జీవ పథకం ద్వారా కాకతీయ కాలువ 2వ దశకు, వరద కాలువకు నీటి లభ్యత పెరుగుతుందని గత ప్రభుత్వం అంచనా వేసింది. ప్రస్తుతం మేడిగడ్డ, అన్నారం ప్రాజెక్టులు దెబ్బతినడంతో శ్రీరాంసాగర్ పునరుజ్జీవ పథకం కూడా పనికి రాకుండా పోయింది. ఇంత వరకు దీనికి వెచ్చించిన కోట్ల రూపాయల నిధులు దుర్వినియోగం అవుతున్నాయి. ఈ ప్రాజెక్టులపై న్యాయ విచారణ జరిపించాలని, బాధ్యులైన వారితో పాటు, ఇంజనీర్లను కూడా బాధ్యులు చేసి విచారించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. విచారణ జరపడానికి ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ కూడా అంగీకరించింది.

కొత్త క్రిమినల్ చట్టాలు-డ్రైవర్లకు ఉరితాళ్లు!



ఆర్. లక్ష్మయ్య
9971511954

ఏదైనా ఒక చట్టం చేయాలన్నా, లేక ఉన్న చట్టంలో సవరణలు చేయాలన్నా ప్రభుత్వం ముందుగా లా కమిషన్ ఆఫ్ ఇండియాను సంప్రదించాలి. అలాగే ఆ చట్టం వర్తించే తరగతికి చెందిన సంస్థలు, ప్రముఖులతో సంప్రదించాలి. ప్రస్తుత కొత్త క్రిమినల్ చట్టాలు తేవడానికి ముందు ఈ సాంప్రదాయాన్నీ ఉల్లంఘించారు. కనీసం పార్లమెంటులోనైనా సవివరమైన చర్చ జరగాలి. కానీ మొత్తం ప్రతిపక్షాన్ని సభ నుండి గెంటి వేసి ఈ చట్టాలను ఆమోదింప చేసుకున్నారు. 2023 డిసెంబర్ 21న పార్లమెంటు ఆమోదం పొందగా నాలుగు రోజుల్లోనే అంటే డిసెంబర్ 25న రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారు.

బ్రిటిష్ కాలంనాటి చట్టాలు ఇంకానా అంటూ ఇండియన్ పీనల్ కోడ్, ఎవిడెన్స్ యాక్ట్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌ల స్థానంలో మూడు కొత్త చట్టాలను కేంద్ర ప్రభుత్వం తెచ్చింది. ఒక వ్యక్తి ఉద్దేశ పూర్వకం కాని, నిర్లక్ష్యం లేదా దురుసు ప్రవర్తన వల్ల మరొకరు చనిపోతే ఇండియన్ పీనల్ కోడ్ 1860 (బ్రిటిష్ కాలం నాటి) చట్టం లోని సెక్షన్ 304 (ఏ) ప్రకారం రెండేండ్ల దాకా జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ విధించవచ్చు. కానీ కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన భారతీయ న్యాయ సంహిత-2023 లోని సెక్షన్ 106(1) ప్రకారం ఐదేండ్ల దాకా జైలు శిక్ష, జరిమానా విధించవచ్చు. కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిందట. అలా వుంది నేటి భారతీయ చట్టం.

ఇక కొత్త చట్టంలోని సెక్షన్ 106(2) ప్రకారం ఒక వ్యక్తి ఉద్దేశపూర్వకంగా కాకపోయినప్పటికీ నిర్లక్ష్యం, దురుసు చర్య వల్ల ఒక వ్యక్తి చనిపోయిన సందర్భంలో పోలీసులకు లేదా మేజిస్ట్రేట్‌కు తెలియజేయకుండా తప్పించుకుంటే (హిట్ అండ్ రన్) సదరు ముద్దాయికి పదేండ్ల దాకా జైలు శిక్ష, జరిమానా విధించబడుతుంది. ఈ సెక్షన్ డ్రైవర్ల పాలిటి ఉరితాడు అని, డ్రైవర్లందరూ గుర్తించడంతో ఒక్కసారిగా దేశవ్యాపిత ఆందోళన ప్రారంభమైంది.ఈ సమ్మెకు ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్‌డబ్ల్యూఎఫ్) సంపూర్ణ మద్దతునిచ్చి ప్రత్యక్షంగా పాల్గొన్నది. పెద్దఎత్తున కాంపెయిన్ చేసింది. ప్రభుత్వానికి లేఖలు రాసింది. కొత్త చట్టంలోని సెక్షన్ 106(1), (2) లలోని శిక్షలు బ్రిటిష్ కాలం నాటి చట్టం కంటే శిక్షలు అధికం. ఇదేనా భారతీయత?

అసలు రోడ్డు ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయి?

దేశంలో జరిగే రోడ్డు ప్రమాదాలలో 90 శాతం మానవేతర కారణాలతో జరుగుతున్నాయని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి), ఢిల్లీ లోని ప్రమాదాలపై అధ్యయనం చేస్తున్న ప్రముఖ ప్రొఫెసర్ గీతం తివారి రుజువు చేశారు. వారు భారత దేశంలోనే కాక వివిధ దేశాలలో కూడా రోడ్డు ప్రమాదాలపై అనేక ప్రసంగాలు చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాలకు మూడు ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు.

రహదారి నిర్మాణ లోపాలు : ప్రపంచంలో రోడ్డు నిర్మాణ నిబంధలకు విరుద్ధంగా మన దేశంలో రోడ్డు నిర్మాణాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారులు గ్రామాలు /పట్టణాల /జనావాసాల మధ్యలోంచి నిర్మాణం చేయడానికి వీలులేదు. కానీ మన దేశంలో అందుకు భిన్నంగా జరుగుతున్నాయి. కానీ మన దేశంలో ఇలాంటి ఉల్లంఘనలకు లెక్కలేదు. కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా రోడ్డు నిర్మాణాలు చేస్తున్నారు. ఇలాంటి ఉల్లంఘనలు కోకొల్లలు. ఉదాహరణకు కర్నూలు- హైదరాబాద్ మధ్య కృష్ణా నది బ్రిడ్జి వద్ద జరిగిన జబ్బార్ ట్రావెల్స్ బస్సు ప్రమాదం. 40 మందికి పైగా సజీవ దహనం అయ్యారు. దీనిపై అధ్యయనం చేసిన ప్రభుత్వ కమిటీ నివేదికలో నిగ్గు తేలిందేమిటి? ప్రమాదం జరిగిన దగ్గర రోడ్డు వెడల్పు తగ్గింది. జాతీయ రహదారుల మధ్యలో అలా రోడ్డు ఇరుకుగా వుండకూడదు. పైగా కల్వర్టుకు కట్టిన గోడకు వాడిన ఇనుప చువ్వలు బయటకు ఉన్నాయి. దాంతో బస్సు ఆ కల్వర్టుకు గుద్దుకొని బయటకు ఉన్న ఇనుప చువ్వలకు రాసుకొని నిప్పు చెలరేగడం, బస్సు ఆయిల్ ట్యాంక్ పగిలి తగలబడటం క్షణాలలో జరిగిపోయాయి. ఆ రహదారి నిర్మించిన కాంట్రాక్టర్‌పై ఎలాంటి చర్యా లేదు. మరొక ఉదాహరణ ఏమంటే విశాఖపట్నం-శ్రీకాకుళం మధ్య జాతీయ రహదారిపై ప్రమాదంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు ఎర్రం నాయుడు మరణించారు. అందుకు కారణం ఆ జాతీయ రహదారిలో ఎదురుగా వస్తున్న లారీ కుడివైపుకు తిరిగి శ్రీకాకుళం వైపుకు మల్లుతున్న సమయంలో ఎర్రం నాయుడు కారు రావడంతో ప్రమాదం జరిగింది. జాతీయ రహదారులలో ఎక్కడంటే అక్కడ కుడి వైపుకు తిరగడానికి అనుమతించ కూడదు. కానీ రోడ్డు నిర్మాణంలోనే చాలా చోట్ల జాతీయ రహదారులలో కుడివైపుకు తిరగడానికి ఏర్పాట్లు ఉన్నాయి. ఇలాంటి ఉదాహరణలు కోకొల్లలు. బలిపశువులయింది, అవుతున్నది డ్రైవర్లు. అన్ని రకాల, వివిధ వేగాలతో వెళ్లే వాహనాలన్నీ ఒకే రోడ్డుపై వెళ్ళాల్సి వస్తోంది. అలా కాకుండా కనీసం చిన్న వాహనాలు ఒక లైన్‌లో, పెద్ద వాహనాలు మరొక లైన్‌లో వెళ్లే ఏర్పాటు వుంటే ప్రమాదాలు కొంతవరకు తగ్గించవచ్చు. మరొక కారణం చూద్దాం. ప్రభుత్వ గణాంకాల ప్రకారమే దేశంలోని రోడ్లలో జాతీయ రహదారులు కేవలం రెండు శాతం మాత్రమే. కానీ రోడ్డు ప్రమాదాలలో 62 శాతం ఈ రహదారులపైనే జరుగుతున్నాయి. నేషనల్ పర్మిట్ లారీలకు ఇద్దరు డ్రైవర్లు ఉండాలనే నిబంధనను ఈ కారణంతో ప్రభుత్వం ఇటీవల తొలగించింది. రోజుల తరబడి డ్రైవ్ చేయాల్సి రావడం ఎంత ప్రమాదకరం? కనీసం విశ్రాంతికి, అల్పాహారం/భోజనాలకు రహదారి మధ్యలో ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేయదు. ఇవి కూడా ప్రమాదాలకు కారణాలు.



> **ప్రభుత్వ గణాంకాల ప్రకారమే దేశంలోని రోడ్లలో జాతీయ రహదారులు కేవలం రెండు శాతం మాత్రమే. కానీ రోడ్డు ప్రమాదాలలో 62 శాతం ఈ రహదారులపైనే జరుగుతున్నాయి. నేషనల్ పర్మిట్ లారీలకు ఇద్దరు డ్రైవర్లు ఉండాలనే నిబంధనను ఈ కారణంతో ప్రభుత్వం ఇటీవల తొలగించింది. రోజుల తరబడి డ్రైవ్ చేయాల్సి రావడం ఎంత ప్రమాదకరం? కనీసం విశ్రాంతికి, అల్పాహారం/ భోజనాలకు రహదారి మధ్యలో ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేయదు. ఇవి కూడా ప్రమాదాలకు కారణాలు.**

జరిమానాలు/ శిక్షలు భారీగా పెంచితే ప్రమాదాలు తగ్గుతాయా ?

మోటారు వాహనాల చట్ట సవరణ-2019 సందర్భంగా రోడ్డు ప్రమాదాలు, మరణాలు తగ్గించడమే లక్ష్యం అని ప్రభుత్వం చెప్పింది. పార్లమెంటు లోపల, బయట రవాణా శాఖామాత్యులు పదే, పదే ఈ విషయం చెప్పారు. అంతేకాదు. ఒక సందర్భంలో పార్లమెంటులో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రమాదాలు తగ్గించి ప్రాణాలు కాపాడటానికి చట్ట సవరణ చేస్తుంటే ప్రతిపక్షాలు అడ్డుపడుతున్నాయి అంటే ప్రజల ప్రాణాలు ప్రతిపక్షాలకు పట్టదా అని ప్రశ్నించారు. ఆ చట్టంలోని భారీగా పెంచిన జరిమానాలు అమలులోకి వచ్చి నాలుగేండ్లయింది. కానీ ప్రమాదాలు తగ్గలేదు సరికదా, 2022లో పెరిగాయని ప్రభుత్వ గణాంకాలే తెలియజేస్తున్నాయి. అందుచేత ప్రమాదాలకు అసలైన కారణాలను పరిష్కరించకుండా శిక్షలు పెంచితే ప్రమాదాలు తగ్గుతాయని చెప్పటం మోసగించడమేనని అనుభవం రుజువు చేస్తున్నది.

విచారణా విధానం

అమెరికా, బ్రిటన్ తదితర దేశాలలో రోడ్డు ప్రమాదాలపై ప్రాథమిక విచారణకు పోలీసులతో పాటు నిపుణుల కమిటీ ఉంటుంది. నిష్పక్షపాతంగా ప్రమాదాలకు వాస్తవ కారణాలు పరిశీలించాకే వాటి ఆధారంగా ఛార్జిషీటు దాఖలవుతుంది. కానీ మన దేశంలో పోలీసులు చెప్పిందే వేదం. గుడ్డిగా డ్రైవరే బాధ్యుడని ఛార్జిషీటు దాఖలవుతుంది. తదనుగుణంగా శిక్షలు ఉంటున్నాయి. వీటన్నిటిని వదిలివేసి కేవలం డ్రైవర్లను ముద్దాయిలను చేస్తే ప్రమాదాలు తగ్గవు. పైగా శిక్షలకు భయపడి డ్రైవర్‌వృత్తికి రావడానికి అంగీకరించడంలేదు. ఇప్పటికే పెద్ద వాహనాలకు అవసరమైన డ్రైవర్లలో 30శాతం తక్కువ డ్రైవర్లు ఉన్నారని ప్రభుత్వ గణాంకాలే తెలియజేస్తున్నాయి. ప్రమాదాలకు అసలు కారణాలను పరిశీలించి, సమస్యను పరిష్కరించి ప్రజలలో రహదారి భద్రతా నియమాల పట్ల అవగాహన కల్పించడం మీద ప్రభుత్వం దృష్టి సారించాలి. అందుకు చైతన్యవంతమైన ప్రజలే ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు ముందుకు కదలాలి. ఓ వైపు పోరాటం చేస్తూనే మరోవైపు చేసిన చట్టాల్లో మార్పునకు ఒత్తిడి తేవాలి. దానికి 2024 పార్లమెంట్ ఎన్నికల్ని ఒక వేదికగా తీసుకోవాలి. ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ, ప్రమాదకర చట్టాలతో చెలగాటమాడుతున్న పాలకులను సాగనంపాలి. ఇది దేశ సమైక్యతకు, అభివృద్ధికి అవసరం, అనివార్యం, ఆలోచించి అడుగేయాల్సిన తరుణం.



షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్ కనీస వేతనాల జీవోలు సవరించాలి

- ఐదురంగాల జీవోలను గెజిట్ చేయాలి : సీఐటీయూ వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్ కనీస వేతనాల జీవోలను సవరించాలనీ, ఐదు రంగాల జీవోలను గెజిట్ చేయాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని కార్మికశాఖ ముఖ్యకార్యదర్శికి సీఐటీయూ నేతలు వినతిపత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, జె.మల్లిఖార్జున్, రాష్ట్ర కార్యదర్శులు జె.చంద్రశేఖర్, బి.మధు, కోశాధికారి వంగూరు రాములు పాల్గొన్నారు. రాష్ట్రంలో 10,15 ఏండ్ల నుంచి కనీస వేతనాలను సవరించలేదనే విషయాన్ని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. వాస్తవానికి ప్రతి ఐదేండ్లకోసారి సవరించడం వల్ల కార్మికుల వేతనాలు పెరుగుతాయని చెప్పారు. ఇలా చేయకపోవడం వల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. పెరిగిన నిత్యావసర ధరలు, ఇంటి అద్దెలు, విద్య, వైద్య ఖర్చులు పెరిగి కార్మికులు ఇబ్బంది పడుతున్న తీరును వివరించారు. ఇప్పటికైనా ఆలస్యం చేయకుండా 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాలను సవరించాలనీ, దీనివల్ల ప్రభుత్వంపై పైసా భారం కూడా పడదనిను కోరారు. 10,15 ఏండ్ల నుంచి సవరించలేదు కాబట్టి ప్రస్తుత అవసరాలు, పెరిగిన ఖర్చుల దృష్ట్యా కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

అత్యంత నాసిరకంగా మేడారం జాతర పనులు

సత్వరమే నాణ్యతతో పూర్తి చేయాలి

- జాతరకు రూ.150 కోట్లు కేటాయించాలి : భద్రాచలం మాజీ ఎంపీ, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మిడియం బాబురావు



నవతెలంగాణ -తాడ్వాయి

ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఆదివాసీ గిరిజన జాతరైన మేడారం మహా జాతర పనులు అత్యంత నాసిరకంగా జరుగుతున్నాయని, నాణ్యతగా సకాలంలో వెంటనే పూర్తి చేయాలని భద్రాచలం మాజీ ఎంపీ, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మిడియం బాబురావు అన్నారు. బుధవారం ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం మహాజాతరలో జరుగుతున్న పనులను తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో రైతు సంఘం, ఆదివాసీ సంఘం నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆర్అండ్‌బీ రోడ్డు పనులు, ఆర్‌డబ్ల్యూఎస్ పనులు, ఐటీ శాఖ ఆధ్వర్యంలో జంపన్న వాగులో జరుగుతున్న ఇసుక చదును పనులు, పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. కన్నెపెల్లి, చిలకలగుట్ట, ఆర్టీసీ బస్టాండ్, జంపన్న వాగు, గద్దెల ప్రాంగణం, రెడ్డిగూడెం, కొంగలమడుగు, చింతల్ క్రాస్, నార్లాపూర్, ఊరట్టం జన సందోహంగా ఉండే ప్రదేశాలను సందర్శించి పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. మేడారం మహా జాతరకు సుమారు 40 రోజులు మాత్రమే సమయం ఉందని, ఇప్పటినుంచే సందర్శకుల రద్దీ అధికంగా ఉందన్నారు. అయినా ఇంకా కొన్ని పనులు ప్రారంభం కాలేదని, కొన్ని పనులు నత్త నడకన నడుస్తున్నాయని ఆరోపించారు. చేస్తున్న పనుల్లోనూ నాణ్యత కొరవడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం జాతరకు రూ.75 కోట్లే మంజూరు చేశారని, ఆ నిధులు సరిపోవని కొత్త ప్రభుత్వం రూ.150 కోట్లు మంజూరు చేసి సందర్శకుల సౌకర్యార్థం శాశ్వత నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. మేడారం మహా జాతరకు కోటి మంది వచ్చే అవకాశం ఉన్నదని, ఆ స్థాయిలో ఏర్పాట్లపై పర్యవేక్షణ అవసరం ఉందన్నారు. కానీ, నాయకులు, అధికారులు అవినీతి కారణంగా జాతర పనులు ప్రతిసారి నాసిరకంగా జరుగుతున్నాయని విమర్శించారు. ప్రతి జాతరకు కోట్ల నిధులు గంగలో పోసినట్టే అవుతుందన్నారు. జంపన్న వాగు వద్ద మహిళల కోసం గదులను త్వరితగతిన ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మేడారంలో ఎండోమెంట్ శాఖ ఆధ్వర్యంలో స్థానికంగా కార్యాలయం ఏర్పాటు చేసి అధికారులను నియమించాలని కోరారు. తుఫాను, వరదలకు కళ్యాణ కట్టలు, రోడ్లు ధ్వంసమయ్యాయని, వాటిని వెంటనే మరమ్మతు చేయాలన్నారు. జాతరకు ఎక్కడి నుంచో వచ్చే సందర్శకుల సౌకర్యార్థం అధికారులు ఆలోచిస్తున్నారు గాని, స్థానికంగా ఉండే రైతులు, ఆదివాసీ గిరిజనుల బతుకుల గురించి ఆలోచించడం లేదని వాపోయారు. స్థానిక గ్రామాల రైతులకు ప్రభుత్వం పంట నష్టపరిహారం అందించాలని తెలిపారు. జంపన్న వాగు పొడుగునా చిలకల గుట్ట వరకు ఇరువైపులా కరకట్ట నిర్మించి రైతుల భూములు కాపాడాలని డిమాండ్ చేశారు. సందర్శించిన వారిలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు గొంది రాజేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు దుగ్గి చిరంజీవి, జిల్లా ఉపాధ్యక్షులు కోటే కృష్ణారావు, జిల్లా సహాయ కార్యదర్శి వంక రాములు, మండల కార్యదర్శి జజ్జరి దామోదర్, మండల అధ్యక్షులు అల్లెం అశోక్, జిల్లా కమిటీ సభ్యులు ఊకే ప్రభాకర్, ఇర్ప శ్రీను తదితరులున్నారు.

ఉద్యోగాల పేరిట భర్త మోసం.. భార్యకు శిక్ష

- గుడిలో బంధించి కొట్టిన బాధితులు
- చోద్యం చూసిన పోలీసులు!

నవతెలంగాణ-సూర్యాపేట



మెడికల్ కళాశాలలో ఉద్యోగాలు ఇప్పిస్తానని 40 మంది దగ్గర రూ.63 లక్షలు తీసుకుని మోసం చేసిన ఘటనలో నిందితుడు పరారీలో ఉండటంతో బాధితులు అతని భార్యను బంధించారు. గుడిలోకి తీసుకొచ్చి చిత్రహింసలకు గురి చేశారు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో బుధవారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాలిలా ప్రకారం..పట్టణంలోని కృష్ణాటాకీస్ ముత్యాలమ్మ బజార్‌లో నివసిస్తున్న సతీశ్ మెడికల్ కాలేజీలో ఉద్యోగాలు ఇప్పిస్తానని దాదాపుగా 40 మంది దగ్గర రూ.63 లక్షలు తీసుకున్నాడు. అనంతరం వారికి మాయమాటలు చెబుతూ వచ్చాడు. ఇటీవల బాధితులు డబ్బులు తిరిగి ఇవ్వాలని సతీశ్‌ని నిలదీశారు. తాను ఆఫీస్‌లో మరో వ్యక్తికి డబ్బులు ఇచ్చానని, తప్పకుండా ఉద్యోగాలు వస్తాయని చెప్పాడు. ఇలా రోజులు గడుస్తున్నా ఉద్యోగం రాకపోవడంతో బాధితులు మోసపోయామని గ్రహించి బుధవారం సతీశ్ నివాసానికి వచ్చారు. అతడు ఇంట్లో లేకపోవడంతో సతీశ్ భార్య కల్యాణిని ముత్యాలమ్మ ఆలయానికి తీసుకెళ్లి డబ్బుల గురించి నిలదీశారు. ఆమె తనకు తెలియదని చెప్పినా వినకుండా ఇష్టం వచ్చినట్టుగా కొట్టారు. చిత్రహింసలు పెట్టారు. డబ్బులు ఇస్తామని హామీ పత్రం రాయాలని ఆమెపై ఒత్తిడి చేశారు. ఈ క్రమంలో పోలీసులు అక్కడికి చేరుకుని బాధితులకు సర్దిచెప్పినా కల్యాణిని విడిచి పెట్టలేదు. డబ్బులు ఇచ్చేవరకు ఆమెను విడిచి పెట్టబోమని చెప్పడంతో పోలీసులు అక్కడి నుంచి వెళ్లి పోయారు. కాగా రాత్రి వరకు కల్యాణిని గుడిలోనే ఉంచి.. తమ డబ్బులు సెటిల్మెంట్ చేయాలని వాదోపవాదాలకు దిగారు.

కాళేశ్వరంపై విచారణతో బీఆర్ఎస్‌కు దడ

- రూ.లక్ష కోట్లతో నిర్మించిన ప్రాజెక్టు 9నెలలూ పని చేయలేదు
- ప్రాజెక్టుల అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారించాలి : రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయప్రతినిధి

"కాళేశ్వరం ప్రాజెక్టులపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టగానే బీఆర్ఎస్ నేతల గుండెల్లో దడ పుడుతోంది. రూ.లక్ష కోట్లతో నిర్మించిన ప్రాజెక్టులు 9నెలలు కూడా పని చేయలేదు. ఆ ప్రాజెక్టుల్లో అక్రమాలపై త్వరలోనే సిట్టింగ్ జడ్జితో విచారణ చేపడతాం" అని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో బుధవారం ఉదయం వాకర్స్‌తో సమావేశమై అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్‌ను కాపాడేందుకు బీజేపీ నేతలు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. మాజీ ఎంపీ వినోద్ కుమార్ సచ్ఛీలుడు అయితే తనపై వచ్చిన ఆరోపణపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని డిమాండ్ చేశారు. తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని హితవు పలికారు. మరోవైపు తమ ప్రభుత్వం హామీ ఇచ్చిన గ్యారంటీ స్కీములపై ఇప్పటికే దరఖాస్తులు స్వీకరించామని, వాటిని తాము చిత్తశుద్ధితో అమలు చేస్తామన్నారు. తాము అధికారంలోకి వచ్చి నెల మాత్రమే అవుతోందని, త్వరలోనే ఆ గ్యారంటీ స్కీములు అమలవుతాయన్నారు.

విద్యారంగ,ఉపాధ్యాయ సమస్యలపై దృష్టి కేంద్రీకరించాలి

- యూఎస్‌పీసీ, జాక్టో నాయకులపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తేయాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వం విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలపై దృష్టి కేంద్రీకరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) కోరింది. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పేర్కొన్న ఉవిధంగా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సూచించింది. యూఎస్‌పీసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సమావేశం బుధవారం హైదరాబాద్‌లోని టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య అధ్యక్షతన నిర్వహించారు. యూఎస్‌సీపీ స్టీరింగ్ కమిటీ సభ్యులు చావ రవి, వై అశోక్ కుమార్, పి నాగిరెడ్డి, టి లింగారెడ్డి, యు పోచయ్య, డి సైదులు, షౌకత్ అలీ, రాజయ్య, కొమ్ము రమేష్, జాదవ్ వెంకట్రావు, డి రాజనర్సు, జాడి రాజన్న, ఎస్ హరికిషన్, బి కొండయ్య, కె బిక్షపతి, వై విజయకుమార్, ఎం రఘుశంకర్ రెడ్డి అనంతరం ఒక ప్రకటన విడుదల చేశారు. పీఆర్సీ, ఉపాధ్యాయ పదోన్నతులు కోరుతూ 2020, డిసెంబర్ 29న ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో యూఎస్‌పీసీ, జాక్టో ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించామని తెలిపారు. ఈ సందర్భంగా స్టీరింగ్ కమిటీ సభ్యులు చావ రవి, టి లింగారెడ్డి, జి సదానందంగౌడ్‌లపై అక్రమంగా పెట్టిన క్రిమినల్ కేసును ఎత్తేయాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ, మోడల్ స్కూల్, గురుకుల, సమగ్ర శిక్ష, ఎయిడెడ్ సిబ్బందికి నవంబర్, డిసెంబర్ వేతనాలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. గత ఏడాది కాలంగా ట్రెజరీల్లో ఆమోదం పొంది ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటినీ వెంటనే చెల్లించాలని తెలిపారు. 317 జీవో అమలు సందర్భంగా నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. బ్లాక్ చేసిన 13 జిల్లాల స్పౌజ్ బదిలీలు నిర్వహించాలని సూచించారు. ఆటంకాలను తొలగించి ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోరారు. సీపీఎస్ రద్దుకు చర్యలు తీసుకోవాలనీ, ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి అమలు తీరును సమీక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వీలైనంత త్వరలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిని కలిసి సమస్యలపై చర్చించాలని నిర్ణయించామని తెలిపారు.

పాత పద్ధతిలోనే...

(మొదటిపేజీ తరువాయి)

సుగమం అవుతుంది. ఇదే విషయాన్ని గవర్నర్ దృష్టికి తెచ్చే అవకాశమున్నది.

వర్సిటీల్లో 70 శాతం అధ్యాపక ఖాళీలు...

రాష్ట్రంలో 12 విశ్వవిద్యాలయాల పరిధిలో 70 శాతం అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మొత్తం 2,825 పోస్టులుంటే అందులో 873 (30 శాతం) మంది ప్రొఫెసర్లు మాత్రమే పనిచేస్తున్నారు. 1,977 (70 శాతం) ప్రొఫెసర్ పోస్టులకు ఖాళీలున్నాయి. రాష్ట్రంలోని 11 విశ్వవిద్యాలయాల పరిధిలో 1,551 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయనీ, వాటిలో మొదటి విడతలో 1,061 పోస్టులను భర్తీ చేసేందుకు అనుమతి ఇస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వం 2017, నవంబర్ 25న ఉత్తర్వులు జారీ చేసింది. అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ పోస్టులు భర్తీ కాలేదు. గతంలో విశ్వవిద్యాలయం యూనిట్‌గా ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లను విడుదల చేసి నియామకాల ప్రక్రియ చేపట్టేవారు. మళ్లీ ఆ విధానం అమల్లోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. అందుకనుగుణంగా చర్యలు చేపడుతున్నది. గవర్నర్‌తో సంప్రదించిన తర్వాత న్యాయ నిపుణుల అభిప్రాయాలను తీసుకుని మార్గదర్శకాలను విడుదల చేయాలని విద్యాశాఖ అధికారులు సమాలోచన చేస్తున్నారు. ఈ ప్రక్రియ వల్ల త్వరగా వర్సిటీల్లో నియామకాల ప్రక్రియ పూర్తవుతుందని భావిస్తున్నారు.

విశ్వవిద్యాలయాల వారీగా అధ్యాపక పోస్టుల వివరాలు

యూనివర్సిటీ	సాంక్షన్ పోస్టులు	పనిచేస్తున్నది	ఖాళీలు	భర్తీ చేసేవి
ఉస్మానియా	1267	376	891	415
కాకతీయ	409	86	323	136
డా॥బీఆర్ అంబేద్కర్	86	34	52	10
పొట్టి శ్రీరాములు	72	14	58	07
తెలంగాణ	152	61	91	59
మహాత్మాగాంధీ	70	35	35	34
శాతవాహన	63	16	47	40
పాలమూరు	95	21	74	63
జేఎన్‌టీయూహెచ్	410	169	241	186
జేఎన్ఎఎఫ్ఎయూ	55	17	38	15
ఆర్‌జీయూకేటీ	146	19	127	0
మహిళా	0	25	0	0
మొత్తం	2825	873	1977	1061

బిగ్ సీలో సంక్రాంతి ఆఫర్లు



హైదరాబాద్ : ప్రముఖ మొబైల్ రిటైల్ చెయిన్ బిగ్ సీ సంక్రాంతి పండుగ సందర్భంగా వినూత్న ఆఫర్లను అందిస్తున్నట్టు ప్రకటించింది. తమ 250కి పైగా స్టోర్లలో మొబైల్ కొనుగోళలపై రూ.3,000 వరకు ఇన్‌స్టాంట్ డిస్కౌంట్‌తో పాటు రూ.4,999 విలువగల స్మార్ట్ వాచ్‌ను ఉచితంగా అందిస్తున్నామని బిగ్‌సీ ఫౌండర్, సీఎండీ యం బాలు చౌదరి ఓ ప్రకటనలో తెలిపారు. దీనితో పాటు స్మార్ట్‌ఫోన్ కొనుగోలుపై రూ.1,10,000 విలువగల హెల్త్‌కేర్‌కు సంబంధించిన ప్రయోజనాలను ఉచితంగా లభిస్తాయన్నారు. ప్రతీ ఫోన్, ల్యాప్‌టాప్, స్మార్ట్ టీవీ కొనుగోలుపై కచ్చితమైన బహుమతి సహా క్యాష్‌బ్యాక్ పొందవచ్చన్నారు. ఐఫోన్ మొబైల్ కొనుగోలుపై రూ.4,000 వరకు, వన్‌ప్లస్, రియల్‌మీ మొబైల్స్ కొనుగోళ్లపై రూ.3,000 వరకు ఇన్‌స్టాంట్ డిస్కౌంట్ అందిస్తున్నామన్నారు. ఈ సంక్రాంతికి తాము అందిస్తున్న ప్రత్యేక ఆఫర్లను వినియోగదారులు ఉపయోగించుకోవాలని బాలు చౌదరి కోరారు.

పారితోషికాలను వెంటనే చెల్లించాలి : ఆశా యూనియన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సంక్రాంతి పండుగ ఉన్నందున ఆశావర్కర్లకు పారితోషికాలు తక్షణమే చెల్లించాలని ఆశా యూనియన్ (సీఐటీయూ అనుబంధం) కోరింది. ఈ మేరకు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి ఆర్.నీలాదేవి, కోశాధికారి పి.గంగమణి బుధవారం వైద్యారోగ్యశాఖ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. గతంలో ఇచ్చినట్టుగా ప్రతి నెలా రెండో తేదీన పారితోషికాలు చెల్లించాలని కోరారు. డిసెంబర్ నెల పారితోషికాలు రాకపోవడంతో ఆశావర్కర్లు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వం ప్రతి నెలా రెండో తేదీన పారితోషికాలు చెల్లించేదనీ, కొత్త ప్రభుత్వం వచ్చాక పారితోషికాలు ఆలస్యంగా చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. రెండో తేదీన వేయాల్సిన జీతాలు నెల చివరలో వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ప్రతి నెలా మొదటి వారంలో చెల్లించాల్సిన పిల్లల ఫీజులు, కుటుంబ అవసరాల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. అప్పులు చేసి మరీ పండుగలు జరుపుకునే పరిస్థితికి ఆశావర్కర్లు నెట్టబడుతున్నారని వాపోయారు. ఆశావర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు.

ట్రాఫిక్ చలాన్ల రాయితీ గడువు పొడిగింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వాహనదారులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. పెండింగ్ ట్రాఫిక్ చలాన్ల రాయితీ గడువును ఈ నెల 31 వరకు పెంచుతున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 3.5 కోట్ల పెండింగ్ చలాన్లుండగా గత నెల 26 నుంచి జనవరి 10 వరకు 1.29 కోట్ల చలాన్ల ద్వారా రూ.113 కోట్ల ఆదాయం సమకూరింది. అత్యధికంగా హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 37.50 లక్షల చలాన్ల ద్వారా రూ.28.70 కోట్లు, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 21.25 లక్షల చలాన్లకుగాను రూ.23.65 కోట్లు, రాచకొండ కమిషనరేట్ పరిధిలో 16.60 లక్షల చలాన్లకు గాను రూ. 13.35 లక్షల ఆదాయం వచ్చింది. గతేడాది కూడా రాయితీపై పెండింగ్ చలాన్లు చెల్లించేందుకు పోలీస్ శాఖ వాహనదారులకు అవకాశమివ్వడంతో 45 రోజుల్లోనే ఏకంగా రూ.300కోట్ల ఆదాయం సమకూరింది. ఈ సారీ పెండింగ్ చలాన్ల చెల్లింపునకు వాహనదారుల నుంచి భారీగా స్పందన రావడంతో గడువును మరోసారి పొడిగించినట్టు సర్కార్ తెలిపింది. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వాహనదారులకు విజ్ఞప్తి చేసింది.

గద్దర్‌కు డిప్యూటీ సీఎం భట్టి నివాళులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజాయుద్ధ నౌక గద్దర్‌కు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నివాళులు అర్పించారు. బుధవారం సికింద్రాబాద్ వెంకటాపురంలోని మహాబోధి విద్యాలయం ఆవరణలో ఉన్న గద్దర్ సమాధిని దర్శించుకుని ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అంతకు ముందు ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్న గద్దర్ భార్య గుమ్మడి విమలను భట్టి ఓదార్చారు. మీరు ధైర్యంగా ఉండండి, మీ అందరికీ మేమున్నామని భరోసా ఇచ్చారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి డిప్యూటీ సీఎం అడిగి తెలుసుకున్నారు. గద్దర్ కుమారుడు సూర్యం, కుమార్తె వెన్నెల, కోడలు సరితలతో మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు

నేడు ఢిల్లీకి సీఎం, మంత్రులు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పార్లమెంటు ఎన్నికలకు ఏఐసీసీ సన్నద్ధమవుతున్నది. సంబంధిత ఎన్నికల వ్యూహంపై చర్చించేందుకు దేశ వ్యాప్తంగా ఉన్న కీలక నాయకులతో గురువారం ఢిల్లీలో భేటీ కానుంది. ప్రస్తుత దేశ రాజకీయ పరిస్థితులు, రాహుల్‌గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర, పార్లమెంటు ఎన్నికలు తదితర అంశాలపై ఈ భేటీలో చర్చించనున్నారు. ఈ సమావేశానికి సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి, మంత్రులు, రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, పార్లమెంటు నియోజకవర్గాల ఏఐసీసీ సమన్వయకర్తలు హాజరు కానున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఎక్కువ మంది ఎంపీలను గెలిపించుకునేందుకు అధిష్టానం కూడా టార్గెట్ పెట్టినట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో 17 ఎంపీ స్థానాలు ఉన్నాయి. అందులో 12 సీట్లకు తగ్గకుండా గెలవాలనే లక్ష్యంతో సీఎం, మంత్రులు, పార్టీ నేతలు ఉన్నారు. ఇప్పటికే ఆ విషయాన్ని రేవంత్ చెప్పిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి ఉమ్మడి ఐదు జిల్లాల చొప్పున రెండు రోజులపాటు ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులతో పార్లమెంటు ఎన్నికలపై సమీక్షించారు. ఆ ఎన్నికలను సీరియస్‌గా తీసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. మరోవైపు హస్తం పార్టీకి చెందిన చాలా మంది నేతలు ఎంపీ టికెట్లు ఆశిస్తున్నారు. పార్లమెంటు ఎన్నికలపై రూపొందించిన కార్యాచరణను ఏఐసీసీ సమావేశంలో సీఎం రేవంత్ సమర్పించనున్నారు.

జగ్గారెడ్డి ఢిల్లీకి పయనం

మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఢిల్లీకి పయనమయ్యారు. బుధవారం మధ్యాహ్నం ఆయన రైల్లో ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. మంగళవారం హైదరబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఆయన...మరుసటి రోజే ఆఘమేఘాల మీద హస్తినకు వెళ్లడం పార్టీలో చర్చనీయాంశమైంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత ఆయన తొలిసారి ఢిల్లీ వెళ్లి అధిష్టానాన్ని కలవడంతో ఏం ఆశించి అక్కడికి వెళ్లారనే అంశం పార్టీ నేతల్లో చర్చ జరుగుతున్నది. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఎంపీ పోటీ చేయనున్నారా? ఎమ్మెల్సీ ద్వారా మంత్రిపదవి అడుగనున్నారా? టీపీసీసీ అధ్యక్షపదవి ఆశిస్తున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

న్యాయ సంహితలో 106(1)(2) సెక్షన్లను తీసేయాలి

- దాన్ని రద్దు చేసేదాకా డ్రైవర్ల పోరాటం
- ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



కేంద్ర ప్రభుత్వం భారతీయ న్యాయ సంహితలోని 106 (1)(2) సెక్షన్లను రద్దు దాకా చేసే వరకు డ్రైవర్ల పోరాటం కొనసాగుతుందని ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ చెప్పారు. రద్దు చేయకపోతే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి తగ్గి బుద్ధి చెబుతారని హెచ్చరించారు. దేశవ్యాప్తంగా జనవరి 10 నుంచి 14 వరకు జరుగుతున్న ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సమ్మెలో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీల ఆధ్వర్యంలో బుధవారం విజయవాడ-హైదరాబాద్ హైవేపై రంగారెడ్డి జిల్లా బాటసింగారం చౌరస్తా వద్ద డ్రైవర్లు రాస్తారోకో నిర్వహించారు. ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. అజయ్ బాబు దీనికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. హిట్ అండ్ రన్ కేసుల్లో యాక్సిడెంట్ అయిన తర్వాత డ్రైవర్ స్పాట్ ఉండి పోలీసులకు కంప్లయింట్ ఇచ్చి బాధితునికి వైద్యం చేయిస్తే 2 నుంచి ఐదేండ్ల వరకు జైలు శిక్ష, ఒకవేళ డ్రైవరు పారిపోతే పదేండ్ల జైలుశిక్ష, రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షల జరిమానా విధించడం దుర్మార్గమన్నారు. వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా డ్రైవర్లనే నేరస్తులుగా చిత్రీకరించడం దారుణమన్నారు. రోడ్లు, ట్రాఫిక్ సిస్టమ్ సరిగా లేకపోవడం వల్లనే మన దేశంలో 90 శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ చట్టం అమలైతే డ్రైవర్లు తమ ప్రమేయం లేకున్నా పదేండ్లు జైలుపాలయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏదైనా ప్రాంతంలో యాక్సిడెంట్ జరిగితే తప్పులతో సంబంధం లేకుండా బాధితుల తరపు వారు, ప్రజలు ఆవేశానికి లోనై డ్రైవర్‌ని తప్పు పట్టడం, కొట్టడం, హింసించడం చేస్తున్న తీరును వివరించారు. హిట్ అండ్ రన్ కేసుల్లో 106(1)(2) సెక్షన్లను ఎత్తేయాలని డిమాండ్ చేశారు. దీనిపై దేశవ్యాప్తంగా డ్రైవర్లు ఐక్యంగా పోరాటంలోకి రావాలని పిలుపునిచ్చారు. రాస్తారోకోలో రంగారెడ్డి జిల్లా ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జిల్లా కార్యదర్శి రుద్రకుమార్, గ్రేటర్ హైదరాబాద్ సెంటర్ సిటీ నాయకులు ఖలీం, ముఖేష్, సాబీర్, మజీద్ గౌస్, వహీద్, అబ్బాస్, అలీఖాన్, విష్ణు, ఇర్ఫాన్, ఇమ్రాన్, అర్బాజ్ ఖాన్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రాములు, నర్సింహ్మా ప్రభాకర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు పార్టీల నిర్మాణాన్ని ఒక్కసారి చూడండి...

- వాటికి గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకూ కమిటీలుంటాయి
- 60 లక్షల సభ్యత్వమున్న మనకు అలాంటి కమిటీలేవి..?
- కేసీఆర్ దిష్టిబొమ్మలు తగలేసిన వాళ్లు నేడు స్టేజీపై ఉన్నారు : వరంగల్ పార్లమెంటు సన్నాహక సమావేశంలో బీఆర్ఎస్ నేతల ఆవేదన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'కమ్యూనిస్టు పార్టీల నిర్మాణాన్ని ఒక్కసారి పరిశీలించండి.. వాటికి గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ కమిటీలుంటాయి. 60 లక్షల సభ్యత్వముందని చెప్పుకుంటున్న మనకు అలాంటి కమిటీలు ఎందుకు ఉండటం లేదు..? ఈ అంశంపై ఎప్పుడైనా సమీక్షలు చేశారా...?' అంటూ వరంగల్ జిల్లాకు చెందిన పలువురు బీఆర్ఎస్ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. లెఫ్ట్ పార్టీలు ప్రతీయేటా సభలు, సమావేశాలు నిర్వహించటం ద్వారా లోపాలు, లోటుపాట్లపై సమీక్షించుకుంటాయని వారు తెలిపారు. అలాంటి ఆత్మపరిశీలన లేకపోవటం వల్లే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయామంటూ వాపోయారు. అందువల్ల ఇప్పటికైనా పార్టీ వైఖరి, అధిష్టానం పద్ధతి మారాలంటూ విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ పార్లమెంటు సన్నాహక సమావేశాల్లో భాగంగా బుధవారం వరంగల్ లోక్‌సభ స్థానంపై సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన ఈ భేటీకి ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ బండ ప్రకాశ్, ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాసరెడ్డి, కడియం శ్రీహరి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకరరావు, సత్యవతి రాథోడ్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా వరంగల్ జిల్లా నేతలు మాట్లాడుతూ... పార్టీ అధిష్టానం వైఖరిని తీవ్రంగా తప్పుబట్టినట్టు సమాచారం. మొదటి నుంచి కేసీఆర్ వెంట నడిచిన వారికి పార్టీ అన్యాయం చేసిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తాము ఎవరెవరితోనైతే పోరాడామో వారే ఇప్పుడు స్టేజీపై ఉన్నారంటూ టీడీపీ, కాంగ్రెస్ (కడియం, ఎర్రబెల్లి, గండ్ర వెంకటరమణా రెడ్డి తదితరులు) నుంచి బీఆర్ఎస్‌లో చేరిన నేతలనుద్దేశించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆనాడు కేసీఆర్ దిష్టిబొమ్మలు తగలబెట్టిన వారు ఇప్పుడు పెద్ద పెద్ద నాయకులుగా చెలామణి అవుతున్నారని ఘాటుగా వ్యాఖ్యానించినట్టు తెలిసింది. ఉద్యమ సమయంలో ఉస్మానియా యూనివర్శిటీ పోషించిన తరహాలోనే కాకతీయ విశ్వవిద్యాలయం కూడా ప్రధాన పాత్రను పోషించిందని తెలిపారు. అయితే బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కాకతీయ వర్శిటీ నుంచి ఉద్యమంలో పాల్గొన్న వారిని పట్టించుకోలేదంటూ నాయకులు ఆక్రోశం వెళ్లగక్కారు. రాష్ట్రంలో లేని బీజేపీని పెద్ద పెద్దగా విమర్శించి, ప్రధాన పోటీదారుడైన కాంగ్రెస్‌పై అసలు ఫోకస్సే పెట్టలేదంటూ మరికొందరు వాదించినట్టు తెలిసింది. ఆ పార్టీని తక్కువగా అంచనా వేయటం వల్లే ఓడిపోయామనే విషయాన్ని వారు కేటీఆర్, ఇతర నేతల దృష్టికి తీసుకొచ్చారు. దీంతోపాటు కిందిస్థాయిలోని వాస్తవాలను అధిష్టానం దృష్టికి తీసుకుపోయేందుకు ఎమ్మెల్యేలు ధైర్యం చేయలేదని తెలిపారు. ఇలాంటి అంశాలన్నింటినీ సమీక్షించుకోకపోతే పార్టీకి మరిన్ని ఇబ్బందులు తప్పవంటూ వారు హెచ్చరించినట్టు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఓ నేత తెలిపారు.

'కాళేశ్వరం' ప్రాజెక్టుపై కొనసాగుతున్న దర్యాప్తు

- ఇరిగేషన్ కార్యాలయాల్లోని పలు రికార్డులు స్వాధీనం



నవతెలంగాణ-మహదేవపూర్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం ప్రాజెక్టుపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దర్యాప్తు ప్రారంభించిన విషయం విదితమే. మేడిగడ్డ బ్యారేజీ, పంపుహౌస్‌కు సంబంధించిన వివరాలన్నింటినీ అందజేయాలని లేఖ రాసి 24 గంటలు గడవకముందే.. మేడిగడ్డ నుంచి హైదరాబాద్‌లోని జలసౌధ వరకు 10 కార్యాలయాల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టారు. బుధవారం రెండవ రోజు అంచనాలు, డిజైన్లు, నిర్మాణానికి ఇచ్చిన ఆదేశాలు, వ్యయం, డీపీఆర్ ఇలా అనేక రికార్డులను అడిగి తీసుకున్నారు. విజిలెన్స్ అధికారుల బృందాలు ఆయా కార్యాలయాలకు వెళ్లి తొలుత ఇంజినీర్లు, అధికారుల ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఎవరినీ కార్యాలయాల నుంచి బయటకు వెళ్లనీయకుండా ఆపేశారు.

మంగళవారం ఉదయం పదిన్నరకు ప్రారంభమైన విజిలెన్స్ తనిఖీలు సాయంత్రం వరకు, కొన్నిచోట్ల రాత్రి 10 గంటల దాకా సాగాయి. ఉదయం కార్యాలయాలకు రాగానే ఎక్కడికక్కడ విజిలెన్స్ అధికారుల తనిఖీలు చూసి ఏం జరుగుతుందోననే ఆందోళన ఇంజినీర్లలో నెలకొంది. మేడిగడ్డ ప్రాజెక్టుకు సంబంధించిన రికార్డుల కోసం ఈనెల 9వ తేదీన కార్యాలయానికి వస్తామని రామగుండం ఇరిగేషన్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్‌కు విజిలెన్స్ విభాగం ఎస్పీ శివకుమార్ గత సోమవారం లేఖ రాశారు. ఇక్కడే ప్రాజెక్టు ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్సీ) కార్యాలయం కూడా ఉంది. అయితే ఈ లేఖ అధికారులకు చేరకముందే మంగళవారం తనిఖీలు చేపట్టి రికార్డులు స్వాధీనం చేసుకోవడం సంచలనం కలిగించింది. అలాగే మేడిగడ్డ బ్యారేజీతో పాటు కన్నెపల్లి పంపుహౌస్‌కు సంబంధించిన రికార్డులనూ విజిలెన్స్ బృందం స్వాధీనం చేసుకుంది. కాళేశ్వరం మరో ఇంజినీర్ ఇన్ చీఫ్ హరిరాం కార్యాలయానికి వెళ్లి డీపీఆర్‌ను తీసుకొన్నారు. బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల నుంచి తీసుకొన్న రుణాల వివరాలను కూడా అడిగి తీసుకొన్నట్టు తెలిసింది. మేడిగడ్డ ప్రాజెక్టు నుంచి స్వాధీనం చేసుకున్న దస్త్రాలను మహదేవపూర్ నీటిపారుదల శాఖ డివిజన్ కార్యాలయానికి తరలించారు. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలోనూ ఈ ప్రక్రియ కొనసాగింది.

మేడిగడ్డ బ్యారేజీకి సంబంధించి 46 అంశాలపై సమాచారాన్ని విజిలెన్స్ అధికారులు కోరారు. డీపీఆర్, కేంద్ర జలసంఘం అనుమతులు, పునాదుల వివరాలు, బ్యారేజీ, పంపుహౌస్‌ల నిర్మాణానికి సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ ఇచ్చిన డ్రాయింగ్‌లు, టెండర్లు పిలిచినప్పటి నుంచి ఆమోదం పొందే వరకు వివరాలు, ఒప్పందాలు, బ్యాంకు గ్యారంటీలు, నిర్మాణ గడువు, ఉప గుత్తేదారుల వివరాలు నిర్మాణ సమయంలో తనిఖీలు, నాణ్యత ధ్రువీకరణ పత్రాలు, ప్రతి నెలా బిల్లుల చెల్లింపులకు సంబంధించిన ఎం బుక్‌లు, ఉన్నతాధికారులు పరిశీలించినప్పుడు ఇచ్చే నోట్స్, మార్పులు జరిగి ఆమోదం పొంది ఉంటే అందుకు సంబంధించిన వివరాలు మేడిగడ్డ బ్యారేజీపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అధికారుల నివేదిక, పంపుహౌస్ గోడ కూలడానికి సంబంధించిన వివరాలు, పునరుద్ధరణ పనులు, చెల్లింపులు, బ్యారేజీ వద్ద షడ్ డిశ్చార్జి వివరాలు, ఫిర్యాదులు వచ్చి ఉంటే తీసుకొన్న చర్యలు, అదనపు టీఎంసీ పనుల వివరాలకు సంబంధించిన రికార్డులు ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పగా.. అధికారులు వివరాలు తెలపడానికి నిరాకరించడం గమనార్హం.

రెగ్యులర్ ఉద్యోగులుగా తీసుకోండి

కార్మిక సంఘాల విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

టీఎస్ఆర్టీసీలో కారుణ్య నియామకాలను రెగ్యులర్ ప్రాతిపదికన చేపట్టాలని ఆర్టీసీలోని కార్మిక సంఘాలు విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం సమర్పించినట్టు టీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరాంజనేయులు, వీఎస్ రావు తెలిపారు. క్యాజువల్ పద్ధతిలో ఎలాంటి నియామకాలు చేపట్టవద్దని వారు ఆ లేఖలో కోరారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు దాదాపు 1,100 మంది కార్మికులు సర్వీస్‌లో ఉండి చనిపోయారని వివరించారు. కానీ గత ప్రభుత్వం 2022లో ఇచ్చిన సర్క్యులర్‌లో ఈ ఉద్యోగాలను 'కన్సాలిడేటెడ్' పే ద్వారా నియామకాలు చేపడుతున్నట్టు తెలిపిందనీ, ఆ మేరకు 200 మందికి ఉద్యోగాలు ఇచ్చారని గుర్తుచేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల్ని రద్దు చేసి, అప్పట్లో నియమితులైన 200 మందిని రెగ్యులర్ చేయాలని కోరారు. తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ (టీజేఎమ్‌యూ) ప్రధాన కార్యదర్శి కే హన్మంతు ముదిరాజ్, స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అడిషనల్ జనరల్ సెక్రటరీ జీ అబ్రహం, ఎన్ఎమ్‌యూ అధ్యక్ష, కార్యదర్శులు పీ కమాల్‌రెడ్డి, నరేందర్ తదితరులు కూడా కారుణ్య నియామకాలను రెగ్యులర్ ప్రాతిపదికనే చేపట్టాలని వేర్వేరు ప్రకటనల ద్వారా విజ్ఞప్తి చేశారు.

రాజకీయాలకతీతంగా టీఎస్‌పీఎస్సీ పనిచేయాలి : ఏఐఎస్ఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రశ్నాపత్రం లీకేజీపై టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మెన్, సభ్యులను విచారణ చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారి రాజీనామాలను గవర్నర్ ఆమోదించడం సరైందేనని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడారని పేర్కొన్నారు.

కేసులకు భయపడం : కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్ఎస్ కార్యకర్తలపై తప్పుడు కేసులు నమోదు చేస్తోందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. కేసులకు భయపడేది లేదని ఆయన స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో వరంగల్ ఎంపీ స్థానంపై సమీక్ష నిర్వహించిన సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, తమ పార్టీకి పటిష్టమైన లీగల్ సెల్ ఉందన్నారు. బాధితులకు అది అండగా ఉంటుందని వివరించారు. ఒక్క ఎంపీపీపై కేసు నమోదు చేస్తే బీఆర్ఎస్‌కు చెందిన మిగతా ఎంపీపీలందరూ స్పందించాలని కోరారు. తప్పుడు కేసులపై ఎక్కడికక్కడ ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు.

మళ్లీ పుంజుకుందాం

ఆరు గ్యారంటీల అమల్లో అనేక అనుమానాలు :ఎమ్మెల్యే కడియం

అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో కంగిపోవాల్సిన అవసరం లేదనీ, రెట్టించిన ఉత్సాహంతో తిరిగి పుంజుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసుకోవాలని ఆయన సూచించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కడియం మాట్లాడుతూ వరంగల్ ఎంపీ స్థానంపై నిర్వహించిన సమీక్షలో మొత్తం వెయ్యి మంది ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారని తెలిపారు. వారి నుంచి అనేక విలువైన సూచనలు వచ్చాయని అన్నారు. ఇప్పటి నుంచి జిల్లా పార్టీ కార్యాలయాలను పటిష్టంగా పని చేయించేందుకు సమావేశంలో నిర్ణయించామని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమల్లో అనేక అనుమానాలున్నాయని వివరించారు. వాటిలో కోతలు తప్పవని తెలిపారు. కర్నాటకలో అక్కడి సీఎం ఆర్థిక సలహాదారు బసవరాజ్ రాయరెడ్డి గ్యారంటీల అమలు సాధ్యం కాదంటూ చెప్పారని గుర్తు చేశారు. అదే పరిస్థితి తెలంగాణలోనూ పునరావృతం కానుందని హెచ్చరించారు. అందువల్ల గ్యారంటీల అమలుపై ప్రభుత్వంతో పోరాడాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఫార్ములా వన్ రేసులో నిధులు దుర్వినియోగం అయితే విచారణ జరిపించుకోవచ్చనీ, అంతే తప్ప మొత్తం రేస్‌నే రద్దు చేయడం సరికాదని పేర్కొన్నారు.

కార్యకర్త కాలుపై నుంచి వెళ్లిన కెకె వాహనం

వరంగల్ ఎంపీ స్థానంపై సమీక్ష సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఒక చిన్న అపశృతి చోటు చేసుకుంది. రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావు వాహనం అక్కడ ఉన్న ఒక కార్యకర్త కాలుపై నుంచి వెళ్లింది. ఓవర్ స్పీడే దీనికి కారణమని నేతలు చెప్పారు.

'చార్మినార్ ఎక్స్‌ప్రెస్'కు ప్రమాదం

- హైదరాబాద్ నాంపల్లి రైల్వేస్టేషన్‌లో డెడ్ఎండ్ గోడను ఢీకొట్టిన రైలు
- ఆరుగురికి గాయాలు



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదానికి గురైంది. బుధవారం చెన్నై నుంచి హైదరాబాద్‌కు వచ్చిన రైలు నాంపల్లి రైల్వే స్టేషన్‌లో డెడ్ఎండ్ గోడను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. పూర్తి వివరాల్లోకెళ్తే.. బుధవారం చార్మినార్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు చెన్నై నుంచి ప్రయాణికులతో నాంపల్లికి వచ్చింది. రైలు నాంపల్లి రైల్వే స్టేషన్‌కు చేరుకోగానే స్పీడ్ తగ్గినా.. ప్రమాదవశాత్తు డెడ్ఎండ్ గోడను ఢీకొట్టింది. దాంతో మూడు బోగీలు ఎస్2, ఎస్3, ఎస్6 పక్కకు ఒరిగాయి. ఈ ప్రమాదంలో ఆరుగురు ప్రయాణికులకు గాయాలు కాగా, వారిని వెంటనే లాలాగూడ రైల్వే ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. రైలు నుంచి సికింద్రాబాద్‌లోనే చాలా మంది ప్రయాణికులు దిగిపోవడం, ప్రమాద సమయంలో చాలా తక్కువ స్పీడ్‌తో ఉన్న కారణంగా పెద్ద ప్రమాదం తప్పింది. అయితే, లోకో పైలట్ నిర్లక్ష్యం కారణంగా రైలు పట్టాలు తప్పిందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఈ ప్రమాదంలో మేజర్ గాయాలైన వారికి రూ.2 లక్షల చొప్పున, మైనర్ గాయాలైన వారికి రూ.50 వేల చొప్పున నష్టపరిహారాన్ని అధికారులు ఆస్పత్రిలో బాధితులకు అందజేశారు. రైలు ప్రమాదానికి గల కారణాలపై ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నట్టు తెలిసింది.

రైళ్లను పునరుద్ధరించాం : సీపీఆర్ఓ రాకేష్

దక్షిణ మధ్య రైల్వే ఎస్‌సీఆర్, సీపీఆర్ఓ రాకేష్ ఈ ప్రమాదంపై స్పందించారు. చార్మినార్ ఎక్స్‌ప్రెస్ ప్రమా దంలో మూడు బోగీలు పట్టాల తప్పాయని తెలిపారు. ప్రమాదం అనంతరం నాంపల్లికి వచ్చే కొన్ని ఎంఎంటీఎస్ రైళ్లు రద్దయినట్టు తెలిపారు. ప్రస్తుతం పట్టాలను సరిచేసి రైళ్లను పునరుద్ధరించినట్టు చెప్పారు.

ఓపీఎస్‌తోనే ఉద్యోగులకు న్యాయం

- వేతన సవరణ చేపట్టాలి : ఎల్ఐసీ ఉద్యోగ జేఏసీ మెరుపు సమ్మె



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పాత పెన్షన్ విధానాల వల్ల ఉద్యోగులందరికీ న్యాయం జరుగుతుందని, ఎన్‌పీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని ఎల్ఐసీ జేఏసీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ కార్యాలయం ఎదుట బుధవారం మెరుపు సమ్మె చేపట్టారు. ఉద్యోగుల, డీవోలు, ఆఫీసర్ల ఐక్యత వర్ధిల్లాలి... జేఏసీ వర్ధిల్లాలి... ఎన్పీఎస్ మాకొద్దు అంటూ ఉద్యోగులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు సక్కి సత్యనారాయణ, గంగోని శ్రీధర్, చంద్రశేఖర్ పవర్ మాట్లాడారు. తక్షణమే ఉద్యోగులకు వేతన సవరణ చేయాలని, యాజమాన్యం కాలయాపన చేసే విధానాన్ని ఎండగడుతూ ఈ సమ్మె చేసినట్టు తెలిపారు. న్యూ పెన్షన్ స్కీమ్‌లో యాజమాన్యం వాటా 14 శాతానికి పెంచాలని, పాత పెన్షన్ విధానాల వల్ల ఉద్యోగులందరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు. ఎల్ఐసీలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయడానికి తక్షణమే నూతన రిక్రూట్‌మెంట్ చేపట్టాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యోగులందరూ ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమ్మెలో బ్రాంచ్ అధ్యక్షులు సక్కి ఆనంద్ కుమార్, కేపీ శివశంకర్, పీఎస్ స్వామ్రాట్, గంగాధర్, క్లాస్ 1 ఆఫీసర్స్ ఫెడరేషన్ నాయకులు కల్పన, డెవలప్‌మెంట్ ఆఫీసర్ సంఘం నాయకులు గంగోని శ్రీధర్, ఏడీ శ్రీనివాస్, గోపాల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ రక్షణ, పచ్చదనం పెంపు నిరంతర ప్రక్రియ

- 33 శాతం పచ్చదనం కోసం కృషి చేయాలి : హరితహారంపై సమీక్షలో మంత్రి కొండా సురేఖ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అటవీ రక్షణ, పచ్చదనం పెంపు నిరంతర ప్రక్రియ అనీ, లక్షిత 33 శాతం పచ్చదనం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో హరితహారం పురోగతి, వచ్చే సీజన్‌లో చేపట్టాల్సిన చర్యలపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొక్కలు నాటడం, నర్సరీలు, అటవీ సంబంధిత కార్యక్రమాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని వీలైనంతవరకు తగ్గించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఉపయోగపడే, కనీస ఆదాయాన్ని ఇచ్చే పూలు, పండ్లు, కూరగాయల మొక్కలు పంపిణీ చేసి ఇంటి ఆవరణాల్లో పెంచేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. చింత, సీతాఫలం, ఉసిరి, జామ, నిమ్మ, సపోటా, మునగ, కరివేపాకు లాంటి మొక్కలను పంపిణీ చేసేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. హరితహారం కార్యక్రమం పారదర్శకంగా పూర్తి జవాబుదారీతనంతో ఉండాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. గతంలో జరిగిన తప్పులను సవరించుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు నాటుతున్న మొక్కలు, వాటి ఎదుగుదల, అలాగే చనిపోయిన మొక్కలను మార్చే విధానంపై వీలైనంత త్వరగా ఆన్‌లైన్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి వాణీ ప్రసాద్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, పీసీసీఎఫ్ ఆర్ఎం. దొబ్రియాల్, సుభద్ర, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ హనుమంతరావు, మున్సిపల్, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, హార్టీకల్చర్, ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఫారెస్ట్ అధికారులపై ఇసుక మాఫియా దాడిని ఖండిస్తున్నాం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు ఫారెస్ట్ డివిజన్ రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మాఫియాను అడ్డుకునేందుకు వెళ్లిన ఫారెస్టు అధికారులను ట్రాక్టర్ ఎక్కించి చంపడానికి చేసిన కుట్రలను రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ తీవ్రంగా ఖండించారు. సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా ఘటన గురించి మంత్రి తెలుసుకున్నారు. బుధవారం ఈ మేరకు మంత్రి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ ఘటనలో దోషులెంతటి వారైనా ఉపేక్షించబోమనీ, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజా ప్రభుత్వంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలనీ, ఘటనపై పూర్తి విచారణ చేపట్టాలని అధికారులను ఆదే శించారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఇలాంటి ఘటనలపై ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు.అటవీ ప్రాంతంలో గతంలో జరిగిన దాడుల దృష్ట్యా అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలనీ, సహాయ సహకారాలు కావాలంటే తమదృష్టికి తీసుకురావాలని సూచించారు.

కైట్ ఫెస్టివల్‌కు సీఎంకు ఆహ్వానం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఈ నెల 13 నుంచి 15 వరకు జరుగనున్న అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్‌కు రావాలని సీఎం రేవంత్ రెడ్డిని పర్యాటక శాఖ ఆహ్వానించింది. ఈ మేరకు ఆ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఇతర అధికారులు బుధవారం సచివాలయంలో సీఎంను కలిసి ఆహ్వాన పత్రాన్ని అందించారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా ఈ అంతర్జాతీయ వేడుకను నిర్వహిస్తున్నట్టు ఈ సందర్భంగా వారు ఆయనకు వివరించారు.

వచ్చే నెలలో రాడార్ స్టేషన్ పనులు ప్రారంభం

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పరిగి నియోజకవర్గంలోని దామగుండం అటవీ ప్రాంతంలో ఇండియన్ నేవీకి చెందిన ఫ్రీక్వెన్సీ రాడార్ స్టేషన్ పనులు ఫిబ్రవరిలో ప్రారంభమవుతాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. బుధవారం పరిగి ఎమ్మెల్యే రాంమోహన్ రెడ్డి, నేవీ కమాండో కార్తిక్ శంకర్ బందం సచివాలయంలో సీఎంను కలిసి రాడార్ స్టేషన్ పనులపై చర్చించింది. ఫ్రీక్వెన్సీ రాడార్ స్టేషన్ గురించి నేవి అధికారులు ఈ సందర్భంగా ఆయనకు వివరించారు. నావికాదళానికి చెందిన భారీ పరికరాలను ఇక్కడ నిర్మిస్తారనీ, దీని ఏర్పాటు వల్ల పరిగి ప్రాంతం అభివద్ధి చెందుతుందని తెలిపారు. నౌకాదళ అధికారులతో సమన్వయం చేసుకొని పనులు త్వరలో ప్రారంభించాలని ఎమ్మెల్యేకు సీఎం సూచించారు. దేవాలయానికి, పర్యావరణానికి హాని కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

దాడులను అరికట్టేందుకు చర్యలు తీసుకోండి

- సీఎం రేవంత్, మంత్రి దామోదరకు ఐఎంఏ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వైద్యులపై జరుగుతున్న దాడులను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కోరింది. ఈ మేరకు బుధవారం ఐఎంఏ బంజారాహిల్స్ విభాగం అధ్యక్షులు డాక్టర్ చల్లగాని ప్రభుకుమార్, ఇతర నాయకులు సీఎం రేవంత్ రెడ్డి, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి విజ్ఞప్తి చేశారు. డాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. ఈ నెలలో హైదరాబాద్ లో జరగనున్న ఐఎంఏ సమావేశాలకు సీఎంతో పాటు దామోదర రాజనర్సింహను ఆహ్వానించారు. అనంతరం ప్రభుకుమార్ మాట్లాడుతూ డాక్టర్ల సమస్యలను పరిష్కరిస్తామని సీఎం, వైద్యశాఖ మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు.

త్వరలో ఫ్రెండ్లీ ఇండస్ట్రీ పాలసీ

- విజన్ 2050 లక్ష్యంతో రూపకల్పన
- పారిశ్రామికవేత్తలతో మంత్రి శ్రీధర్ బాబు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో త్వరలో ఫ్రెండ్లీ ఇండస్ట్రీ పాలసీ తీసుకొస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఎఫ్టీసీసీఐ, ఫిక్కి, సీఐఐ, ఎఫ్టీఎస్ఏసీ, డిక్కి సంస్థల ప్రతినిధులతో బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ముఖా ముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకున్నారనీ, ఆ మేరకు మార్పు తీసుకొచ్చి చూపిస్తామని స్పష్టం చేశారు. యువ పారిశ్రామికవేత్తలను తయారు చేసే దిశగా ముందుకెళ్తామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనల మేరకు దేశంలోనే గొప్ప విజన్‌తో 2050 మోడల్‌ను అమలు చేస్తామని చెప్పారు. ఎయిరో స్పేస్ రంగానికి తెలంగాణ స్వర్గధామమని, దేశంలోనే ఇక్కడ శక్తివంతమైన ఎయిరో స్పేస్ ఎకోసిస్టమ్ ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.

మిర్చి పంట ధర తగ్గుదల ఎందుకు?

- మార్కెట్ కార్యదర్శులతో లక్ష్మీబాయి సమీక్ష

నవతెంగాణ బ్యూరో - హైదరాబాద్

మిర్చిపంట ధరలు ఎందుకు తగ్గాయని వ్యవసాయ మార్కెటింగ్ సంచాలకులు జి.లక్ష్మీబాయి అధికారులను ప్రశ్నించారు. మార్కెట్ కార్యదర్శులను అందుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బుధవారం హైదరాబాద్‌లోని తన ఛాంబర్‌లో ఆమె వరంగల్, ఖమ్మం మార్కెట్ కమిటీ కార్యదర్శులతో సమీక్షించారు. మార్కెట్ యార్డుల్లో నిత్యం మైకుల ద్వారా ప్రచారం, కరపత్రాలు పంచడం, పత్రికా ప్రకటనలు, ఇతర మాధ్యమాల ద్వారా అవగాహన కల్పించాలని వారికి సూచించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అడ్తిదారులతో, కొనుగోలుదారులతో, ఇతర మార్కెట్ వినియోగదారులతో నిత్యం సంప్రదింపులు జరిపి రైతులు గిట్టుబాటు ధర పొందేలా చొరవ చూపించాలని ఆదేశించారు. దగ్గరలో ఉన్న శీతల గిడ్డంగిలో తమ సరుకును నిల్వ చేసుకుని, ఆ సరుకుపై రూ.రెండు లక్షల వరకు మార్కెటింగ్ శాఖ అమలు చేస్తున్న రైతు బంధు పథకం ద్వారా సమీప వ్యవసాయ మార్కెట్ కమిటీల నుంచి ఆరు నెలల వరకు వడ్డీ లేని రుణ సదుపాయం కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు మార్కెటింగ్ సంచాలకులు పి.రవి కుమార్, సంయుక్త సంచాలకులు వి.శ్రీనివాస్, వరంగల్ ప్రాంతీయ ఉప సంచాలకులు అజ్మీరా రాజు తదితరులు పాల్గొన్నారు.



భారత్ వైపే ప్రపంచ చూపు

వైబ్రెంట్ గుజరాత్‌లో ప్రధాని మోడి

గాంధీనగర్ : ప్రపంచ దేశాలు భారత్ వైపు చూస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోడి అన్నారు. ప్రపంచ ఆర్థికాభివృద్ధికి మూల స్తంభంగా భారత్‌ను భావిస్తున్నాయన్నారు. బుధవారం ఆయన వైబ్రెంట్ గుజరాత్‌లో మాట్లాడుతూ.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధిలో స్థిరత్వానికి మూల స్తంభంగా, ప్రతిభావంతులైన యువత కలిగిన శక్తివంతమైన కేంద్రంగా భారత్‌ను అంతర్జాతీయ సమాజం చూస్తోందన్నారు. భవిష్యత్తులో ప్రపంచంలోనే తృతీయ ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుతోందని అంతర్జాతీయ ఏజెన్సీలు పేర్కొంటున్నాయన్నారు.

వైబ్రెంట్ గుజరాత్‌కు యుఎఇ అధ్యక్షుడు షేక్ మహ్మద్ బిన్ జయిద్ అల్ నహ్యాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బిన్ జాయిద్ రాక ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని ప్రధాని పేర్కొన్నారు. వచ్చే 25 ఏండ్లలో భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా నిలపాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

గుజరాత్‌లో అదానీ గ్రూప్ పెట్టుబడులు రూ.2 లక్షల కోట్లు



వచ్చే ఐదేండ్లలో గుజరాత్‌లో రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్టు అదానీ గ్రూపు చైర్మెన్ గౌతం అదానీ వెల్లడించారు. 2025 నాటికి రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టుల్లో రూ.55 వేల కోట్ల వ్యయం చేయనున్నామన్నారు. ప్రధాని మోడి దేశ భవిష్యత్తు గురించి ఆలోచించడమే కాకుండా.. ఆచరణలోనూ తీర్చిదిద్దారన్నారు. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరించబోతోందన్నారు. గుజరాత్ కచ్ జిల్లాలోని ఖావ్‌డాలో ప్రపంచంలోనే అతిపెద్ద ఇంధన పార్కును నిర్మిస్తున్నట్టు అదానీ తెలిపారు.

అత్యంత విజయవంతమైన ప్రధాని మోడీ : ముకేశ్ అంబానీ



భారత దేశ చరిత్రలోనే నరేంద్ర మోడీ అత్యంత విజయవంతమైన ప్రధానిగా నిలువనున్నారని ముకేశ్ అంబానీ అన్నారు. వైబ్రెంట్ గుజరాత్ సమ్మిట్‌లో అంబానీ మాట్లాడుతూ.. ఈ తరంలో ప్రపంచంలోనే గొప్ప నాయకుడని ప్రశంసించారు. భారత ప్రధాని తన పట్టుదల, సంకల్పంతో అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తారన్నారు. గుజరాత్‌లోని హజీరాలో దేశంలోనే తొలి ప్రపంచ స్థాయి కార్బన్ ఫైబర్ ఫెసిలిటీని ఏర్పాటు చేస్తామన్నారు. గడిచిన పదేండ్లలో దేశ వ్యాప్తంగా రూ.12 లక్షల కోట్ల పెట్టుబడులతో ప్రపంచ స్థాయి ప్రాజెక్టులను చేపట్టామన్నారు. దీంట్లో మూడో వంతు గుజరాత్‌లోనే వెచ్చించినట్టు వెల్లడించారు. 2047 నాటికి భారత్ 35 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని అన్నారు. దీన్ని ఏ శక్తి అడ్డుకోలేదన్నారు. ఒక్క గుజరాత్ రాష్ట్రమే మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుతుందని అంచనా వేశారు.

నాలుగేండ్లలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

- 5 ట్రిలియన్ డాలర్లకు చేరొచ్చు
- 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశం
- ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి



గాంధీనగర్ : నాలుగేండ్లలో ప్రపంచంలోనే భారత ఆర్థిక వ్యవస్థ మూడో అతిపెద్దదిగా అవతరించనుందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. 2027-28 ఆర్థిక సంవత్సరం నాటికి భారత జీడీపీ ఐదు ట్రిలియన్ డాలర్లు (దాదాపు రూ.415 లక్షల కోట్లు)గా ఉండొచ్చని అంచనా వేశారు. బుధవారం గాంధీనగర్‌లో జరిగిన వైబ్రెంట్ గుజరాత్ గ్లోబల్ సమ్మిట్‌లో మంత్రి సీతారామన్ మాట్లాడుతూ.. భారత్ మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం భారతదేశం దాదాపు 3.4 ట్రిలియన్ల డాలర్ల (దాదాపు రూ.282 లక్షల కోట్లు) జీడీపీతో ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉందన్నారు. అమెరికా, చైనా, జపాన్, జర్మనీలు భారత్ కన్నా ముందున్నాయన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7.3 శాతం వృద్ధి రేటు నమోదయ్యే అవకాశాలున్నాయన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో జీడీపీ 7.2 శాతం పెరిగిందన్నారు. దేశంలో 2014 నాటికి 15 కోట్ల బ్యాంక్ ఖాతాలు ఉండగా.. ప్రస్తుతం 50 కోట్ల మందికి పైగా బ్యాంకు ఖాతాలను కలిగి ఉన్నారన్నారు. గడిచిన 23 ఏండ్లలో భారత్‌కు 919 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చాయన్నారు. ఈ ఎఫ్‌డీఐలో 65శాతం అంటే 595 బిలియన్ డాలర్లు గత ఎనిమిది తొమ్మిది సంవత్సరాల్లో వచ్చాయన్నారు. తయారీలోనే కాకుండా సర్వీస్ సెక్టార్‌లోనూ ఎఫ్‌డీఐలు వస్తున్నాయన్నారు. 2047 నాటికి భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చి 100 ఏండ్లు పూర్తికానున్న అమృతకల్ సందర్భంగా కొత్త పరిశ్రమలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కోవిడ్ అనంతర సవాళ్లను భారతదేశ ప్రజలు ఎదుర్కొన్నారన్నారు. 2047 నాటికి దేశ జీడీపీ 30 ట్రిలియన్ డాలర్లకు చేరి.. అభివద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా మారనుందన్నారు.

సంఘ సేవకురాలు ఉషారాణికి ఘన సన్మానం



నవతెలంగాణ - చైతన్యపురి

ప్రముఖ సంఘ సేవకురాలు, తెలంగాణ జన జాగృతి ఫోరం అధ్యక్షురాలు కోటగిరి ఉషారాణిని లూయిస్ బ్రెయిలీ 211 జయంతి వేడుకల సందర్భంగా ఎమ్మెల్సీ దయానంద్ గుప్త చేతుల మీదుగా బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉషారాణి మాట్లాడుతూ మనం సంపాదించిన సంపాదనలో కొద్ది భాగం సమాజ సేవ కోసం వినియోగించాలని కోరారు. పేదలను ఆదుకునేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని చెప్పారు. అనంతరం సన్మానించినందుకు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగారాం, నాగ భూషణం, బిందు తదితరులు పాల్గొన్నారు.

నాగోల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సీపీ



నవతెలంగాణ- నాగోల్

రాచకొండ పోలీస్ కమిషనర్ జి.సుధీర్ బాబు ఐపీఎస్ బుధవారం నాగోల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓసి. వెంకటేశ్వర్లను నూతన పోలీస్ స్టేషన్ ఎలా ఉందని, క్రైమ్ రేట్, పలు అంశాలను సీపీ అడిగి తెలుసుకున్నారు. సంక్రాంతి పండుగను దృష్టిలో పెట్టుకుని ప్రజలు దొంగల నుంచి ఇబ్బందులు పడకుండా అప్రమంతంగా ఉంటూ, తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎస్ఐ శ్రీనివాసు, ఇతర పోలీస్ సిబ్బంది ఉన్నారు.

'స్ట్రామ్ వాటర్ డ్రైన్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి'



- నాంపల్లిలో శానిటేషన్ పనులను పరిశీలించిన కమిషనర్ రోనాల్డ్ రోస్

నవతెలంగాణ-సిటీబ్యూరో

స్ట్రామ్ వాటర్ డ్రైన్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. బుధవారం నాంపల్లి నియోజకవర్గంలో శానిటేషన్, స్టార్మ్ వాటర్ నాలా పనులను నాంపల్లి శాసన సభ్యులు మాజీద్ హుస్సేన్‌తో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కమిషనర్‌కు స్టార్మ్ వాటర్ నాలా, శానిటేషన్, బాల్కపూర్ నాలా పనుల వలన ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ అఘాపూర్ నాలా కల్వర్టు, మల్లేపల్లి మహమూద్ హాస్పిటల్ వద్ద నాలా, తాజ్ నగర్, జీబ్రా డ్రైన్ నాలా పనులను కమిషనర్ పరిశీలించారు. అఘాపూర్ నాలా కల్వర్టు పనులు స్లాబ్ పనులు పూర్తయ్యాయని మిగిలిన పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. మహమూద్ హాస్పిటల్ వద్ద నాలా నిర్మాణం పనులు చేపట్టేందుకు క్రింది భాగంలో ఉన్న స్లమ్ కాలనీ ఇబ్బంది పడుతారని అధికారులు చెప్పడంతో అలైన్మెంట్ మార్చి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జీబ్రా స్టార్మ్ వాటర్ నాలా పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అన్నారు. భూసేకరణ పనులు చేపట్టి పూర్తి చేయాలన్నారు. బాల్కపూర్ నాలా పనులకు భూసేకరణ పూర్తి చేసి సత్వరమే పూర్తి చేయాలనీ ఆస్తులు కోల్పోయిన వారికి వెంటనే నష్టపరిహారం చెల్లించి రిటర్నింగ్ వాల్ పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ జోన్ కమిషనర్ వెంకటేష్ దోత్రె, ఎస్.ఇ రత్నాకర్, ఎస్.ఎన్.డి.పి కిషన్, ఈ.ఈ లాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్ నిందితుడికి రిమాండ్

నవతెలంగాణ -నాగోల్

చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఓ నిందితుడిని పోలీసులు బుధవారం పట్టుకొని రిమాండ్ తరలించారు. నాగోల్ పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ సి.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 8న జామండ్ల పద్మమ్మ అనే మహిళ తన కుమారుని నూతన ఇంటి నిర్మాణం వద్ద ఆటోలో కూర్చుని ఉండగా.. ఆమె మెడలోంచి ఆరు తులాల పైచిలుకు బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి లాక్కెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న నాగోల్ పోలీసులు.. నిందితుడిని పట్టుకోవడానికి ఎల్బీనగర్ సిసిఎస్ పోలీసులు, నాగోల్ పోలీసులు బృందంగా ఏర్పడి ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. ఈ మేరకు బుధవారం నాగోలు చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో పోలీసులు నిందితుడిని గుర్తించారు. అతన్ని పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా..నేరాన్ని అంగీకరించారు. అతని వద్ద నుండి ఒక మారుతి స్విఫ్ట్ కారు, గోల్డ్ చైన్, నాను, యాక్టివా మోటార్ సైకిల్, రూ.లక్ష నగదును, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. తర్వాత రిమాండ్‌కు తరలించారు.

నిందితుడి వివరాలు..

నిందితుడు చెవుల ప్రశాంత్ నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం అల్వాల్ గ్రామానికి చెందినవాడు. ఎల్బీనగర్ మెట్రో పార్కింగ్ సమీపంలోని ఇండోర్ స్టేడియం పక్కన నివాసం ఉంటున్నాడు. 2018లో హైదరాబాద్‌కు వచ్చిన ప్రశాంత్ కుమార్ ప్రస్తుతం ఉద్యోగం అన్వేషణలో ఉంటూ, మద్యం, చెడు అలవాట్లకు బానిసై సులువుగా డబ్బు సంపాదించేందుకు పథకం వేశాడు. దీనిలో భాగంగా చైన్ స్నాచింగ్, మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఇతనిపై ఇప్పటికే హయత్ నగర్ పోలీస్ స్టేషన్లో ఒక కేసు నమోదైంది. రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు ఐపీఎస్ నేతృత్వంలో ఎల్బీనగర్ డీసీపీ సిహెచ్ ప్రవీణ్ కుమార్, క్రైమ్ డీసీపీ వి అరవింద్ బాబు, అదనపు డీసీపీ ఎం శ్రీనివాస్, క్రైమ్ అదనపు డీసీపీ కోటేశ్వరరావు, ఎల్బీనగర్ ఏసీపీ జానకి రెడ్డిల మార్గదర్శకత్వంలో నాగోలు, ఉప్పల్ పోలీసుల తోపాటు క్రైమ్ బృందం పనిచేశారని తెలిపారు.

అష్టలక్ష్మి దేవాలయంలో ధనుర్మాసం పూజలు



నవతెలంగాణ - చైతన్యపురి

మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్ పరిధిలోని వాసవి కాలనీ అష్టలక్ష్మి దేవాలయంలో ధనుర్మాసం సందర్భంగా దేవాలయ ప్రధాన అర్చకులు రాఘవచార్యుల ఆధ్వర్యంలో బుధవారం హారతి పశురాం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 25 శ్రీ వైష్ణవ దేవాలయాలకు చిలుక ఉపేందర్‌రెడ్డి విశేష శేషమాలలు అందించారు. ఈ మాలలు 25 దేవాలయాల నుండి తిరిగి ఊరేగింపుగా అష్టలక్ష్మి దేవాలయానికి తీసుకొనివచ్చి గోదారంగనాయక స్వామి వారికి సమర్పించిన అనంతరం దీపోత్సవం కూడా చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ సోమా సురేష్ దంపతులు, కోశాధికారి అయిత అంజయ్య దంపతులు, చిలుక మధుర ఉపేందర్ రెడ్డి, మాలే శ్రీనివాస్, దాచేపల్లి శ్రీనివాస్, గౌరీ శంకర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

సమసమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకం



- డాక్టర్ అశోక్

నవతెలంగాణ- బడంగ్ పేట్

సమసమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని, విద్య విజ్ఞానం తోపాటు సంపూర్ణ వికాసం సాధ్యమవుతుందని సైకాలజిస్టుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న ప్రభుత్వ బడంగ్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో బుధవారం 10వ తరగతి విద్యార్థులకు శాస్త్రీయ ప్రణాళిక పునశ్చరణతో పరీక్షల్లో విజయం అనే అంశంపై డాక్టర్ పరికిపండ్ల అశోక్ అవగాహన కల్పించారు. బాలాపూర్ మండలంలో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ సైకాలజిస్టుల సంఘం సహకారంతో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని 10వ తరగతి విద్యార్థులకు మూడు నెలల పాటు నిర్వహించే రాష్ట్రవ్యాప్త ప్రేరణ కార్యక్రమన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యతోనే సమాజంలో గౌరవం-ముందడుగు సాధ్యమని, శాస్త్రీయ ప్రణాళిక -పునశ్చరణతో పరీక్షల్లో విజయం సాధించవచ్చునని అన్నారు. విద్యార్థులు చదువుకునే వయసులోనే వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు.

ఉచిత ప్రేరణ సదస్సులు నిర్వహించడం అభినందనీయం..

ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ పది సంవత్సరాలుగా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచిత ప్రేరణ సదస్సులు నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థుల పరీక్ష ఫలితాలను పెంపొందించుట కోసం పరీక్షల్లో విజయం సాధిం చాలంటే అనే అంశంపై ఉచితంగా ప్రేరణ సదస్సులు నిర్వహిస్తున్నామని, విద్యార్థులు, సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు సద్వినియోగ పరచుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం ఫోన్ నెంబర్ 9989310141ను సంప్రదించాలని చెప్పారు. విద్యార్థులు చదువుకునే పద్ధతులు, జ్ఞాపకశక్తి, మెలకువలు, టెన్షన్ అధిగమించే మార్గాలను, జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లను ఎదుర్కొని సమస్యలను అధిగమించి ఎలా ముందుకు పోవాలని సోదాహరణంగా విద్యార్థులకు వివరించారు. జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు కోరాని అర్జున్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా బోసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేఖర్, సీనియర్ ఉపాధ్యాయులు జ్యోతి, రాజశేఖర్, అరుణ, వెంకటరమణారెడ్డి, వనజ, ప్రతాపరెడ్డి, సంగీత, సంతోష, హరికృష్ణ, సూర్యప్రభ అంజయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



అక్రమ నిర్మాణాల కూల్చివేత

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

మండలంలోని ఇనాంగూడ గ్రామ రెవెన్యూ సర్వేనెం 10లో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను రెవెన్యూ అధికారులు బుధవారం కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రవీందర్ దత్తు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడడం తమ బాధ్యత అని అన్నారు. ఆక్రమణకు పాల్పడితే ఎంతటివారినైన ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీ గోదా దేవి అమ్మవారికి సారె సమర్పణ



- పాల్గొన్న చిన్న జీయర్ స్వామి

నవతెలంగాణ - చైతన్యపురి

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను కల్గి ఉండాలని త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి అన్నారు. ఆర్కేపురం డివిజన్ టెలిఫోన్ కాలనీ రోడ్ నెంబర్ -1లో శ్రీమాన్ లక్ష్మి జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీ గోదా దేవి అమ్మవారికి బుధవారం సారే సమర్పించారు. ఈ కార్యక్రమానికి జీయర్ స్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సారే సమర్పణ సేవలో పాల్గొన్న భక్త గోష్టికి త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి మంగళశాసనములు చేశారు. ఈ కార్యక్రమంలో పద్మ, వరలక్ష్మి, పద్మనాభ రావు, లక్ష్మి, భక్తులు పాల్గొన్నారు.

నాగోల్‌లో ఎన్ క్యాంట్ హోటల్ ప్రారంభం



నవతెలంగాణ- నాగోల్

నాగోలు డివిజన్‌లోని కో ఆపరేటివ్ బ్యాంక్ కాలనీ రోడ్ నెంబర్ 16లో అనంతుల సురేందర్ రెడ్డి తనయుడు వీక్షిత్ రెడ్డి తన మిత్రులతో కలిసి నూతనంగా ఎన్ క్యాంట్ హోటల్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేంద్రనాథ్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పరిశుభ్రతతో పాటు రుచికరమైన ఆహార పదార్థాలను వినియోగదారులకు అందించాలని అన్నారు. అతిథులను ఆకట్టుకుని వ్యాపారాభివృద్ధిలో ముందుకు వెళ్లాలని నిర్వాహకులకు సూచించారు. ఈ ప్రారంభంలో ఎల్బీనగర్ వాటర్ బోర్డు జనరల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, నాగార్జునసాగర్ వాటర్ బోర్డు జనరల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, అనంతుల సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని మలక్‌పేట్ కాంగ్రెస్ నాయకులు కొమిరెల్లి రాజశేఖర్ రెడ్డి, బాబు శ్రీనివాస్, చౌకి రవికుమార్, సీపీఐ నాయకుడు అబ్దుల్ మన్నన్‌లు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత పుష్పగుచ్చం అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజలకు అందించాలని సూచించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ మల్ రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి దక్కడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు.

నవతెలంగాణ- సంతోష్ నగర్

శ్రీనివాస్ గుప్తాను కలిసిన సూర్య





నవతెలంగాణ- నాగోల్

ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస గుప్తను బుధవారం నాగోలులోని ఆయన నివాసంలో తమిళనాడు రాష్ట్ర ఐవీఎఫ్ యూత్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ జె సూర్య మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత ఒకరినొకరు శాలువాలతో సత్కరించుకున్నారు. ఈ సందర్భంగా వారు సౌత్ జోన్‌లో ఐవీఎఫ్ బలోపేతంపై ఆత్మీయంగా చర్చించారు. అదేవిధంగా జనవరి 23న హైదరాబాద్ నగరంలో జరిగే సౌత్ జోన్ మీట్ గురించి చర్చించారు.



చేవెళ్ల పార్లమెంట్ మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డిని బుధవారం ఆయన నివాసంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కొలన్ శంకర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. తర్వాత పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం పుష్పగుచ్చం అందజేసి, ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

నవతెలంగాణ- బడంగ్ పేట్

పట్టాలు ఇచ్చారు.. ఇండ్లు ఇవ్వండి



- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి లబ్ధిదారుల వినతి

నవతెలంగాణ - చైతన్యపురి

డబల్ బెడ్ రూం ఇండ్లకు సంబంధించి పట్టాలు ఇచ్చారని.. వెంటనే ఇండ్లను ఇవ్వాలని మహేశ్వర నియోజకవర్గం డబల్ ఇండ్ల లబ్దిదారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు లబ్దిదారులు బుధవారం మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డబల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న తమకు ఆ ఇండ్ల కేటాయింపు జరిగిందని తెలిపారు. కానీ ఎన్నికల కారణంగా కొద్దిరోజులుగా తమకు పొజిషన్ చూపించడం లేదని, తాళాలు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలు పూర్తై నెల దాటినా తమ పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యేక చొరవ తీసుకొని తమకు కేటాయించిన డబల్ బెడ్ రూం ఇండ్ల పొజిషన్ ఇప్పించాలని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో మంజుల, సక్కుబాయి, ఉమారాణి, సంధ్యా, హైమావతి, శోభారాణి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు



నవతెలంగాణ - మీర్‌పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 9వ డివిజన్ నందీహిల్స్ కాలనీ ఫేజ్ -1 ఆధ్వర్యంలో బుధవారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో దాదాపు 90 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్లు, పెండ్యాల శివపార్వతి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతి లక్ష్మీ ప్రసన్న, రెండోవ బహుమతి నాగ గాయత్రి, మూడోవ బహుమతి ఆర్ స్వాతి గెలుపొందారని చెప్పారు. పోటీల్లో పాల్గొన్న మహిళలందర్నీ ఉత్సాహపరిచేందుకు అందరికీ బహుమతులు అందజేసినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు, కార్పొరేటర్ పెండ్యాల నర్సింహ, కాలనీ అధ్యక్షుడు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి, నాగేష్ యాదవ్, దుర్గయ్య, జగన్మోహన్ రావు, నాయకులు బెల్లంకొండ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి రాగన్నగూడ (ఎస్ఎస్ఆర్ నగర్) ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఢిల్లీ జగదీశ్వర్ ముదిరాజ్, ఉపాధ్యక్షులుగా పళ్ళ వెంకటయ్య, జనరల్ సెక్రెటరీగా ఎడ్ల వెంకటేష్, జాయింట్ సెక్రటరిగా ఖమ్మం రమేష్, కోశాధికారిగా ఎడ్ల దానయ్య, ముఖ్య సలహాదారులుగా పిట్టల నరేష్, ఢిల్లీ పాండు, సభ్యులుగా గోదాసు నరేష్ , కానమని వెంకటేష్ , రెడ్డమోని సాయి కుమార్, చింతకాయల యాదగిరి, ధనమోని నరేష్, గడిగ యాదగిరి, కొర్ని శివ, పొలమోని సాయికిరణ్, పుల్లగాజుల నరేష్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు ఢిల్లీ జగదీశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సంఘ సభ్యులకు ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గోదాసు భద్రయ్య, రెడ్డమోని కోటయ్య, పూజారి నందీశ్వర్, ఢిల్లీ శ్రీనివాస్, చింతకాయల యాదయ్య, ఢిల్లీ నర్సింహ, ఖమ్మం విఠలేష్, పొలమోని రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్ డ్రైవర్లు సహకరించాలి



- ఎల్బీనగర్ ట్రాఫిక్ ఏసీపీ నవీన్ రెడ్డి

నవతెలంగాణ - హయత్ నగర్

ట్రాఫిక్ నియంత్రణకు ఆర్టీసీ బస్ డ్రైవర్లు సైతం సహకరించాలని ఎల్బీనగర్ ట్రాఫిక్ ఏసీపీ నవీన్ రెడ్డి అన్నారు. ఎల్బీనగర్‌లో ఉన్న బస్ స్టాండ్ వద్ద ఆర్టీసీ సిబ్బందితో కలిసి ట్రాఫిక్ పోలీసులు బుధవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సురక్షితంగా తమ తమ గమ్య స్థానాలకు చేరేందుకు గాను ఆర్టీసీ, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా చేస్తున్న డ్రైవ్‌లో భాగంగా ఈ పండుగకు ప్రత్యేక బస్సులను తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట ఎల్బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సింగ్ రావు తదితరులు ఉన్నారు.

8
నవతెలంగాణ
మేడ్చల్-ఉప్పల్
గురువారం | జనవరి 11, 2024 | www.navatelangana.com

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ఘనంగా సన్మానం



నవతెలంగాణ-కాప్రా

అసెంబ్లీకి ఎన్నికల్లో ఉప్పల్ ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన బండారి లక్ష్మారెడ్డిని శుభోదయ నగర్ కాలనీ ప్రెసిడెంట్ బి.శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

రోనాల్డ్ రాస్‌ను కలిసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కాప్రా

హైదరాబాద్ జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. చర్లపల్లి డివిజన్‌లో జరిగిన నాలా కెమికల్ బ్లాస్ట్ గురించి చర్యలు తీసుకోవాలని బండారి కమిషనర్‌ను కోరారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్‌లోని కుషాయిగూడ, సెయింట్ జోసెఫ్ కాలనీల్లో 1250 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పెండింగ్‌లో ఉన్న అరకొర పనులను త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, మహేష్‌గౌడ్, జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది, డివిజన్ నాయకులు, కాలనీల అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కుషాయిగూడలోని చాకలి బస్తీలో..

చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడలోని చాకలి బస్తీలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధనపాల్ రెడ్డి, కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పనగట్ల చక్రపాణి గౌడ్, చిత్తుల కిషోర్, చల్లా వెంకటేష్ , వరప్రసాద్, బ్రహ్మ చారి, అనిల్, జి. కృష్ణ కుమార్, కే. మాధవరెడ్డి, యాదయ్య, నందు, రాజు, శంకర్, మణి కిరణ్,సుధీర్ బాబు, చల్లా శ్రీను, సాయి, గ్రామపెద్దలు పండాల శివకుమార్ గౌడ్, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, మహేష్‌గౌడ్, తాళ్ల వెంకటేష్, శ్రీకాంత్ యాదవ్, కాంట్విన్ రాములు, గణేష్ ముదిరాజ్, సారా అనీల్, గంప కృష్ణ, యాదయ్య చల్లా యాదయ్య, చల్లా నర్సింహా, చల్లా లక్ష్మణ్, నరేందర్, శ్రీనివాస్, న్.రాకేష్, జీహెచ్ఎంసీ అధికారులు, ఏఈ స్వరూపరాణి, జీహెచ్ఎంసీ సిబ్బంది, డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ముగ్గుల పోటీల నిర్వహణ



నవతెలంగాణ-కాప్రా

అభయ అసోసియేషన్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ ఆధ్వర్యంలో అనుముల నరసింహారెడ్డి సహకారంతో సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ముగ్గుల పోటీలో 30 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలతో పాటు వినోదప్రధానమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్న అభయ సంస్థ అధ్యక్షురాలు ధరం ఉషను, సంస్థ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమానికి హాజరైన బండారి లక్ష్మారెడ్డికి, సహకరించిన అనుముల నరసింహారెడ్డికి, అభయ సంస్థ అధ్యక్షురాలు ధరం ఉష కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలుగా ఝాన్సీ, పద్మ, విజయలక్ష్మీ సుధోత్సల, సంస్థ సెక్రెటరీ సుచిత్ర, జాయింట్ సెక్రటరీ అలివేణి, భానుమతి, షకీల పాల్గొన్నారు.

మంచినీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట హౌసింగ్ బోర్డు కాలనీ డివిజన్, కృష్ణానగర్ కాలనీలో రోడ్డు నెంబర్ 2లో మంచినీటి ప్రధాన పైప్‌లైన్ లీకేజీ సమస్యను కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తక్షణ మరమ్మత్తు పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మౌలాలి ట్రాన్స్‌మెషన్ మేనేజర్ సౌమ్య, వాటర్ వర్క్స్ మేనేజర్ వేణు గోపాల్ పాల్గొన్నారు.

గౌడ సంఘం సమస్యలను పరిష్కరిస్తా : బీఎల్ఆర్



నవతెలంగాణ-కాప్రా

గౌడ సంఘం సభ్యుల సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. చర్లపల్లి గీత పారిశ్రామిక సహకార సంఘానికి చెందిన ఐదు ఎకరాల భూమిలో (సర్వే నంబర్ 278) జీహెచ్ఎంసీ, ఇరిగేషన్ డిపార్టుమెంటు వారు అక్రమంగా వాకింగ్ ట్రాక్, అక్రమ పైప్‌లైన్ పనులు చేపడుతుండడంతో చర్లపల్లి గౌడ సంఘం సభ్యులు ధర్నా నిర్వహించారు. ఈ విషయం ఎమ్మెల్యే బండారి దృష్టికి తీసుకెళ్లగా బుధవారం గౌడ సంఘానికి చెందిన స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె. ఆనంద్ రాజు గౌడ్, ఆర్. రాంచందర్ గౌడ్, బి. రాజుగౌడ్, ఆర్. నరసింహ గౌడ్, ఎన్. అశోక్ గౌడ్, బి.అంజయ్య గౌడ్, బి.ఆనంద్ గౌడ్, ఆర్. నాథం గౌడ్, బి. రాములు గౌడ్, కె. ప్రేమ్ గౌడ్, ఆర్. బాబు గౌడ్, కె. శ్రీకాంత్‌గౌడ్, జ్ఞానేశ్వర్‌గౌడ్, శ్రీ రాములు గౌడ్, బి.క్రాంతిగౌడ్, ఎన్.భాను గౌడ్, రంజిత్ గౌడ్, రాకేష్ గౌడ్, సాయిరామ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌ను తొలగించాలని కాలనీవాసుల ధర్నా



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్‌లోని ఆదిత్యనగర్‌లో అక్రమంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను తొలగించాలని కాలనీవాసులు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు నాగిరెడ్డి సంజీవరెడ్డి, రామాచార్యులు మాట్లాడుతూ..రోజురోజుకు భూగర్భ జలాలు అడుగంటి పోతుంటే నిబంధనలు విరుద్ధంగా అక్రమంగా వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి నీటి వ్యాపారాన్ని చేస్తే కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. వెంటనే అధికారులు స్పందించి వాటర్ ప్లాంట్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు.

మంచి సమాజం కోసం ముందుకు నడుద్దాం

- హైదరాబాద్ రేంజ్ డీఐజీ శ్రీనివాస్, చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ శ్రీనివాస్‌గౌడ్
- యూత్ ఫర్ యాంటీ కరప్షన్ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

యూత్ ఫర్ యాంటీ కరప్షన్ క్యాలెండర్‌ను హైదరాబాద్ రేంజ్ జైళ్లశాఖ డీఐజీ శ్రీనువాస్, చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ శివకుమార్ గౌడ్ వారి కార్యాలయాల్లో ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అవినీతి రహిత సమాజం కోసం యువతరాన్ని ఏకం చేసే దిశగా యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ముందుకు నడవాలన్నారు. సమాజంలో తమ వంతు బాధ్యతగా రెండు తెలుగు రాష్ట్రాల్లో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ వినూత్న కార్యక్రమాలతో ముందుకు నడవడం అభినందనీయమన్నారు. అవినీతిని ప్రశ్నించడమే కాకుండా, నిజాయితీని బలికించాలనే ఆలోచనతో సమాజంలోని వివిధ రంగాల్లో పని చేసిన, పని చేస్తున్న అధికారులను గుర్తించి నేటి యువతరానికి పరిచయం చేయడం వల్ల, మంచి ఆలోచన గల యువత తయారవుతున్నారు. యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి మాట్లాడుతూ.. మరిన్ని వినూత్న కార్యక్రమాలతో ముందుకు నడుస్తామని, సమాచార హక్కు చట్టంపై సామాన్యుల్లో అవగాహన కల్పిస్తామన్నారు. ఈ క్యాలెండర్ ఆవిష్కరణలో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సలహాదారులు, రాష్ట్ర కార్యదర్శి కొన్నె దేవేందర్, జాతీయ కార్యవర్గ సభ్యులు కొమటి రమేశ్ బాబు, చెరుకూరి జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

'హిట్‌రన్ చట్టాన్ని రద్దు చేయాలి'



- ఉప్పల్, రామంతాపూర్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆందోళన

నవతెలంగాణ-ఉప్పల్

కేంద్రం తెచ్చిన హిట్‌రన్ చట్టాన్ని రద్దు చేయాలని ఉప్పల్, రామంతాపూర్, డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు వీరలాల్, కత్తుల యాదయ్య అన్నారు. బుధవారం హిట్‌రన్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఉప్పల్, రామంతాపూర్ లారీ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త హిట్‌రన్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో డ్రైవర్స్ ఆగ్రహానికి గురి కాక తప్పదని హెచ్చరించారు. చట్టాన్ని రద్దు చేయకుంటే వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్తామన్నారు. డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్, మల్లేష్, కృష్ణ, తదితరులున్నారు.

'నాలాలు కబ్జా చేస్తే చట్టపరమైన చర్యలు'



నవతెలంగాణ-శామీర్‌పేట

నాలాలు అక్రమంగా కబ్జా చేస్తే ఎంతటివారైనా చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని జెడ్పీ చైర్మెన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి హెచ్చరించారు. బుధవారం మండల పరిషత్తు సమావేశ మందిరంలో ఎంపీపీ దాసరి ఎల్లూభా యిబాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రయివేట్ భవనంలో ఉన్న సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని మండల కార్యాలయం వద్ద ఏర్పాటు చేయాలని సభ్యులు ఏకగ్రీవం గా తీర్మానం చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మెన్ మాట్లా డుతూ...నాలాలు కాపాడే బాధ్యత ఇరిగేషన్ అధికారులదేన ని తెలిపారు. అధికారులు తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాలని సూచించారు. సమస్యల శాశ్వత పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంద'ని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మెన్ మధుకర్‌రెడ్డి, జెడ్పీటీసీ మహంకాళి అనితలాలి, వైస్ ఎంపీపీ సుజాత, ఎంపీడీవో వాణి గరుదాస్, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.



డిప్యూటీ సీఎం భట్టిని కలిసిన నాయకులు

- దళితుల భూములను ఆన్‌లైన్ చేసి పాసు బుక్కులు ఇవ్వాలని వినతి



నవతెలంగాణ-శామీర్‌పేట

మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ ఆధ్వర్యంలో మూడుచింతలపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు ప్రజా భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మూడుచింతలపల్లి గ్రామంలో అసైన్డ్ భూమి సర్వే నెంబర్లు 20, 30లో దళితులకు భూమి ఉందని తెలిపారు. గత ప్రభుత్వం ధరణి పోర్టల్ తీసుకొచ్చి దళితుల భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా, పట్టాదారు పాస్ బుక్కులు ఇవ్వకుండా దళిత రైతులకు అన్యాయం చేసిందని ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించి త్వరలో పాస్ పుస్తకాలు ఇప్పించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని ఎంసీపల్లి నాయకులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటరమణారెడ్డి, వార్డు సభ్యులు వేణుగోపాల రావు, రాజేంద్రప్రసాద్ గౌడ్, జెర్రిపోతుల నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

హ్యాపీ మొబైల్స్ స్టోర్స్‌లో సంక్రాంతి ఫెస్టివల్ ఆఫర్స్ ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలుగు రాష్ట్రాల్లో 85 ప్లస్ స్టోర్స్‌తో తిరుగులేని ఆఫర్స్ ఇస్తూ 15 లక్షలకుపైగా వినియోగదారుల ఆనందానికి కారణమైన హ్యాపీ మొబైల్స్ ఇప్పుడు సంక్రాంతి పండుగ సందర్భంగా మొబైల్స్, ఎల్ఈడీ స్మార్ట్ టీవీఎస్, ల్యాప్‌టాప్స్‌పై తిరుగులేని ఆఫర్స్‌తో సంక్రాంతి అంటేనే హ్యాపీ అనే నినాదంతో కస్టమర్స్‌కి అత్యద్భుతమైన ఆఫర్స్ ఇప్పుడు మరింత చేరువలోకి తీసుకొచ్చింది. మొబైల్స్, ఎల్ఈడీ స్మార్ట్ టీవీఎస్, ల్యాప్‌టాప్ కొనుగోలుపై అత్యధికంగా 5శాతం వరకు క్యాష్ బ్యాక్ పొందే అవకాశం అందిస్తున్నామ ని, తమ కస్టమర్లకి ఆన్‌లైన్ కన్నా బెటర్ ఆఫర్స్‌తో పాటు ఎన్నో అత్యద్భుతమైన డీల్స్, ఆఫర్స్, స్పెషల్ డిస్కౌంట్స్ ఎన్నో ఈ సందర్భంగా అందిస్తున్నామని హ్యాపీ మొబైల్స్ యాజమాన్యం ప్రకటించింది. 'అందరికీ సంతోషాన్ని వ్యాప్తి చేయాలని మా సిద్ధాంతంతో సమాజానికి మన వంతు హితంగా 1,50,000 భోజనాలను అక్షయ పాత్ర ద్వారా అందించారు. రక్తదాన శిబిరాలను సైతం ప్రజలు, తమ కస్టమర్లకును భాగం చేయడం ద్వారా తాము ఇప్పటి వరకు 10 వేలకుపైగా జీవితాలను కాపాడగ'లిగాం. మా వ్యాపార దక్షత గుర్తింపుగా ఎన్నో ప్రతిష్టాత్మక అవార్డు అందుకు న్నాం' అని హ్యాపీ మొబైల్స్ సీఎండీ కృష్ణ పవన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోట సంతోష్ తెలిపారు.

గూడెంగడ్డ, దొంగలగుట్ట తండాలకు

రోడ్డు సౌకర్యం కల్పించాలి

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నరేష్



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని రావల్‌కోల్ అనుబంధ గ్రామాలైన గూడెంగడ్డ, దొంగలగుట్ట తండాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని సీపీఐ(ఎం) మేడ్చల్ మండల కార్యదర్శి నరేష్ ఆధ్వర్యంలో బుధవారం మండల సూపరిండెంట్ ఉదయ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం నరేష్ మాట్లాడుతూ.. రావల్‌కోల్ గ్రామంలోని జీవన్‌రెడ్డి తోట నుంచి దొంగలగుట్టతండా వరకు రోడ్డు వేయాలని కోరినట్లు తెలిపారు. రోడ్డు సౌకర్యం లేక తండాలోని 400మంది ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు సరిగ్గా లేకపోవడంతో స్కూలుకు వెళ్లే విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారని చెప్పారు. విద్యార్థులు చదువుకోవాలంటే నాలుగు కిలోమీటర్లు నడిచి వెళ్లే పరిస్థితి ఉందన్నారు. హైదరాబాద్‌కు కూతవేటు దూరంలో ఉన్న తండాల దుస్థితికి స్థానిక రాజకీయ నాయకులు లేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వస్తారు తప్పా.. సమస్యలను పరిష్కరించే సోయి లేదని విమర్శించా రు. ఆర్టీసీ బస్సు సైతం రావడంలేదన్నారు. ఇప్పటికైనా స్థానిక నాయకులు, అధికారులు, ఎమ్మెల్యే మల్లారెడ్డి సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తండావాసులు తేజవత్ శారద, బానోత్ సుజాత, తేజవత్ కమల, తేజవత్ వంశీ పాల్గొన్నారు

క్రీడలతో శారీరక ధృడత్వం..మానసిక ఉల్లాసం



- ఎంపీపీ దాసరి ఎల్లూభాయిబాబు

నవతెలంగాణ-శామీర్‌పేట

క్రీడలు శారీరక ధృడత్వంతోపాటు మానసికొల్లాసానికి దోహదపడుతాయని ఎంపీపీ దాసరి ఎల్లూభాయిబాబు అన్నారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో బుధవారం షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ వసతి గృహ విద్యార్థిని, విద్యార్థులకు జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ హాజరయ్యారు. ఈ పోటీలలో బాల బాలికలకు లాంగ్ జంప్, షాట్‌పుట్, రన్నింగ్ బాలికలకు నిర్వహించి ప్రతిభ కనబరచిన వారికి ప్రథమ, ద్వితీయ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ అనితలాలి, సర్పంచ్ విలసాగరం బాలమణి, జిల్లా షెడ్యూల్ కులాలకు అతిథి అధికారి జి. వినోద్ కుమార్, జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ ఆఫీసర్ బలరాం, సహాయ ఎస్సీ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, పీడీ మురళీకృష్ణ, పీఈటీలు సత్తిరెడ్డి, గోపాల్ చారి, రాధిక, శ్వేత, మేడ్చల్ జిల్లా షెడ్యూల్ కులాల వసతి గృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

ఓబీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన గువ్వ రవి ముదిరాజ్



నవతెలంగాణ- మేడ్చల్

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు నూతి శ్రీకాంత్ గౌడ్‌ను మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా అధ్యక్షుడు గువ్వ రవి ముదిరాజ్ బుధవారం వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి, అయ్యప్ప స్వామి ప్రసాదం అందజేశారు. కలిసిన వారిలో ఓ బీసీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ దేశబోయిన రవికుమార్, జాయింట్ కోఆర్డినేటర్ గడ్డమీది భరత్‌గౌడ్ ఉన్నారు.



కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డిని మేడ్చల్ జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు పత్తి కుమార్, ఎస్టీ విభాగం అధ్యక్షులు గణేష్ నాయక్‌లు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నవతెలంగాణ, కాప్రా

నవతెలంగాణ

కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్ - మల్కాజిగిరి

గురువారం | జనవరి 11, 2024 | www.navatelangana.com

నూతన సీఐ శ్రీనివాస్ రావుకు అభినందనలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

జీడిమెట్ల నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ రావును సన్మానించిన సీపీఐ, సీపీఎం, ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు వారికి హృదయపూర్వక అభినందనలు తెలియచేస్తూ శాలువతో సత్కరించి పులకుండిని బహుకరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్, సీపీఎం మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్వామి, శ్రీనివాస్, నియోజకవర్గ అధ్యక్షుడు హరినాథ్, సీఐటీయూ నాయకుడు దేవదానం తదితరులు పాల్గొన్నారు.

12న గాంధీనగర్‌లో రక్తదాన, ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

స్వామి వివేకానంద 161వ జయంతి ఉత్సవాలు పురస్కరించుకొని ఈనెల 12 న శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రంగారెడ్డి నగర్ డివిజన్లోని గాంధీనగర్ కమ్యూనిటీ హాల్లో 18 వ రక్తదాన శిబిరంతోపాటు లయన్స్ క్లబ్ ఆఫ్ జీడిమెట్ల (హైదరాబాద్) మల్లారెడ్డి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కీళ్లనొప్పుల, గుండె సంబంధిత, దంత, షుగర్ వ్యాధి శిబిరాలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1,30 వరకు నిర్వహిస్తున్నట్లు స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ అధ్యక్షులు జల్దా లక్ష్మీనాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పలువురు ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. పరిసర ప్రాంత వాసులు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

104 (2) చట్టాన్ని రద్దు చెయ్యాలి



- సీఐటీయూ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్

నవతెలంగాణ-బాలానగర్

భారత న్యాయ సంహిత (బి.ఎన్.ఎస్) చట్టంను రద్దు చేయాలని కూకట్‌పల్లి సర్కిల్ బాలానగర్ డివిజన్‌లోని ఐడీపీఎల్ చౌరస్తాలో సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ట్రక్, ప్రయివేటు బస్సుల డ్రైవర్లు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ కేంద్ర ప్రభుత్వం ప్రతి పక్ష పార్టీల ఎంపీలను పార్లమెంట్ నుండి సస్పెండ్ చేసి అడ్డదారిలో డ్రైవర్‌లను బతికి ఉండగానే చచ్చినట్లుగా నూతన చట్టం తీసుకొచ్చరన్నా రు. ఈ చట్టం ప్రమాదాలు జరిగినప్పుడు డ్రైవర్లకు 10 ఏండ్లు జైలు శిక్ష, రూ. 7లక్షల నష్టపరిహారం ఇచ్చేలా భారత న్యాయ సంహిత (బి.ఎన్.ఎస్) చట్టం 104 (2) తెచ్చి డ్రైవర్‌లు డ్రైవింగ్ ఉద్యోగాలల్లోకి రాకుండా పొట్టే కొట్టే పద్ధతిని కేంద్ర బీజేపీ ప్రభుత్వం చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. శిక్షలతోనే ప్రమాదాలు తప్పుతాయనేది గుడ్డి ఆలోచన అన్నారు. మొదటగా కేంద్ర ప్రభుత్వం రోడ్డు గుంతలు లేకుండా చూడాలని అన్నారు. అంతే కాదు ప్రకృతి వైపరీత్యాల వల్ల పొగమంచు ద్వారాకూడా ప్రమాదాలు జరుగుతుంటా యని డ్రైవర్‌లను నష్టపరిచే భారత న్యాయ సంహిత చట్టంను రద్దు చేయాలని కేంద్ర బీజేపీ ప్రభుత్వంను హెచ్చరించారు. రద్దు చేయని పక్షంలో పోరాటాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ట్రాన్స్పోర్ట్ యూనియన్ రాష్ట్ర నాయకులు బసగాని ఉమేష్ రెడ్డి, డ్రైవర్స్‌ల నాయకులు విష్ణు, మోసిన్, శేఖర్, నరేష్, సత్యం ముదిరాజ్, భాస్కర్, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయలుకు వెళ్లిన ప్లంబర్ అదృశ్యం



నవతెలంగాణ-బాలానగర్

ఇంటి నుండి కూరగాయల కోసం వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ కె.భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం స్థానికంగా ఉంటున్న బాల్ రెడ్డి నగర్‌కు చెందిన రమణా రావు (46) గత కొంత కాలంగా ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. ఈమేరకు ఈనెల 8న ఇంటి నుంచి కూరగాయల కోసం బయటకు వెళ్ళాన అతను తిరిగి ఇంటికి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వారికి, తెలిసిన వారిని విచారించినా అతని ఆచూకీ లభించకపోవడంతో అతని భార్య అనసూయ ఫిర్యాదు మేరకు బాలానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నవతెలంగాణ-బాలానగర్

గుర్తుతెలియని వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందిన సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కె. భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం గుర్తుతెలియని వ్యక్తి (70) మూడు రోజుల క్రితం గౌతమ్ నగర్ రోడ్డు పరిధిలో రోడ్డు పక్కన పడి ఉండడం గమనించిన స్థాని కులు పోలీసులకు సమాచారం అందించారు. 108 అంబులెన్స్‌లో అతన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈమేరకు చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. స్థానికంగా బిక్షాటన చేస్తూ రోడ్డు పక్కనే పడుకునే వాడని స్థానికుల సమాచారం మేరకు బాలానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి మార్చురిలో భద్రపరిచారు.



తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా మాజీ కేంద్ర మంత్రివర్యులు దీపాదాస్ మున్షీ నియమితులైన సందర్భంగా బుధవారం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు కందాడి జ్యోత్స్న శివారెడ్డి ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నవతెలంగాణ-బాలానగర్

అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేస్తా



- శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరలోనే పూర్తి చేస్తామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. బుధవారం హైదర్ నగర్ డివిజన్ పరిధి రాం నరేష్ నగర్ కాలనీలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి, చేపట్టవల్సిన పలు అభివృద్ధి పనులపై స్థానిక కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి ఎమ్మెల్యే పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ సంతులిత, సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామన్నారు. దశల వారిగా అభివృద్ధి పనులు చేపడుతామని తెలిపారు. కాలనీ వాసులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ,సమస్యలను పరిగణలోకి తీసుకోని, వారి విజ్ఞప్తి మేరకు కాలనీలలో స్వయంగా ఇంటింటికి తిరుగుతూ ప్రజల నుంచి తెలుసుకొని సత్వర పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. రాం నరేష్ నగర్ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కాలనీని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని, డ్రయినేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని త్వరలోనే పనులు ప్రారంభించి కాలనీ వాసులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తానని తెలిపారు. త్వరలోనే డ్రయినేజీ నిర్మాణం మ్యాన్ హెూల్స్ మరమ్మత్తులు చేపట్టాలని, అవసరమున్న చోట కొత్త మ్యాన్ హెూల్స్ చేపట్టాలని, త్వరలోనే రోడ్డు నిర్మాణము పనులు చేపడుతామని ఎమ్మెల్యే గాంధీ తెలియచేసారు. రోడ్డును త్వరలోనే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగరావు, జీహెచ్ఎంసీ ఎఈ రాజీవ్, జలమండలి డీజీఎం వెంకటేశ్వర్లు, మేనేజర్ ప్రశాంతి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

విపత్కర పరిస్థితులపై విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

విపత్కర సమయంలో ప్రతి ఒక్కరూ పాటించాల్సిన జాగ్రత్తలపై కుత్బుల్లాపూర్ నియోజకవ ర్గం, రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్‌లో గల ఠాగూర్స్ హై స్కూల్లో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డిఆర్ఎఫ్) ఆధ్వర్యంలో విపత్కాలములో వారు చేపట్టే కార్యక్రమాలు దానికి వారు ఉపయోగించే పనిముట్లు గురించి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలపై పాఠశాల (గ్రౌండ్స్) లో డిఆర్ఎఫ్ సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుకోని పరిస్థితుల్లో జరిగే విపత్తులను ఎదుర్కోవాల్సిన బాధ్యతను సమయ స్ఫూర్తితో వ్యవహరించాలన్నారు. పలు దృశ్యాలతో విద్యార్థులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు అంశాలను వారు వివరించారు. అనంతరం పాఠశాల చైర్మెన్, కరస్పాండెంట్ బండారు సాయికుమార్ మాట్లా డుతూ తమ విద్యార్థులకు చదువుతోపాటు, క్రీడలు, సామాజిక అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా డిఆర్ఎఫ్ అధికారి ప్రభాకర్ రెడ్డి (ఐపీఎస్) జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ (ఐఏఎస్) లకు పాఠశాల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, డిఆర్ఎఫ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌కు శుభాకాంక్షలు'



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన అభిలాష అభినవ్‌ను బుధవారం కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఎ బ్లాక్ అధ్యక్షులు పట్లోళ్ల నాగిరెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ సమస్యలపై నియోజకవర్గం అభివృద్ధి కొరకు తమ వంతు సహకారంగా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మూసాపేట్ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాచమల్ల శేఖర్ గౌడ్, డీసీసీ కార్యదర్శి ఎ.వెంకటరెడ్డి, భరత్ నగర్ కాలనీ కాంగ్రెస్ అధ్యక్షులు అశోక్ ముదిరాజ్, నాయకులు సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళల స్వయం ఉపాధితోనే దేశ పురోగతి సాధ్యం



- ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

దేశ పురోగతి మహిళల స్వయం ఉపాధితోనే సాధ్యపడుతుందని కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. మంగళవారం జగద్గిరిగుట్ట డివిజన్ భూదేవి హిల్స్ ప్రాంతంలోని భూదేవి మహిళా పరపతి సంఘం, తెలంగాణ రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ, దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం సంయుక్త అధ్వర్యంలో నిర్వహించిన టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణా తరగతుల సర్టిఫికెట్స్ ప్రధానోత్సవ కార్యక్రమానికి ఆయనతోపాటు స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్‌లు ముఖ్య అతిథులుగా హాజరై శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా స్వయం ఉపాధి వైపు అడుగులు వేయడం చాలా సంతోషకరమన్నారు. మహిళలు తమ కాళ్ల మీద తాము నిలబడడంలో ఇలాంటి శిక్షణా తరగతులు ఎంతగానో దోహద పడతాయన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడంలో నా వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. ఇటువంటి శిక్షణా తరగతుల ద్వారా మహిళలు స్వయం ఉపాధి చెందుతూ పది మందికి మార్గం చూపేవారుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కృష్ణా గౌడ్, యువ నాయకులు కొలుకుల జైహింద్, భూదేవి మహిళా పరపతి సంఘం అధ్యక్షురాలు త్రివేణి దేశినేని, దుర్గాబాయి మహిళా శిశువికాస కేంద్రం స్కిల్ డెవలప్మెంట్ లక్ష్మి కుమారి, మోహో పాల్గొన్నారు.

జగద్గిరిగుట్ట: అసెంబ్లీ ఎన్నికల్లో నా హ్యాట్రిక్ విజయానికి తోడ్పాటునందించిన ప్రతి ఒక్కరికి జీవిత కాలం రుణపడి ఉంటానని స్థానిక ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. మంగళవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి షిరిడి హిల్స్, కూన మహాలక్ష్మి నగర్, రాజీవ్ గృహకల్ప, భూదేవి హిల్స్ ప్రాంతాలలో స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ స్థానిక ప్రజలతో కలిసి మూడవ రోజు కృతజ్ఞత యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో నియోజకవర్గ అభివృద్ధి కోసం కోట్లాది రూపాయల నిధులతో గత తొమ్మిదేండ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధిని, సంక్షేమాన్ని చూసి మీ ఇంటి బిడ్డగా నాకు ఇంతటి అఖండ విజయాన్ని అందించినందుకు మీ సేవకుడిగా పని చేస్తానన్నారు. ముందుగా షిరిడిహిల్స్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు ఓరుగంటి కృష్ణా గౌడ్, సయ్యద్ రషీద్, విఠల్ ముదిరాజ్, బీఆర్ఎస్ యువ నాయకులు జైహింద్ పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలు ప్రతీ పేదవాడికి అందాలి



- కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి అందే విధంగా చూడాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం ఇంద్రగాంధీపురం కాలనీ ఎన్నికల్లో విజయం సాధించిన నూతన అధ్యక్షులు సయ్యద్ యూసుఫ్ బుధవారం మియాపూర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బండి రమేష్‌ను కలిశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ కాలనీ అధ్యక్షుడిగా ఎన్నికైనా సయ్యద్ యూసుఫ్‌ను అభినందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయంలో మరింత అభివృద్ధి చెందే విధంగా చూడాలని కాలనీ సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. అనంతరం ఇందిరా గాంధీపురం చెందిన మహమ్మద్ గౌస్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ కండువాను కప్పి బండి రమేష్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నవాబు, వాసిముద్దీన్, పప్పు, ఎమ్ము ఇజాజ్, రవాజ్ పాల్గొన్నారు.

మొట్టమొదటి 100శాతం పేపర్ ఆధారిత ప్యాకేజింగ్ ఆవిష్కరణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఐటీసీ సన్‌ఫీస్ట్ ఫార్మ్‌లైట్ అనేది ఐటీసీ ఫుడ్స్ నుంచి ఆరోగ్యకరమైన బిస్కెట్‌ల శ్రేణి. 100శాతం వెలుపలి పేపర్ బ్యాగ్ ప్యాకేజింగ్‌లో, తను కొత్తగా అందిస్తున్న సన్‌ఫీస్ట్ ఫార్మ్‌లైట్ డైజెస్టివ్ బిస్కెట్ ఫ్యామిలీ ప్యాక్‌ను విడుదల చేసింది. ప్యాకేజింగ్ విధానంలో పరిశ్రమలోనే మొదటి ఆవిష్కరణగా, ఈ చర్య బిస్కెట్ విభాగంలో బ్రాండ్‌ను ట్రెండ్‌సెట్టర్‌గా నిలిచేలా చేసింది. ఈ కొత్త చొరవ గురించి ఐటీసీ ఫుడ్స్ డివిజన్ బిస్కెట్స్ అండ్ కేక్స్ క్లస్టర్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అలీ హారిస్ షేర్ మాట్లాడుతూ "మేం చురుకైన, వినియోగదారులను దష్టి ఉంచుకోవడం, వినూత్నంగా ఉండటం మాత్రమే కాకుండా, ఉద్దేశిత ప్రయోజనంతో కూడా ఉండాలని విశ్వసిస్తున్నాం. 100శాతం కాగితంతో తయారు చేసిన మొట్టమొదటి వెలుపలి బ్యాగ్‌ని ప్రారంభించడం సుస్థిరమైన ప్యాకేజింగ్‌ను ప్రోత్సహించడానికి బ్రాండ్ నిబద్ధతలో ఒక ముఖ్యమైన అడుగుగా చెప్పాలి. వినియోగదారులు కూడా బాధ్యతాయుత ఎంపికల పట్ల మరింత అవగాహన పెంచుకుంటున్నారు. వారికి సుస్థిరమైన ప్యాకేజింగ్‌లో ఉత్పత్తులను అందించడానికి మేం కట్టుబడి ఉన్నాం. ఇది పరిశ్రమలో తొలి తరహా చొరవ, ఇతర బిస్కెట్ ఉత్పత్తుల కోసం ఈ ప్యాకేజింగ్‌ను తగిన సమయంలో స్వీకరించడానికి ప్రణాళికలు జరుగుతున్నాయి' అని తెలిపారు.

పార్లమెంటు ఎన్నికల విజయానికి కృషి



- కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

రాబోయే పార్లమెంటు ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ విజయానికి కృషి చేయనున్నట్లు కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ తెలిపారు. మంగళవారం రాత్రి మేడ్చల్ జిల్లాకు చెందిన పలు నియోజకవర్గాల ఇన్‌చార్జిలతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిన నియోజకవర్గంలో 55 మందికి నియోజక వర్గ అభివృద్ధి ఇన్‌చార్జిగా పూర్తిస్థాయిలో బాధ్యతలను అప్పగించే విధంగా ప్రణాళికలు రూపొందించారు. పూర్తిస్థాయిలో బాధ్యతలను అప్పగిస్తు న్నట్లు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి వారికి సూచించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ నియోజక వర్గానికి రూ.10 కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నా మన్నారు. త్వరలోనే ఇందిరమ్మ కమిటీలుగా ఏర్పాటు కానున్నాయని ఈ కమిటీల్లో నియోజకవర్గ ఇన్‌చార్జి కోఆర్డినేటర్‌గా ఉంటూ ప్రభుత్వపరంగా అభివృద్ధి కార్యక్రమాలకు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిలు బాధ్యతలుగా వ్యవహరించడం జరుగు తుందని తెలిపారు. తమకు జిల్లా మంత్రులు సారథ్యంలో పనిచేయనున్నామని బండి వివరించారు.

కుత్బుల్లాపూర్: తెలంగాణ ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి అధ్యక్షతన మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా రివ్యూ మీటింగ్‌లో బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కోలన్ హన్మంత్ రెడ్డి పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని ఆవిష్కరించిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



నవతెలంగాణ-దుండిగల్

ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంభీపూర్ రాజు గండి మైసమ్మలోని జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మున్నూరు కాపు సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా హెచ్ఎంటీ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ డైరీ, బీఆర్ఎస్వీ మేడ్చల్ జిల్లా క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సంఘం సభ్యులు, బీఆర్ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

సీఐగా సీహెచ్ శంకరయ్య పదవీ బాధ్యతలు



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ పోలీస్ స్టేషన్ సీఐగా సీహెచ్ శంకరయ్య-నూతనంగా బుధవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. గతంలో దుండిగల్ సీఐ పనిచేసిన వై.రామకృష్ణ బదిలీ కావడంతో మేడ్చల్ సిసిఎస్‌లో పనిచేసిన శంకరయ్య ఇక్కడికి బదిలీపై వచ్చారు.

ఏటీఏఈఈ 2024 డైరీ ఆవిష్కరణ



నవతెలంగాన-సీటీబ్యూరో

అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అసిస్టెంట్ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్స్ డైరీని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బుధవారం సెక్రటేరియట్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ బండి శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీ నాగరాజు, కోశాధికారి సంతోష్ రెడ్డి, మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షులు అనిల్ సాగర్, వంశిదర్ గౌడ్, మనోహర్ బాబు, మొహమ్మద్ గౌస్, రాఘవేంద్ర, సిద్ధార్థ, ఎస్.ఎల్. శ్రీనివాస్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకాష్ నగర్ వాసులకు న్యాయం జరిగేలా కృషి


- కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ప్రకాష్ నగర్ వాసులకు న్యాయం జరిగే విధంగా శాయ శక్తుల తన వంతు కృషి చేస్తానని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. బుధవారం మియాపూర్‌లోని కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బండి రమేష్ ను బేగంపేట డివిజన్ ప్రకాష్ నగర్ వాసులు కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ 194/ 8/1 ఈ సర్వే నెంబర్‌కు ఆనుకొని 184,185, 186, ప్రయివేట్ భూమి ఉందని, ప్రయివేట్ భూమి పేరుతో తమ భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని వివరించారు. భూముల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో తమ ఇండ్లను ఖాళీ చేయాలని రౌడీలతో బెదిరింపులకు పాల్పడుతూ తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని కాలనీ వాసులు బండి రమేష్‌కు తెలిపారు. ఈ భూమి నవాబులకు చెందినదని, అక్కడనే కొన్ని ఏండ్లుగా ఇండ్లు కట్టుకొని నివాసం ఉంటున్నామని తెలిపారు. భూమికి సంబంధించిన పత్రాలను బండి రమేష్‌కి ఇచ్చారు. దీంతో బండి రమేష్ స్పందించి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు దృష్టికి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చిస్తానాని వారికి హామీ ఇచ్చారు. బండి రమేష్‌ను కలిసిన వారిలో బేగంపేట్ రమేష్, కొప్పి దినేష్ కుమార్ ,నారాయణ ఉపేందర్, నరసింహతో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనం నడిపిన ఇద్దరికి జైలు శిక్ష



నవతెలంగాణ-హాయత్ నగర్

మద్యం సేవించి వాహనాలు నడిపితే వారితో పాటుగా తోటి వారికి సైతం ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలనే ఉద్దేశ్యంతో ఎల్ బి నగర్ ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ లో భాగంగా బుధవారం ఉప్పల్ కు చెందిన సారంగం, వనస్థలిపురంకు చెందిన బాలాజీ కి మూడు రోజుల జైలు శిక్ష విధించిన ట్లు 6వ స్పెషల్ ఎంఎం కోర్ట్ జడ్జి మంజుల తెలిపారు. తదనంతరం వారికి రిమాండ్ కు తరలించి నట్లు ఎల్బినగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సింగ్ రావు వెల్లడించారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-హాయత్ నగర్

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ దయాకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కాకతీయ కాలనీ రోడ్ నెంబర్ 3లో నివాసం ఉంటున్న ఆకుల ప్రశాంత్(28) వ్యక్తి బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయం లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకు న్నాడు. గత కొంత కాలంగా అనారోగ్య సమస్య లతో బాధపడుతూ తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు నిర్ధారిం చారు. కేసు నమోదు చేసుకుని మృత దేహాన్ని



పోస్ట్ మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాల కార్మికులను బడిలో చేర్పించి

మంచి భవిష్యత్తు ఇవాల్సిన బాధ్యత మనదే

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- స్మైల్ విజయవంతం కోసం అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- ఆపరేషన్ స్మైల్-10పై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష



నవతెలంగాణ-సిటీబ్యూరో

బాల కార్మికులుగా పనిచేస్తున్న చిన్నారులను గుర్తించి వారిని తిరిగి బడిలో చేర్పించి మంచి భవిష్యత్తు ఇవ్వాల్సిన సామాజిక బాధ్యత మనందరిపై ఉందని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. బుధవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో ఆపరేషన్ స్మైల్-10పై సంబంధిత శాఖలతో సమీక్ష నిర్వహించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 18 ఏండ్ల లోపు పిల్లలు హోటల్, దుకాణాల్లో భిక్షాటన చేసేవారిని గుర్తించి వారి సమాచారం పిల్లల సంక్షేమ కమిటీకి తెలియజేయాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో పాల్గొనే చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, మహిళా శిశు సంక్షేమ శాఖ, పోలీసు, కార్మిక ,రెవిన్యూ ,వైద్య ఆరోగ్యశాఖ అధికారులందరూ సమన్వయంతో పనిచేసి నగరంలో ఎక్కడైనా చిన్నారులు పని చేస్తున్నట్టు తెలిస్తే దాడులు చేసి వారిని వెంటనే విడుదల చేయించాలని సూచించారు. రెస్క్యూ చేసి కాపాడిన పిల్లల వయసు నిర్ధారణ అవసరమైనట్టయితే గాంధీ, ఉస్మానియా ఆస్ప త్రులలో వయసు నిర్ధారణ పరీక్షలు నిర్వహించాల న్నారు. ఎక్కడైనా ఎఫ్ఐఆర్ బుక్ చేయాల్సి వస్తే వెంటనే సీడ బ్ల్యూసీకి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ స్మైల్ ఆపరేషన్ విజయవంతం కావాలంటే పిల్లలు ఎక్కడ కనిపించినా వెంటనే 1098 ఫోన్ నెంబర్ ద్వారా సీడబ్ల్యూసీకి సమాచారం ఇవ్వాలన్నారు. ప్రభుత్వం పిల్లలకు భోజనం, చదువు, వసతి కల్పిస్తూ ఎంతో ఖర్చు చేస్తుందన్నారు. ఈ ఆపరేషన్ లో ఎక్కువ మంది పిల్లలను విముక్తి చేసి రెస్క్యూ హోమ్‌కు తరలించాలని కలెక్టర్ అన్నారు. 18 ఏండ్ల పిల్లలను హానికరమైన వృత్తులలో పని చేయించ కూడదనే చట్టం ఉందని ఆయన గుర్తుచేశారు. అనాథ పిల్లలకి గురుకుల పాఠశాలలో 2 శాతం రిజర్వేషన్ ఉంద ని, దాని ప్రకారం చేర్పించాలన్నారు. హైదరాబాద్ జిల్లాకు వలసలు ఎక్కువగా ఉంటాయని, ఇక్కడకు బతుకుదెరువు కోసం పక్క రాష్ట్రాల నుంచి అధికంగా వస్తుంటారని.. మిస్సింగ్ కేసులు ఎక్కువగా ఉంటాయన్నారు. అనాథ పిల్లలకు జనన, కుల ధ్రువీకరణ పత్రాలు ఇస్తామన్నారు. ఆపరేషన్ స్మైల్ ఈ నెలాఖరు వరకు కొనసాగుతుందని, ఇది నిరంతర ప్రక్రియ అని అన్నారు. పిల్లలను రక్షించిన వెంటనే సీడబ్ల్యూసీకి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఆర్డీవో సూర్య ప్రకాష్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మెన్ శైలజ, కార్మిక శాఖ అధికారి శ్యాం సుందర్, జిల్లా అభివృద్ధి అధికారి అక్కేశ్వరరావు, డీఐవో శ్రీకల, డీఈవో ఆర్.రోహిణి, ఎన్జీవోలు, జువైనల్ హోమ్, ప్రభుత్వ చైల్డ్ హోం అధికారులు పాల్గొన్నారు.

ఆందోళన వద్దు..

ప్రతీ దరఖాస్తు ఆన్‌లైన్ చేస్తాం

- గ్రేటర్‌లో 24,74,325 దరఖాస్తులు
- 6.50 లక్షల అప్లికేషన్స్ డేటా ఎంట్రీ పూర్తి
- 635 డేటా సెంటర్లలో 5000 మందితో డేటా ఎంట్రీ
- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు కమిషనర్ రోనాల్డ్ రోస్



నవతెలంగాణ-సిటీబ్యూరో-ఓయూ

ప్రజాపాలన సందర్భంగా స్వీకరించిన ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్ ఎంట్రీ చేస్తున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ వెల్లడించారు. బుధవారం సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో బేగంపేట, సికింద్రాబాద్ సర్కిళ్లకు సంబంధించిన దరఖాస్తుల డేటా ఎంట్రీ సెంటర్‌లను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ డేటా ఎంట్రీ ఆపరేటర్‌లను ఒక్కొక్క దరఖాస్తు డేటా ఎంట్రీ చేయడానికి ఎంత సమయం పడుతుందని అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులు ఎక్కువగావున్న దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి 10 నుండి 15 నిమిషాల వరకు పడుతుందని కమిషనర్‌కు వివరించారు. 8 గంటల షిఫ్ట్ సమయం లో 70 నుండి 80 దరఖాస్తులను డేటా ఎంట్రీ చేయడం జరుగుతు న్నట్లు ఆపరేటర్‌లు కమిషనర్‌కు తెలిపారు. అక్షరం తప్పు పోకుండా డేటా ఎంట్రీ చేయాలని కమిషనర్ ఆదేశించారు. అనంతరం కమిషనర్ రోనాల్డ్ రోస్ మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమం లో గ్రేటర్‌లో మొత్తం 24 లక్షల 74 వేల 325 దరఖాస్తులు వచ్చాయని, అందులో 5 హామీలకు సంబంధించిన అభయహస్తం అప్లికేషన్ 19 లక్షలకుపైగా అప్లికేషన్ ఉండగా మిగతా 5.73 లక్షల అప్లికేషన్ రేషన్ కార్డు, ఇతర సమస్యలపై వచ్చినట్లు కమిష నర్ వివరించారు. ఇప్పటివరకు 6.50 లక్షల అప్లికేషన్స్ డేటా ఎంట్రీ పూర్తయ్యి నట్లు కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. డేటా ఎంట్రీ ప్రభుత్వం నిర్దేశించిన కాలవ్యవధిలో పూర్తి చేయడానికి సర్కిల్ వారీగా ఎక్కడివి అక్కడ డేటా ఎంట్రీ చేస్తున్నట్లు వివరించారు. మొత్తం 635 డేటా సెంటర్ లను ఏర్పాటు చేసి 5000 మందితో డేటా ఎంట్రీ చేయడం జరుగుతుందన్నారు. డేటా ఎంట్రీనీ ప్రైవేట్ ఏజెన్సీ చేస్తోందని, జీహెచ్ఎంసీ అధికారుల పర్యవేక్షణలోనే డేటా ఎంట్రీ జరుగుతుందన్నారు. ఒక్కొక్క డేటా సెంటర్‌కు ఒక టీమ్ లీడర్‌కు బాధ్యతలు అప్పజెప్పడం జరిగింద న్నారు. ఎస్.ఓ.సీ ప్రకారంగా అప్లికేషన్స్ తరలించాలని ఆదేశించిన ట్లు తెలిపారు. నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. హయత్ నగర్ సర్కిల్ కు సంబంధించిన ఏజెన్సీ వారు వేరే చోట ఉన్న సెంటర్‌కు తరలించే సందర్భంలో అవి రోడ్డుపై పడిపోయిన నేపథ్యంలో స్టాండర్డ్ ఆఫ్ ప్రొసీజర్ పాటించ కుండా నిర్లక్ష్యం వహించిన టీమ్ లీడర్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. అంతేకాకుండా కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం నుండి వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన డేటా సెంటర్‌కు తరలిస్తుండగా ఇంటికి తీసుకొని పోతున్నారని ఆరోపణలు రాగానే సంభదిత టీమ్ లీడర్‌కు షో కాజ్ నోటీసు ఇవ్వడం జరిగిందని వివరించారు. ఈ విషయంలో ఎవ్వరూ ఎలాంటి ఆందోళన చెందవద్దని దరఖాస్తులు అన్ని ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రవికిరణ్, సికింద్రాబాద్, బేగంపేట్ డిప్యూటీ కమిషనర్లు శంకర్, సుదాంష్ తదితరులు పాల్గొన్నారు.

'అందాల పోటీలలో సౌత్ జోన్ కిరీటం సాధించిన శ్రావ్య'



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఢిల్లీ నోయిడాలో జరిగిన అందాల పోటీలలో సౌత్ ఇండియా తరుపున హైదరాబాద్ కు చెందిన శ్రావ్య చిల్ల క్రౌన్ ను సాధించి అందాల రాణిగా నిలిచింది. మిస్ అండ్ మిసెస్ ఇండియా క్వీన్ ఆఫ్ హార్ట్స్ సంస్థ నిర్వహించిన అందాల పోటీలలో పాల్గొని తాను సౌత్ ఇండియా క్రౌన్ తో పాటు మిస్సెస్ ఫిట్, మిసెస్ పర్ఫెక్ట్ బాడీ-2024 వంటి రెండు సబ్ టైటిల్ లను సాధించడం జరిగిందని శ్రావ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫైనల్ కు మొత్తం 36 మంది ఎంపిక కావడం జరిగిందన్నారు. 5 రాష్ట్రాల సౌత్ జోన్ కిరీటం తనను వరించడం సంతోషం గా ఉందన్నారు. ఈ పోటీలలో పాల్గొనేందుకు గత ఆరు నెలల నుండి ఫిట్నెస్, క్యాట్ వాక్, మాట్లాడే విధానం, ప్రశ్నోత్తరాలపై శిక్షణ పొందడం జరిగిందన్నారు. తాను టైటిల్ పొందెందుకు విశేషంగా శ్రమించానన్నారు. అందరూ ఫిట్‌గా ఉండాలి పెళ్లికి ముందు కానీ పెళ్లి తర్వాత ఫిట్ నెస్ పై దృష్టి పెట్టాలని, ఎల్లప్పుడు ధృఢంగా ఉండాలని ఇచ్చిన సందేశం టైటిల్ పొందేందుకు దోహదపడిందన్నారు. తాను ఒక సాఫ్ట్ వేర్ ఇంజనీర్ అని, ఇద్దరు పిల్లల తల్లిని అయినప్పటికీ పట్టుదలతో విజయం సాధించానన్నారు. ఈ గెలుపులో తన కుటుంబ సహకారం మరువలేనిదని శ్రావ్య అన్నారు.

'ఆంధ్రాలో పని చేస్తున్న తెలంగాణ ఉద్యోగులను వెనక్కి తీసుకురావాలి'

బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మెన్ రాచాల యుగేందర్ గౌడ్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఆంధ్రలో పని చేస్తున్న తెలంగాణ ప్రాంత ప్రభుత్వ ఉద్యోగులను తిరిగి రాష్ట్రానికి తీసుకురావాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మెన్ రాచాల యుగేందర్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్కడి ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి వెళ్లేందుకు క్లియరెన్స్ ఇచ్చిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం 636 మంది ఉద్యోగులను స్వరాష్ట్రానికి తీసుకురాకుండా నిర్లక్ష్యం చేసిందని తెలిపారు. గత పదేళ్లుగా కుటుంబానికి దూరంగా ఆంధ్రలో పని చేస్తున్న ఉద్యోగుల విషయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చొరవ చూపాలని కోరారు. అదే విధంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎక్సైజ్ శాఖలో జరిగిన అక్రమ బదిలీలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎక్సైజ్ శాఖలో సాధారణ బదిలీలు, ప్రమోషన్లు గత ఐదేళ్లుగా జరగలేదని, పైరవీల ద్వారానే బదిలీలు, ప్రమోషన్లు జరిగాయని ఆరోపించారు. అప్పటి ఎక్సైజ్ శాఖ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ ఆయనకు అనుకూలంగా ఉన్న వారికే ప్రమోషన్లు, కోరిన చోట బదిలీలు చేశారని ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లోని ట్యానిక్ లిక్కర్ మార్ట్ కు గత ప్రభుత్వం స్పెషల్ జీవో ఇచ్చి, ఐదేళ్ల వరకు టెండర్ అనుమతి ఇచ్చారన్నారు. బిఆ షాపు రాజ్యసభ సభ్యుడు సంతోష్ రావు బినామీ అయిన అనిత్ రెడ్డి నడుపుతు న్నారని తెలిపారు. ఈ అంశాలపై ఎక్సైజ్ శాఖ కమిషనర్, ప్రిన్సిపాల్ సెక్రటరీ, మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినట్లు వివరించారు. వీటిపై వెంటనే రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో నరేష్, ప్రసాద్ నాయుడు, శివకుమార్, జాన్, కృష్ణ, వెంకట్ గౌడ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'పశు సంవర్ధక శాఖలో రీ-ఆర్గనైజేషన్ చేయాలి'



పశువైద్య, పశు సంవర్ధక శాఖ గెజిటెడ్ ఆఫీసర్స్ సర్వీస్ అసోసియేషన్

నవతెలంగాణ-హిమాయత్ నగర్

పశువైద్య, పశు సంవర్ధక శాఖ గెజిటెడ్ ఆఫీసర్స్ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ నాగయ్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ భాను నాయక్, సభ్యులు డా.కె.రామారావు ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యులు తెలంగాణ శాసన సభా పతి గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంద ర్భంగా పశువైద్య, పశు సంవర్ధక శాఖలో రీ-ఆర్గనైజేషన్ చేయాలని, జీవో ఎంఎస్ నెంబర్. 317లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారి సమస్యలను పరిష్కరించాలని వారు ఆయనను కోరారు. ఇందుకు తెలంగాణ శాసన సభాధిపతి సానుకూలంగా స్పందించి తమ సమస్యలను పరిష్కరిస్తామని హామీ వచ్చినట్లు తెలిపారు. ఈ శాఖకు సంబంధించిన అనేక విష యాలపై చర్చించడం జరిగిందని వారు పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో డా.సిహెచ్. నరసింహరావు, డా.డి.శాంతిబాబు, డా.బి. రమేష్, డా.ఎం.రఘు కిషోర్, డా.ఎన్.నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కమిషనర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీలోని భాగ్యనగర్ మున్సిపల్ జీహెచ్ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ (బీఎంజీ హెచ్ఎంసీఈయూ) రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ బుధవారం ఆయన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. కమిషనర్‌తో పాటు అదనపు కమిషనర్ (రెవెన్యూ) స్నేహ శబరిశ్, ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలను తన దష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తా మని హామీ ఇచ్చారు. ఈ క్యాలెండర్ ఆవిష్కరణలో యూనియన్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు జి. రాజేశ్వం రావు, జనరల్ సెక్రటరీ టి. కష్ణ, అడిషనల్ జనరల్ సెక్రటరీ రాధాకష్ణ, ఉపాధ్య క్షుడు కే. కష్ణ, సెక్రటరీలు ఆయూబ్ ఖాన్, రూపేశ్, సికిం ద్రాబాద్ అధ్యక్షుడు కడారి రాజు, ఖైరతాబాద్ జోన్ జనరల్ సెక్రటరీ ఆర్. వెంకటే శ్, మహిళా సెక్రటరీ మనోరమా, ఉపాధ్యక్షుడు భిక్షపతి, హెడ్ ఆఫీసు ఇన్‌ఛార్జి పవన్, రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు మందు రవి తదితరు లు పాల్గొన్న ఈ కార్యక్రమంలో రాజేశ్వరరావు, టి. కష్ణ మాట్లాడుతూ జీహెచ్ఎంసీలోని వివిధ విభాగాల్లో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై కమిషనర్ సానుకూలంగా స్పందిం చి, పరిష్కరిస్తున్నందుకు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

ఎలాంటి టెన్షన్ వద్దు: సస్పెన్షన్లపై కమిషనర్ హామీ

ప్రజాపాలన దరఖాస్తులను తరలిం చటంలో విధి నిర్వహణలో విఫలమయ్యారన్న ఆరోపణతో మంగళవారం హయత్ నగర్ సర్కిల్-3కు చెందిన సూపరింటెండెంట్ మహిం దర్ సస్పెన్షన్ వ్యవహారాన్ని ఈ సందర్భంగా బీఎంజీహెచ్ఎంసీఈయూ అధ్యక్ష, కార్యదర్శులు రాజేశ్వరరావు, టి. కష్ణ కమిషనర్ దష్టికి తీసుకెళ్లగా, సస్పెన్షన్ పై ఎలాంటి టెన్షన్ వద్దని, అన్ని విషయాలను పరిశీలించినానంతరం తాను సస్పెన్షన్‌ను రీవోక్ చేస్తామని హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగించుకోవాలి



నవతెలంగాణ-అంబర్ పేట

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగించుకోవాలని కేంద్రం మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. బుధవారం అంబర్ పేట డివిజన్ పరిధిలోని పటేల్ నగర్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వాలకు సంబంధించిన ముద్ర లోన్స్, ఉజ్వల భవిష్యత్ గ్యాస్, హెల్త్ క్యాంపు బీజేపీ డివిజన్ అధ్యక్షులు నాగభూషణం చారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, మాజీ మంత్రి సి.కృష్ణ యాదవ్, హాజరై ప్రారంభి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు ఉజ్వల గ్యాస్ కింద కలెక్షన్లు ఇచ్చిన ఏకైక ప్రభుత్వం నరేంద్ర మోడీ ప్రభుత్వామని గత ప్రభుత్వాలు కేవలం సంక్షేమ పథకాలు కేవలం ఓటు బ్యాంకు కోసమే వినియోగించే వారని నేడు సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ ఆధార ంగా అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయ కులు గంధమాల ఆనందు గౌడ్ , అచ్చిని రమేశ్, రామచందర్ గుప్తా, పేంటం రాజు, కృష్ణ ముది రాజ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఉప్పల్ స్టేడియంలో భారత్ ఇంగ్లాండ్ మధ్య టెస్ట్

- పోలీస్ అధికారులతో సీపీ సమీక్షా సమావేశం
- క్రికెట్ మ్యాచ్‌లకు భద్రతను కట్టుదిట్టం చేయాలని ఆదేశం
- రాచకొండ సీపీ సుధీర్ బాబు






నవతెలంగాణ-సిటీబ్యూరో

ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఐదు రోజుల పాటు జరగ నున్న టెస్ట్ క్రికెట్ మ్యాచ్‌కు భద్రత కట్టుదిట్టం చేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటన లు చోటుచేసుకోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అధికారులను ఆదేశించారు. ఈ నెల 25 నుంచి 29 వరకు భారత్, ఇంగ్లాండ్ మధ్య జరగనున్న క్రికెట్ టెస్టు మ్యాచ్‌ల నేపథ్యంలో నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై బుధవారం నేరేడ్‌మెంట్ సీపీ కార్యాలయంలో డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీలతో సీపీ సమీక్షా సమావేశాన్ని నిర్వహిం చారు. టెస్ట్ క్రికెట్ మ్యాచ్ నిర్వహణకు అవసం మైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారుల ను ఆదేశించారు. రాచకొండ కమిషనరేట్ పరిధి లో క్రికెట్ పోటీలు నిర్వహించడం గొప్ప అవ కాశం అని, ఎన్ని సవాళ్ళు ఎదురైనా తగిన విధం గా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, ప్రేక్షకులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను సూచించారు. టికెట్ల విక్రయంలో ఎటువంటి గందరగోళం లేకుండా చూడాలని, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలన్నారు. అవసరమైన పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని, స్టేడియం పరిస రాల్లో సీసీటీవీలను ఏర్పాటు చేయాలని సూచిం చారు. టికెట్ల పంపిణీ పూర్తి పారదర్శకంగా జరుగుతుం దన్నారు. ఈ సమావేశంలో డీసీపీలు గిరి పద్మజ ఐపీఎస్, కరుణాకర్, మనోహర్, అడ్మిన్ డీసీపీ ఇందిర, అదనపు డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా లాక్కున్న ఇండ్ల స్థలాలను తిరిగివ్వాలి



ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ డిమాండ్

నవతెలంగాణ-ముషీరాబాద్

రాష్ట్రంలో గత పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం అక్రమంగా లాక్కున్న మా ఇండ్ల స్థలాల కోసం కేటాయించిన భూమిని తిరిగి మాకే అప్పగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ డిమాండ్ చేసింది. ప్రభుత్వ ఉద్యోగులుగా 1985 నుంచి అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న మా భూమిని బీఆర్ఎస్ ప్రభుత్వం కుంటి సాకులతో వెనక్కు తీసుకోవడాన్ని తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షులు కనకం కొమరెల్లి తీవ్రంగా ధ్వజమెత్తారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పెన్షనర్ల అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ భాగ్యనగర్ టీఎన్జీఓస్ గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ సభ్యులుగా కొనసాగుతున్న ప్రభుత్వ ఉద్యోగులు 1985 నుంచి అనేక పోరాటాల ఫలితంగా రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి గోపన్నపల్లిలో ప్రభుత్వం ద్వారా 36,37 సర్వే నంబరులో సుమారు 427 ఎకరాలు మంజూరైనట్టు తెలిపారు. ఈ మొత్తం నాలుగు సొసైటీలకు చెందినది కాగా, భాగ్యనగర్ టీఎన్జీఓస్ గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ సభ్యులకు 189 ఎకరాలు ఉన్నట్టు తెలిపారు. ఈ స్థలంలో ఇళ్ల నిర్మాణం జరగ లేదనే విషయాన్ని సాకుగా చూపి తెలంగాణ వచ్చిన నెల రోజులకే 189 ఎకరాలను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుందన్నారు. ఈ క్రమంలో న్యాయస్థానం ఆశ్రయించగా, అనేక మలుపులు అనంతరం ప్రస్తుతం నిబంధనలకు అనుగుణంగా సర్వీసు సీనియారిటీ ప్రకారం లబ్దిదారుల జాబితాను ప్రకటించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అయితే సొసైటీలో అర్హులైన సభ్యులందరికీ నిబంధనలకు ప్రకారం జాబితాను ప్రకటించాలన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి సొసైటీ సభ్యులందరికీ న్యాయం చేయాలని కోరతామన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తూము అశోక్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.సూర్యకళ, ట్రెజర ర్ వి.దివాకర్, నాయకులు కె. లక్ష్మణ్ రావు, ఝాన్సీరాణి, పవన్ కుమార్, రామనాథ చెట్టి తదితరులు పాల్గొన్నారు.

బిల్కిస్ బానో కేసులో సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం

భారత లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పుల్లూరి వెంకట రాజేశ్వరరావు

నవతెలంగాణ-హిమాయత్ నగర్

బిల్కిస్ బానో కేసులో గుజరాత్ ప్రభుత్వం, సుప్రీం కోర్టు తీసుకున్న నిర్ణయం పట్ల భారత లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పుల్లూరి వెంకట రాజేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా సంచనం సృష్టించి న బిల్కిస్ బానో సామూహిక అత్యాచారం, ఆమె కుటుంబంలో 7 గురు దారుణ హత్య కేసులో 11 మంది దోషులకు విధించిన శిక్షను తగ్గిస్తూ గుజ రాత్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సుప్రీం కోర్టు తీవ్రంగా తప్పు పట్టడం చారిత్రాత్మకమైన నిర్ణయమన్నారు. గుజరాత్ ప్రభుత్వానికి చెంప పెట్టు వంటిదని ఆయన హెచ్చరించారు. భవి ష్యత్తులో ఇలాంటి సంఘటనలు తిరిగి పునరా వృత్తం కాకుండా చూడాల్సిన అవసరం ఉందని, సుప్రీం కోర్టు నిర్ణయం అందరికి సమా న న్యా యం లభిస్తుందన్న భరోసాను ఇచ్చిందన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
HMDA
గురువారం | జనవరి 11, 2024 | www.navatelangana.com

జేసీ బోస్ ఫెలోషిప్ అందుకున్న ఎల్వీపీఈఐ శాస్త్రవేత్త



నవతెలంగాణ - బంజారాహిల్స్

నగరానికి చెందిన ఎల్వీప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ (ఎల్వీపీఈఐ)శాస్త్రవేత్త ప్రొఫెసర్ డాక్టర్ జావేద్ అలీకి జేసీ బోస్ ఫెలోషిప్ దక్కింది. ఈ మేరకు ఆయన ఫెలోషిప్ అందుకున్నారు. నేత్ర వైద్యంలోని డాక్రియాలజీలో తాను చేసిన సేవలను గుర్తిస్తూ సైన్స్, ఇంజినీరింగ్ రీసెర్చ్ బోర్డ్ (ఎస్ఈఆర్బీ), డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఈ ఫెలోషిప్ అందజేసినట్టు డాక్టర్ జావేద్ తెలిపారు. ప్రముఖ శాస్త్రవేత్త సర్ జగదీష్ చంద్ర బోస్ పేరిట ఇచ్చే ఈ ఫెలోషిప్ కింద నెలకు రూ.25 వేల చొప్పున ఐదేండ్ల పాటు గ్రాంట్ వస్తుందని, ఆయన ఇప్పటికే అలెగ్జాండర్ వాన్ హంబోల్ట్ ఫెలోషిప్,శాంతి స్వరూప్ భట్నాగర్ పురస్కారం అందుకోవడంతో పాటు లాక్రిమల్ సర్జరీపై సమగ్ర పాఠ్య పుస్తకం, 605 ప్రచురణలు వెలువరించినట్లు ఎల్వీపీఈఐ ఎగ్జిక్యూటివ్ చైర్ డా.ప్రశాంత్ గార్గ్ తెలిపారు. డాక్రియాలజీ విభాగంలో ప్రొ. జావేద్ విశేష కృషి చేశారన్నారు.

ఘనంగా మైనంపల్లి హన్మంతరావు పుట్టిన రోజు వేడుక



నవ తెలంగాణ -నేరేడ్ మెట్

మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతు పుట్టిన రోజు వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. బుధవారం ఆశా ఆఫీసర్స్ కాలనీలో ఒక అనాథ ఆశ్రమంలో స్కూల్ పిల్లలకు టిఫిన్స్, పండ్లు, 25 కేజీల బియ్యం, ఆహార పదార్థాలు పంపిణీ చేశారు. స్కూల్ పిల్లలతో కేక్ కటింగ్ చేసి పిల్లలకి పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పిట్ట నాగరాజ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, పీఎస్ ఆర్ గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

కోదండరాంను కలిసిన భీంరావ్ బాడా బాధితులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

భీంరావ్ బాడా బాధితులు బుధవారం తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం ను కలిశారు. ఈ మేరకు ఆయనకు వినతి పత్రాన్ని సమర్పించారు. తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఈ సందర్భంగా భీంరావ్ బాడా బాధితుల లీడర్ కొమరయ్య మాట్లాడుతూ 15 ఏండ్ల క్రితం తమ ఇండ్లను కూల్చేసిన పాలకులు ప్రత్యామ్నాయంగా సీతారాంబాగ్ లో జేఎన్ఎన్ యుఆర్ఎం ఇండ్లను కేటాయించారని తెలిపారు. అయితే అక్కడ మౌలిక వసతుల్లేక తాము ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. తమకు భీంరావ్ బాడా స్థలంలోనే సొంత ఇండ్లను నిర్మించి ఇవ్వాలని కోరారు. ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన తర్వాత సమస్య పరిష్కారవుతుందన్న ఆశతో అప్పటి మాజీ మంత్రులు నాయిని నర్సింహారెడ్డితో పాటు హరీశ్ రావును కలిసి వినతి పత్రాలు సమర్పించామని తెలిపారు. అయినప్పటికీ తమకు అన్యాయమే జరిగిందన్నారు. ప్రస్తుతం భీంరావ్ బాడా స్థల వివాదం కోర్టు పరిధిలో ఉందని, న్యాయస్థానాలపై తమకు నమ్మకం ఉందని, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కొలువుదీరిన ప్రభుత్వం తమకు న్యాయం చేస్తుందన్న ఆశతో ఉన్నామని తెలిపారు. కోదండరాం మాట్లాడుతూ భీంరావ్ బాడా విషయం తనకు తెలుసని, వీలైనంత త్వరగా బాధితులను సీఎం రేవంత్ రెడ్డి దగ్గరకు తీసుకెళ్లి, సమస్యకు పరిష్కారాన్ని చేకూరుస్తానని హామీ ఇచ్చినట్టు బాధితులు తెలిపారు.



ముగ్గుల పోటీలకు ఆహ్వానం

నవతెలంగాణ-నేరేడ్ మెట్

మచ్చ బొల్లారం డివిజన్ పరిధిలోని పంచశీల కాలనీలో నిర్వహించనున్న ముగ్గుల పోటీలకు ముఖ్య అతిథులుగా హజరు కావాలని కోరుతూ బుధవారం ఆ కాలనీ కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమానికి అల్వాల్ సిఐ రాహుల్ దేవ్ ,అల్వాల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డిని కాలనీ కమిటీ సభ్యులు ఆహ్వానించారు.ఈ కార్య క్రమంలో కాలనీ కమిటీ సభ్యులు వైస్ ప్రెసిడెంట్ భరత్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ రవి, విజయ్ వర్ధన్ రెడ్డి, శ్రీకాంత్ రాజు, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.



వాస్తవాలను వెలికితీయడంలో

నవతెలంగాణ పాత్ర కీలకం



- **ఎస్వీఎస్ ఇన్ఫ్రా డెవలపర్స్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లెంపాటి వెంకటేశ్వర్లు**

నవతెలంగాణ-హైదరాబాద్

వాస్తవాలను వెలికి తీయడంలో నవ తెలంగాణ పత్రిక కీలక పాత్ర పోషిస్తున్నదని ఎస్వీఎస్ ఇన్ఫ్రా డెవలపర్స్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లెం పాటి వెంకటేశ్వర్ల అన్నారు. బుధవారం బోడుప్పల్‌లోని నవ తెలంగాణ 2024 నూతన క్యాలెండర్‌ను ఉప్పల్ డివిజన్ ఇన్‌చార్జి చినపంగి గోపితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎండీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. నవ శకానికి అనుదినం జనస్వరంగా వాస్తవాలను నిర్భయంగా రాస్తూ ప్రజలను చైతన్య పరుస్తూ నవతెలంగాణ పత్రిక ముందు కొనసాగుతుందన్నారు. నవ తెలంగాణ పత్రిక అభ్యున్నతి కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని స్పష్టం చేశారు.

ప్రజల మనసులను చురగొన్న ఎస్వీఎస్ డెవలపర్స్

ప్రజలకు నాణ్యమైన ధరలకే ప్లాట్లు విక్రయిస్తూ, పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల మనుసులను చురగొంటు ముందుకు వెళున్నామని వెంకటేశ్వర్లు అన్నారు. హైదరాబాద్ సిటీకి దగ్గరలోని భువనగిరి, రాయగిరి, యాదగిరి గుట్ట సమీపంలో నూతన వెంచర్లతో ప్రజలకు తక్కువ ధరలకే ప్లాట్లు విక్రయిస్తు ముందుకెళుతున్నారు. ఈ కార్యక్రమంలో మల్లెంపాటి వెంకటేశ్వర్లు ఎండీ, మల్లెంపాటి యశ్వంత్ ఈడీ, పెద్ది కుమార్ గౌడ్, సెల్స్ డైరెక్టర్, జిల్ల వేణు , ఎస్ ఎం.ఎం. కృష్ణ గౌడ్, రావాల పరమేష్, బొంగ రేణేష్, తౌర్రీ నరేష్, భాగస్ భాస్కర్, రావుపల్లి నగరాజుగౌడ్, పెద్ది హరీష్ కుమార్ గౌడ్, కల్లె రామ్ రవిగౌడ్, బొంగ సతీష్, రేవు కృష్ణ తదితరులున్నారు.

సంక్రాంతి పండుగకు ఊరెళ్తున్నారా.. జర జాగ్రత్త

- **ఇన్‌స్పెక్టర్ వెంకట్ రెడ్డి**

నవతెలంగాణ-సిటీబ్యూరో



పహడి షరీఫ్, బాలాపూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న ప్రజలు సంక్రాంతి పండుగకు ఊర్లకు వెళ్ళే సమయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకట్ రెడ్డి తెలిపారు. పండుగ కోసం ఊరు వెళ్లాల్సి వస్తే మీ విలువైన బంగారు, వెండి, ఆభర ణాలు, డబ్బులు, బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవాలని లేనిచో మీ ఇంట్లోనే రహస్య ప్రదేశంలో దాచుకోవాలని ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెలవులలో బయటకు వెలుతున్నప్పుడు సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సర్ ను ఏర్పాటుచేసుకోవడం మంచిందన్నారు. మీ ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్ గల తాళము అమర్చుకునడం మంచిదన్నారు. తాళము వేసి ఊరికి వెళ్లవల్సి వస్తే స్థానిక పోలీసు స్టేషన్ లో సమాచారం ఇవ్వలన్నారు.మీ కాలనీలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని, లేదా 100 నెంబర్ కు తప్పనిసరిగ ఫోన్ చేయాలన్నారు.

వాహనాలను మీ ఇంటి ఆవరణలోనే పార్కు చేసుకొవాలని, ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా తాళాలు వేయాలని మీకు వీలైతే చక్రాలకు చైన్స్ తో కూడా లాక్ వెయ్యడం మంచిదన్నారు.నమ్మకమైన వ్యక్తులను మాత్రమే వాచ్మెన్, సెక్యూరిటీ గార్డ్ సర్వెంట్ లను నియమించుకొవాలన్నారు.మీ ఇంట్లో అమర్చిన సీసీ కెమెరాలకు అన్ లైన్ లో ఎప్పటికప్పుడు చూసుకొంటూ ఉండాలన్నారు. ఇంట్లో లేనప్పుడు ఇంటి ముందు చెత్త చెదారం, పాలప్యాకెట్లు జమ కానివ్వకుండా చూసుకోవాలని, వాటిని కూడా గమనించి నేరస్తులు దొంగతనాలకు పాల్పడుతారన్న విషయాన్ని గమనించాలన్నారు. ఇంటికి ప్రధాన ద్వారంనకు తాళం కప్ప వేసినప్పటికి అవి కనిపించకుండా కర్టెన్స్ తో కవర్ చేయడం మంచిదన్నారు. బయటకు వెళ్ళేటప్పుడు ఇంటి లోపల, బయట కూడా కనీసం కొన్ని లైట్లు వేసివుంటే మంచిదని తెలిపారు. ఇంటి దగ్గర గల మీకు నమ్మకమైన ఇరుగు పొరుగు వాళ్ళకు మీరు ఇంట్లో లేని సమయంలో మీ ఇంటిని గమనిస్తు ఉండమని చెప్పడం మంచిదన్నారు. అల్మరా కప్ బోర్డ్ కు సంభందించిన తాళాలు ఇంట్లోనే రహస్య ప్రదేశంలో పెట్టుకోవడం మంచిదన్నారు. బంగారు ఆభరణాలు వేసుకొని ఫంక్షన్ లకు గుడికి వెళ్ళే టప్పుడు తగు జాగ్రతలు తీసుకోవడం మంచిద న్నారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది,పలు కాలనీల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

శబరిమలై బస్సు యాత్రను ప్రారంభించిన తోటకూర వజ్రేష్ యాదవ్



నవతెలంగాణ-ఘట్కేసర్

41 రోజులపాటు అత్యంత నియమ నిష్ఠలతో అయ్యప్పను పూజించి ఇరుముడి రూపంలో స్వామివారికి తమ మొక్కలను చెల్లించడానికి శబరిమలై వెళ్లే అయ్యప్ప స్వాముల యాత్ర సుఖశాంతులతో పూర్తికావాలని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు.

ఘట్కేసర్ చౌదరి గుడాకు చెందిన అయ్యప్ప గురు స్వామి కట్ట ఆంజనేయులు ఆధ్వర్యంలో శబరిమలై వెళ్తున్న అయ్యప్ప స్వాముల బస్సు యాత్రను బుధవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు.

ఎల్‌ఐసీ ఉద్యోగుల వాకౌట్ స్ట్రైక్

నవతెలంగాణ-ఓయూ



ఎల్‌ఐసీ ఉద్యోగుల వేతన సవరణ చేయలని బుధవారం హబ్సిగూడ ఎల్‌ఐసీ కార్యాలయం ఎదుట ఉద్యోగులు జేఏసీ ఆధ్వర్యంలో వన్ అవర్ వాకౌట్ స్ట్రైక్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు ఈ కార్యక్రమన్ని నిర్వహించామని ఉద్యోగులు తెలిపారు.

ఆధారాలను కమిటీకి అందజేసిన ఔట

నవతెలంగాణ-ఓయూ

ఓయూలో అర్హతలు లేకున్నా సీనియర్ ప్రొఫెసర్స్ పదోన్నతులు అక్రమంగా పొందారని ఆరోపణలు రాగా ఔట విన్నపం మేరకు విచారణకు గత ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. దాంతో కమిటీ పిలుపు మేరకు బుధవారం ఓయూ ఔట అధ్యక్షుడు ప్రొ.మనోహర్, ప్రధాన కార్యదర్శి ప్రొ.సురేందర్ రెడ్డి, డా.తలారి. గంగాధర్‌లు కమిటీ చైర్మెన్, మాజీ వీసీ ప్రొ.తిరుపతి రావును కలిశారు. అర్హతలు లేకుండా పదోన్నతి పొందిన 10 మంది సీనియర్ ప్రొపెసర్స్ పదోన్నతులు రద్దు చేయాలని, వారిపై, సంబంధించిన ఓయూ అధికారులపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ మేరకు ఆధారాలు ప్రొ.తిరుపతి రావుకు అందజేశారు. మరొక వైపు ఓయూ రిజిస్ట్రార్ కూడా కమిటీ ముందు బుధవారం హాజరయ్యారని సమాచారం. అక్రమ మార్గంలో ఉన్నత స్థాయిలో ఉండి సీనియర్ ప్రొఫెసర్స్‌గా పదోన్నతులు పొందిన వారు ఎవరు అన్న అంశంపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో ఏం చేస్తుందో వేచి చూడాల్సిందే.



12 నుంచి14 వరకు ప్రపంచ తైక్వాండో చాంపియన్ షిప్ లీగ్ పోటీలు

నవతెలంగాణ-బంజారాహిల్స్

ప్రపంచ దేశాల్లో ఎంతో గుర్తింపు పొందిన అంతర్జాతీయ తైక్వాండో ఛాంపియన్ షిప్ లీగ్ (ఐటీసీఎల్) పోటీలను హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్టు ప్రముఖ మెజిషియన్ సామల వేణు తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఐటీసీఎల్ డైరెక్టర్స్ గిరిబాబుతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రపంచంలోని 206 దేశాల్లో ఈ మార్షల్ ఆర్ట్స్ క్రీడకు ఎంతో ఆదరణ ఉందని.. ఆ క్రీడను హైదరాబాద్ నగరంలో తొలిసారిగా పరిచయం చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ నెల 12,13,14 తేదీల్లో మూడురోజులపాటు ఈ పోటీలు జరగనున్నాయని, మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7 వరకు జరుగుతా యన్నారు. క్రీడలపై మక్కువ ఉన్నవారు ఎవరైనా ఈ పోటీలను వీక్షించడానికి రావచ్చని, దీనికి ఎటువంటి ఎంట్రీ ఫీజు లేదన్నారు.క్రీడల ప్రారంభం రోజున యూఏఈ ప్రముఖ గాయకుడు అహ్మద్ అల్ హెూసానితో భారత జాతీయ గీతాలాపన ఉంటుందని, ముగింపు రోజు 14వ తేదీన అబ్దుల్లా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మెన్ డాక్టర్ బు.అబ్దుల్లా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేస్తారని చెప్పారు. సమావేశంలో ఐటి హెడ్ మక్రంద్, సీహెచ్ సుప్రియ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను కలిసిన ఎర్రగడ్డ నాయకులు

నవతెలంగాణ - జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ నియోజకవర్గ శాసనసభ్యులు, బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపీనాథ్‌ను బుధవారం ఆయన ఆఫీసులో ఎర్రగడ్డ డివిజన్ నాయకులు జావీద్ తండ్రి ఉమ్ర వెళ్లి వచ్చిన సందర్భంగా మర్యాద పూర్వకంగ కలిసి స్వీట్స్ ను పంచారు. అలాగే సుల్తాన్‌నగర్ బస్తీలో నీటి పైపులైన్ వేయించినందుకు బస్తీ వాసులు ఎమ్మెల్యేను కలిసి పుష్ప గుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యాక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు సంజీవ్, నాయకులు జావీద్, అజీమ్,సర్దార్ భాయ్ సయ్యద్ రసూల్ ,బాబ్ జానీ తదితరులు పాల్గొన్నారు.



ఓయూ కామర్స్ ఫ్యాకల్టీ, పీహెచ్డీ విద్యార్థులకు ప్రోగ్రెస్ రివ్యూ మీటింగ్

నవతెలంగాణ-ఓయూ

ఓయూ కామర్స్ ఫ్యాకల్టీ, పీహెచ్డీ విద్యార్థులకు బుధవారం 2024 ప్రోగ్రెస్ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. 2023లో జరిగిన మునుపటి సెషన్ సమీక్షతో సమావేశం ప్రారంభమై, 58 మంది విద్వాంసులు హాజరయ్యారు. హాజరైన వారిలో కామర్స్ హెడ్ సీనియర్ ప్రొఫెసర్ డి. చెన్నప్ప, కామర్స్ ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ ఎం. గంగాధర్, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మెన్ ప్రొ. కె. కృష్ణ చైతన్య ప్రొ. జి. నరేష్ రెడ్డి, ప్రొ. ఐ. శేఖర్, ప్రొ. ఎ. ప్యాట్రిక్,డాక్టర్ కె. శ్రీనివాస్, డా. నాజియా సుల్తానా లు పాల్గొన్నారు. ముఖాముఖి వారి పరిశోధనా ప్రయాణంలో విద్యార్థుల పురోగతిపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. థీసిస్ రైటింగ్‌లో నైతిక ప్రమాణాలు, ఉత్తమ అభ్యాసాలకు కట్టుబడి ఉండటంపై పండితులకు మార్గదర్శకత్వం చర్చించారు. అనవసరమైన ఆలస్యం లేదా పొడిగింపులు లేకుండా పరిశోధనను సకాలంలో పూర్తి చేయడం ప్రాముఖ్యతను వివరించారు. డిపార్ట్మెంట్ నిర్దేశించిన బెంచ్ మార్క్‌ను నిర్వహించడంపై కౌన్సెలింగ్ ఇచ్చారు. అధిక-నాణ్యత పరిశోధనను విజయవంతంగా పూర్తి చేయడం ద్వారా పొందే ప్రయోజనాల గురించి వివరించారు. పలువురు పీహెచ్డీ విద్యార్థులు సందేహాలు నివత్తి చేసుకున్నారు.



విద్యా వ్యతిరక పాలనకు నాంది పలికిన సీఎం

- ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ

నవతెలంగాణ-బంజారా హిల్స్

జీవో 55 ద్వారా రాజేంద్రనగర్ వ్యవసాయ యూనివర్సిటీలోని 100 ఎకరాల భూమిని హైకోర్టు నిర్మాణానికి ఎలా కేటాయిస్తారనీ ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ ప్రశ్నించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కన్వీనర్ జీవన్,జాయింట్ సెక్రటరీ కళ్యాణి,పృథ్వి తేజలు పాల్గొని ప్రసంగించారు. అధికారంలోకి వచ్చి మాసం రోజులు గడపగానే విద్యా వ్యతిరేక పాలనకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాంది పలికారని విమర్శించారు.

ఇన్‌చార్జిగా ఉద్యమ నేత రాజునేత

నవతెలంగాణ-ఓయూ



జనవరి 24 నిర్వహించే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ముఖాముఖి కార్యక్రమానికి బీజేపీ ఉమ్మడి హైదరాబాద్ జిల్లా (బీజేపీ భాగ్యనగర్ జిల్లా, హైదరాబాద్ సెంట్రల్, సికింద్రాబాద్ మహంకాళి, గోల్కొండ జిల్లా) పరిధిలోని 15 నియోజకవర్గాలకు ఇన్‌చార్జిగా ఎనుగంటి.రాజునేత నియమితులయ్యారు. ఉద్యమకారుడు, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకుడిగా ఎన్నో సంవత్సరాల పాటు పనిచేసిన యువ నాయకుడు, ప్రస్తుతం బీజేపీ యూత్ విభాగం రాష్ట్ర మీడియా కన్వీనర్‌గా ఎనుగంటి రాజు నేత పని చేస్తున్నారు. పలువురు రాజుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

సమస్యలకు నిలయాలుగా లేడీస్ హాస్టళ్లు

- ఓయూ హాస్టళ్లలో విద్యార్థినీల ఇబ్బందులు
- లిమిటెడ్ ఫుడ్ కాదు.. అన్ లిమిటెడ్ ఫుడ్ కోసం విద్యార్థినీల ఆందోళన
- రెండో సారి అన్నం,కూర అంటే డబుల్ బిల్.. అమలు కాని మెనూ
- ప్రశ్నిస్తే టార్గెట్.. గత్యంతరం లేక రోడ్డెక్కితే రాద్ధాంతం చేస్తారా ? అంటూ అవహేళనలు


నాణ్యమైన ఫుడ్, రక్షణ కల్పించాలని రాస్తారోకో చేస్తున్న పీహెచ్‌డీ విద్యార్థినీలు (ఫైల్ ఫోటో)


రాస్తారోకో చేస్తున్న పీజీ అమ్మాయిలు (ఫైల్ ఫోటో)

నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో లేడీస్ హాస్టల్స్ సమస్యలకు నిలయంగా మారాయి. దానికి ఉదాహరణ మొన్నటి పీహెచ్డీ , నిన్నటి పీజీ విద్యార్థినిల ఆందోళనలే. గత్యంతరం లేక విద్యార్థులు రోడ్డెక్కి ధర్నాలు, రాస్తారోకోలు చేపడుతున్నారు.

రొడెక్కిన 3వ బ్లాక్ విద్యార్థినిలు.

గత కొన్ని నెలలుగా సరైన మెనూ అమలు చేయడం లేదని, రెండో సారి ఫుడ్ ,కర్రీ అడిగితే డబుల్ బిల్ అంటున్నారని.. ఉడికి ఉడకని అన్నం, ఇక సాంబార్ లో పెరుగు, చాయ్‌లో నీళ్ల శాతమే అధికంగా ఉంటాయి అని విద్యార్థినీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెస్‌లలో వర్కర్స్ దురుసుగా, కఠిన పదజాలంతో ప్రవర్తిస్తున్నట్లు చెబుతున్నారు. మెస్ బిల్స్ తక్కువేం రాదంటున్నారు. ఇక మూడు నెలలుగా ఇదే సమస్యలు ఎదుర్కొంటున్నామని పరిష్కరించలని అడిగితే " గాలి మాటలు " అని మెస్‌లో పని చేసే వర్కర్స్ తమపట్ల బాధ్యతాయుతంగా ఉంటారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఇక ప్రధానంగా డెరైక్టర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఉడికి ఉడకని అన్నం పెట్టడంతో పాటుగా స్టీమ్డ్, రైస్‌తోనే తరుచు కడుపులో నొప్పి వస్తుందని విద్యార్థులు మంగళవారం రాస్తారోకోలో బహిరంగంగానే విమర్శించారు.

సెంటినరి హాస్టల్‌లో సమస్యలు

వైఫై పని చేయడం లేదని, పలుమార్లు వాష్ రూమ్స్, సింక్స్ బ్లాక్ కావడం, అన్నంలో పురుగు రావడం,లిఫ్ట్ పని చేయడం లేదని, లిమిటెడ్ ఫుడ్ ఇవ్వడం, రీడింగ్ రూమ్ లో టేబుల్స్ తప్ప కుర్చీలు లేవని, దానితో రీడింగ్ రూమ్ నిరుపయోగంగా ఉంద సెంటినరి విద్యార్థులు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. అలాగే రాత్రి పూట 7 గంటల తరువాత వసతి గృహం ప్రధాన గేట్లు మూసి వేయడం, ఆర్ట్స్ కళాశాల నుంచి వసతిగృహానికి వెళ్లే రహదారి వెంట వీధిదీపాలు లేవని, కుక్కల బెడద ఉందని, సమస్యలు చెప్పితే రిపీట్ కావు అంటారు కానీ చేతల్లో శూన్యం అంటున్నారు విద్యార్థినీలు. రెండు బెడ్స్ పై ముగ్గురు, మూడు బెడ్‌లను నలుగురికి కేటాయించినట్టు చెబుతున్నారు.

బయటకు పొక్కితే టార్గెట్..!

ఇక సమస్యలు పరిష్కరించాలని అడిగినా, బయట వాళ్లకు చెప్పినా టార్గెట్ చేసి మరి ఇబ్బందులు పెడుతున్నారని, ఇక గత్యంతరం లేక భరించలేక రొడెక్కితే లేనిపోని ఆరోపణలు అంటు, రాద్ధాంతం అంటారు తప్ప సమస్యలు పరిష్కరించాలన్న చిత్తశుద్ధి లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇద్దరు డెరైక్టర్స్ అవసరం

ప్రధాన లేడీస్ హాస్టల్ కు, సెంటినరి హాస్టల్ కు ఒకే డెరైక్టర్ కాకుండా ఇద్దరు డెరైక్టర్స్‌ను ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. గతంలో ఇద్దరు డెరైక్టర్స్‌ను పెట్టి మళ్ళీ కొన్నాళ్ల తరువాత ఒకరితోనే నడపడం వల్ల ఈ సమస్యలు పునరావృతం అవుతున్నాయి అని విద్యార్థులు అంటున్నారు.

లిఖితపూర్వకంగా హామీ ఇచ్చాము



విద్యార్థుల డిమాండ్స్‌లలో మా పరిధిలో సమస్యలు మేము పరిష్కరిస్తాము. మిగితావి పరిష్కరించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్ళాము. ఇప్పటికే లిఖితపూర్వకంగా హామీ ఇచ్చాము. విద్యార్థులకు సదుపా యాల కల్పన, నాణ్యమైన ఆహారం అందించేలా కృషి చేస్తున్నాము.కొన్ని నిబంధనలు కఠినతరం చేయడం తో కొందరు ఇలా చేస్తున్నారు. స్కాల ర్ షిప్స్ రాక అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాము. సమస్యలు ఉంటే ముందు నాదృష్టికి తీసుకురావాలని కోరుతున్నాను. సమ స్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం

- డైరెక్టర్ ప్రొ. కళ్యాణ లక్ష్మి

ఏషియన్ స్పైన్ ఆస్పత్రి సరికొత్త మైలురాయి

- కీ హెూల్ ఎండోస్కోపిక్ స్పైన్ టెక్నాలజీతో 200 కు పైగా స్పైనల్ ఫ్యూజన్ సర్జరీలు



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

దేశంలో మొదటిసారిగా కీ హెూల్ ఎండోస్కోపిక్ టెక్నాలజీని ఉపయోగించి 200 స్పైనల్ ఫ్యూజన్ సర్జరీలను విజయవంతంగా పూర్తి చేసిన ఆస్పత్రిగా హైదరాబాద్‌లోని ఏషయన్ స్పైన్ ఆస్పత్రి సరికొత్త మైలు రాయిని సృష్టించింది. ఈ సందర్భంగా హాస్పటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ముఖ్య అతిథిగా మ్యాక్స్ విజన్ హాస్పటల్ ఫౌండర్ డాక్టర్ కాసు ప్రసాదరెడ్డి , ఏషియన్ స్పైన్ ఆస్పత్రి చైర్మెన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సుకుమార్ సూరా, హాస్పటల్ సీఈవో డైరెక్టర్ నరేష్ కుమార్ పగిడిమర్రి, కన్సల్టెంట్ స్పైన్ సర్జన్ డైరెక్టర్ సెంటర్ ఫర్ కాంప్లెక్స్ స్పైన్ సర్జరీ ఎం అభినందన్ రెడ్డి, సీనియర్ అనస్తీషియన్ హెడ్ డాక్టర్ పద్మ రవి కంటితోపాటు అనేకమంది ఇతర ప్రముఖులు పాల్గొని వివరాలను తెలిపారు.

అతి తక్కువ హానికరమైన ఈ పూర్తి ఎండోస్కోపిక్ స్పైనల్ శస్త్ర చికిత్సలో ఏషియన్స్ సైన్ ఆస్పత్రి అగ్రగామిగా నిలవటం ఎంతో గర్వకారణమని అన్నారు. ఎండోస్కోపిక్ ద్వారా రోగికి ఎలాంటి రక్తస్రావం జరగకుండా అతి తక్కువ సమయంలో వైద్యం చేయుటకు అనుభవజ్ఞులైన డాక్టర్లు ఉన్నారని చెప్పారు సాధారణ ఓపెన్ సర్జరీలకంటే ఎండోస్కోపీ సర్జరీ రోగికి అనే ప్రయోజ నాలను అందిస్తుందని అన్నారు. ఈ శస్త్ర చికిత్సకు ఎలాంటి కోతలతో పని లేకుండా స్క్రూలు బిగించటం ద్వారా రోగి త్వరగా కోలుకొని వెంటనే ఇంటికి వెళ్ళుటకు అవకాశం ఉందని తెలిపారు. ఎండోస్కోపిక్ వెన్నెముక ప్రక్రియల కోసం డిమాండ్ పెరుగుతున్న కొద్దీ ఏషియన్ స్పైన్ ఆస్పత్రి భవిష్యత్తు అవసరాలను తీర్చడానికి సిద్ధంగా ఉందన్నారు. అదే సమయంలో మెరుగైన ఫలితాలతో త్వరగా కోలుకునేలా రోగులకు అధునాతన వెన్నెముక శస్త్ర చికిత్సలను అందిస్తుందని వివరించారు.

సివరేజ్ పైప్‌లైన్ పనులను పరిశీలించిన కార్పొరేటర్

నవతెలంగాణ - బంజారాహిల్స్



ఖైరతాబాద్ డివిజన్‌లో స్థానికుల విజ్ఞప్తి మేరకు మారుతి నగర్‌లో జరుగుతున్నటువంటి నూతన సివరేజ్ పైప్ లైన్ పనులను వాటర్ వర్క్స్ మేనేజర్ నదీంతో కలిసి బుధవారం కార్పొరేటర్ పి. విజయ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మెయిన్ లైను 30 శాతం వరకు 10" ఇంచులు వేసి మిగతా 30 శాతం 8" ఇంచుల పైపు వేస్తున్నారని దానితో పనులను ఆపివేయడం జరిగిందని, మిగతా 40శాతం మెయిన్ లైన్ పూర్తిగా పది ఇంచులు వెయ్యాలని స్థానికులు పి విజయ రెడ్డిని కోరారు. దాంతో వెంటనే వాటర్ వర్క్స్ సీజీఎం, జీఎంతో కార్పొరేటర్ మాట్లాడి బ్యాలెన్స్ పనులకు వెంటనే అమలు చేసి మెయిన్ లైన్ పది ఇంచుల పనులు మారుతి నగర్‌లో పూర్తిగా వెయ్యాలన్నారు. సానుకూలంగా స్పందించిన అధికారులు 15 రోజులలో అమలు చేసి పనులను మొదలుపెడతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, స్థానిక బస్తీ వాసులతో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ గాంధీభవన్‌లో కార్పొరేటర్ మర్యాద పూర్వకంగా కలిశారు.

అసమానతలను తొలగించే అఖండ దీపమే ఎస్సీ వర్గీకరణ



- లక్ష్యం నెరవేరే వరకు ఉద్యమంలో ముందుకు సాగాలి
- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ

నవతెలంగాణ-ఓయూ

ఏడు దశాబ్దాలుగా దళితుల మధ్య పేరుకుపోయిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలనే చీకటిని తొలగించే అఖండ దీపమే ఎస్సీ వర్గీకరణ అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ, ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు సి.యచ్. సోమశేఖర్ మాదిగలు అన్నారు. బుధవారం పొలిటికల్ సైన్స్ డిపార్ట్మెంట్ సెమినార్ హాల్‌లో ఓయూ మాదిగ విద్యార్థుల సదస్సు రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ అధ్యక్షతన నిర్వహించారు.ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ. అంబేద్కర్ పవిత్రమైన లక్ష్యంతో రాజ్యాంగంలో రిజర్వేషన్లను పొందుపరిస్తే, ఆ రిజర్వేషన్లు స్వతంత్ర భారత దేశంలో అన్ని కులాలకు అందలేదన్నారు. ఈ దేశాన్ని పాలించిన పాలకులు జనాభా ప్రాతిపదికన ఎస్సీలలోని అన్ని కులాలకు రిజర్వేషన్లు అందించడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. అందుకే అంబేద్కర్ ఆలోచన విధానానికి అనుగుణంగా ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించి ఆ ఫలాలు అన్ని కులాలకు అందించాలనే లక్ష్యంతోనే మంద కృష్ణ మాదిగ నేతత్వంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ పోరాటం చేస్తుందని అన్నారు. ఈ పోరాటం ఏ కులానికి వ్యతిరేకం కాదని అన్నారు. రాజ్యాంగం సమానత్వం కోరుతుందని అది సాధ్యం కావాలంటే ఎస్సీ వర్గీకరణ జరగాలన్నారు. అందుకోసం జరుగుతున్న పోరాటంలో పాల్గొనడం ప్రతి మాదిగ విద్యార్థి బాధ్యత అని అన్నారు. ప్రస్తుతం ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత అంశం చివరి దశలో ఉందని, మాదిగ మరియు ఉప కులాల ప్రజలు అప్రమత్తంగా ఉండి జాతి లక్ష్యం నెరవేరెంత వరకు ఉద్యమంలో ముందుకు సాగాలన్నారు. ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కోసం అందరూ సహకరించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ,జాతీయ కార్యదర్శి డా.పల్లేర్ల సుధాకర్ మాదిగ,జాతీయ ఉపాధ్యక్షులు తోకల చిరంజీవి మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామారపు శ్రీనివాస్ మాదిగ,కార్యదర్శి దుప్పెల్లి అనిల్ మాదిగ,హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు జనపాల మహేశ్ మాదిగ,ప్రధాన కార్యదర్శి ధావు ఆదిత్య మాదిగ,ఉపాధ్యక్షులు మామిడి ప్రశాంత్ మాదిగ తదితర నాయకులు పాల్గొన్నారు.

వస్త్రాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఓయూ



హబ్సిగూడ డివిజన్ స్ట్రీట్ నెంబర్ 8లో రైమండ్స్ కే ఎన్ ఫ్యాషన్ నూతన వస్త్రాలయాన్నిఎ మ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి , బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డిలు బుధవారం ప్రారంభించారు. నిర్వాహకులు అశ్విన్ రెడ్డి, సురేష్ గౌడ్ ఆహ్వానం మేరకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన వారి చేతులమీదుగా ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. హబ్సిగూడ డివిజన్ చెందిన బీఆర్ఎస్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగులు క్రీడల్లో పాల్గొనడం అభినందనీయం

- ప్రొఫెసర్ కోదండరామ్, అద్దంకి దయాకర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఉద్యోగులందరూ సాధారణ పనులకు అతీతంగా క్రీడల్లో పాల్గొనడం అభినందనీయమని ప్రొఫెసర్ కోదండరామ్, అద్దంకి దయాకర్ అన్నారు. 9వ స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా క్రీడలు, ఆటలు, ఇతర ఇండోర్ గేమ్‌లతో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు, సేవారత్న డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని (ముజీబ్) ఆధ్వర్యంలో బుధవారం లాల్ బహదూర్ స్టేడియంలో నిర్వహించిన యట్టం సదానంద్ క్రికెట్ టోర్నమెంట్ సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లకు ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ కోదండరామ్, అద్దంకి దయాకర్ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. అంతకు ముందు జాతీయ జెండా, టీఎన్జీవోస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ ప్రభుత్వానికైనా ఉద్యోగులే వెన్నెముక అని తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమానికి హాజరైన సభ్యులందరికీ డాక్టర్ ముజీబ్ కృతజ్ఞతలు తెలిపారు. స్టేడియం ఆవరణలో ఉద్యోగులందరికీ మధ్యాహ్న భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌జీఈఎఫ్ అధ్యక్షుడు సుభాష్ లంబాజీ, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ వెంకటనారాయణ, గెజిటెడ్ ఆఫీసర్స్ ప్రతినిధులు ఏలూరి శ్రీనివాస్, శ్యామ్, సెంట్రల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మారం జగదీష్, ఉపాధ్యక్షుడు కస్తూరి వెంకట్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, సీమా ముజీబ్, ఉమాదేవి, శైలజ, జిల్లా సెక్రటరీ ఎస్.విక్రమ్ కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు కె.ఆర్. రాజ్ కుమార్, కోశాధికారి బాల్‌రాజ్, ఉపాధ్యక్షులు ఒమర్ ఖాన్, ఎంఏ.ముజీబ్, కుర్రాడి శ్రీనివాస్, నరేష్ కుమార్, ఖలీద్ అహ్మద్, వైదిక్ శాస్త్ర, సుజాత, గీత, బి.వెంకట్ రెడ్డి, మోహన్, ప్రభాకర్, వివిధ యూనిట అధ్యక్ష, కార్యదర్శులు, ప్రాథమిక సభ్యులు, మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-ఓయూ



ఏబీవీపీ ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఓయూ అనుబంధ డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి రిజిస్ట్రార్ ప్రొ.పి. లక్ష్మీనారాయణను బుధవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. 2020 సంవత్సరం డిగ్రీ బ్యాచ్ ఒకటి నుండి ఆరు సెమిస్టర్స్ బ్యాక్లాగ్ స్టూడెంట్స్‌కి వన్ టైం సప్లిమెంటరీ అవకాశాన్ని కల్పించి, సత్వరమే పరీక్షలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఓయూ ఏబీవీపీ నేతలు పాల్గొన్నారు.

'అత్యాధునిక సౌకర్యాలతో తమన్నా స్కిన్ అండ్ హెయిర్ కేర్'



నవతెలంగాణ-బంజారాహిల్స్

ప్రస్తుత మెట్రో సిటీ జీవనశైలిలో మార్పు మొదలైందని ప్రతీ ఒక్కరు అందంగా ఉండాలనే ఆలోచన విధానన్ని కోరుకుంటూ చర్మ, జుట్టు సౌందర్యాలకు ప్రాధాన్యత నిస్తున్నారని తమన్నా తెలిపారు. అత్యాధునిక సౌకర్యాలతో నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉండి స్కిన్ అండ్ హెయిర్ కేర్, అడ్వాన్స్ డెర్మటాలజీలో ఒక ప్రముఖ కేంద్రంగా తమన్నా స్టూడియోనూ పేరుగాంచిందన్నారు. తమన్నా స్టూడియోనూ బుధ వారం బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 10 లో కవితా గులేచా, మన్సీ మాలిక్, నందిని గోయెల్, అషు గౌరీలతో కలిసి ప్రారంభించారు.

అనంతరం ఆమె మాట్లాడుతూ...తమన్నా స్కిన్ అండ్ హెయిర్ కేర్ సమగ్ర సౌందర్యం పట్ల నిబద్ధత, స్కిన్ కేర్ పట్ల వినూత్న విధానంలో ప్రతిబింబిస్తుందని అన్నారు.నిస్వార్ధంగా అందరికీ అందుబాటు ధరల్లో సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే విధానంగా సేవలు అందిస్తామన్నారు. ఆ లక్ష్యంతోనే సెలూన్లో డెర్మటాలజికల్ టెక్నాలజీలో అప్స్కేల్లో దాని రెండవ స్థానాన్ని గొప్పగా ప్రకటిస్తున్నామని.. మొదటి స్థానానికి చేరుకోవడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు.



రోజా రేకులతో...

ఎక్కువ మంది ఇష్టపడేవి.. చూడగానే ఎంతో అందంగా కన్పించే రోజా... ఇంట్లో పెంచుకునే పూలలో మొదటి వరుసలో ఉండేవి కూడా ఈ పూలే... ఈ పూలను గిఫ్టులుగా, బొకేలుగానే కాకుండా అందానికి, ఆరోగ్యానికి కూడా ఎంతో ఉపయోగ పడతాయి. ఇందులో ఎన్నో ఔషధ గుణాలున్నాయి. శరీరంపై మొటిమలు, నల్ల మచ్చలు ఉన్న ప్రదేశంలో రోజా రేకుల ముద్దను రాసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. క్రమేపీ నల్లమచ్చలు తగ్గిపోతాయి.

○ రోజా రేకులతో తయారు చేసే కషాయం కూడా ఆరోగ్యానికి మంచిది. ఇది చర్మానికి మెరుపును అందిస్తుంది.

○ రోజా పూల నుంచి వచ్చే సువాసనను పీల్చడం వల్ల శారీరకంగానే కాక మనసుకు కూడా ప్రశాంతత లభిస్తుంది. ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడానికి దోహదపడుతుంది.

○ వేడి నీటిలో రోజా రేకులు, బాత్‌సాల్ట్ వేయాలి. ఈ మిశ్రమాన్ని క్రమం తప్పకుండా పీల్చితే మెదడు చురుగ్గా ఉంటుంది.

○ ఇది జీర్ణక్రియను కూడా మెరుగుపరుస్తుంది. కొద్దిగా మెంతులు, రోజా రేకులు కలిపి చేసుకున్న పేస్టును తినడం వల్ల శరీరంలో చెడు కొవ్వు తగ్గుతుంది. అధిక బరువు ఉన్నవారు ప్రతిరోజూ ఇది తినడం వల్ల బరువు తగ్గుతారు.

సంక్రాంతి వేళ...

సంక్రాంతి పండుగ రానుంది. కొత్త పంటలు ఇంటికి వచ్చిన వేళ సంతోషంతో చేసుకునే ఈ సంక్రాంతికి అల్లుళ్లు ఇంటికి వస్తారు. భోగి నుండి మొదలై నాలుగు రోజుల పాటు ఇల్లు, ఊరు వాడంతా కోలాహలం నెలకొంటుంది. ఆంధ్రాలో అయితే కోడి పందేల జోరు కూడా ఉంటుంది. ఇక పిండి వంటల గురించి చెప్పనవసరం లేదు. మురుకులు, కజ్జికాయలు, అరిసెలు ఇలా చాలా వెరైటీలు చేసుకుంటారు. ఈ వారం మనం కూడా కొన్ని సాంప్రదాయకపు పిండి వంటలు ఎలా చేయాలో చూద్దాం..

కజ్జికాయలు

కావలసిన పదార్థాలు : మైదా - పావు కేజీ, వెన్న - 55 గ్రా. (గది ఉష్ణోగ్రత వద్ద), నీరు - పిండి కలపటానికి సరిపడా, తురిమిన కొబ్బరి - 200 గ్రా., పాలు - 200 ఎం.ఎల్., నెయ్యి - పదిహేను గ్రా. (చెంచా), యాలకులు - ఐదు, చక్కెర - 150 గ్రా.

తయారు చేసే విధానం :

పిండి కోసం : మిక్సింగ్ బౌల్ తీసుకుని మైదా వేయాలి. ఇందులోనే వెన్నను వేసి బాగా కలపాలి. ఇందులోనే కొద్దికొద్దిగా నీళ్ళు చేర్చుకుంటూ మెత్తని ముద్దలా చేసుకోవాలి. అయితే పిండి గట్టిగా ఉండేలా చూసుకోవాలి. లేదంటే కజ్జికాయలు ఉబ్బిపోతాయి. దీనిని గంట పాటు పక్కన పెట్టాలి.



స్టఫింగ్ కోసం : యాలకుల విత్తనాలను మాత్రమే మెత్తగా చేసుకుని పక్కన పెట్టుకోవాలి. ఒక పాన్ తీసుకుని అందులో నెయ్యి వేయాలి. నెయ్యి కాగగానే తురిమిన కొబ్బరి వేసి చిన్న మంట మీద కొద్దిగా పొడి అయ్యే వరకు వేయించాలి. అడుగంటకుండా చేసుకోవడం ముఖ్యం. ఇందులోనే పాలు పోసి కలపాలి. కొంచెం దగ్గరయ్యాక చక్కెర కూడా వేయాలి. ఈ మిశ్రమం దగ్గర పడేవరకు కలుపుతూ ఉండాలి. తర్వాత ఇందులో యాలకుల పొడి వేసి బాగా కలపాలి. ఒక నిమిషం తర్వాత ఈ మిశ్రమాన్ని స్టవ్ మీద నుండి దించేసి, గిన్నెలోకి మార్చి, చల్లారనివ్వాలి.

నానబెట్టి పక్కన పెట్టుకన్న పిండిని చపాతిలా చిన్న పరిమాణంలో రుద్దుకోవాలి. అందులో తయారు చేసి పెట్టుకున్న కొబ్బరి మిశ్రమం ఉంచి అంచులను మూసివేయలి. లేదంటే కజ్జికాయల షేప్ బాక్స్ మార్కెట్‌లో అందుబాటులో ఉంటుంది. చపాతిలా చేసుకున్న పిండిని అందులో పెట్టి, మధ్యలో స్టఫింగ్ కోసం రెడీ చేసుకున్న మిశ్రమాన్ని ఉంచి, బాక్స్ మూసేస్తే మిశ్రమం పిండిలో సమంగా పరుచుకుంటుంది. తర్వాత అందులో నుంచి తీసేసి అంచులను సరిగా మూసేయాలి. లేదంటే నూనెలో వేసేపుడు విడివడి అందులో కలిసిపోతాయి.

ఇలా పిండి మొత్తాన్ని కజ్జికాయల ఆకృతిలో తయారు చేసి పెట్టుకున్నాక, ఒక కడాయిలో నూనె వేసి వేడయ్యాక వీటిని ఒక్కొక్కటిగా అందులో వేసి కాల్చుకోవాలి. అంతే నోరూరించే కజ్జికాయలు రెడీ.

మురుకులు....

కావలసిన పదార్థాలు : బియ్యప్పిండి- కప్పున్నర, శెనగపిండి- అర కప్పు, ఉప్పు- రుచికి సరిపడా, జీలకర్ర- పావు చెంచా, బటర్- పెద్ద చెంచా, కారం - అర చెంచా, ఇంగువ - పావు చెంచా, ఉప్పు- తగినంత, నూనె: వేయించడానికి సరిపడా.



తయారు చేసే విధానం : గిన్నెలో బియ్యప్పిండి, శెనగపిండి, ఉప్పు, జీలకర్ర, ఇంగువ, కారం, బటర్ వేసి చపాతీ పిండిలా తడపాలి. ఈ మిశ్రమాన్ని పది నిమిషాలు పక్కన పెట్టుకోవాలి. ఒక కడాయిలో నూనె పోసి, బాగా కగాక, కలిపి పెట్టుకున్న పిండి మిశ్రమాన్ని జంతికల గొట్టంలో వేసి కాగే నూనెలో మురుకుల్లా ఒత్తాలి. వీటిని బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. పిండి మొత్తాన్ని ఇలా చేసుకోవాలి. అంతే మురుకులు రెడీ.

చెక్కలు



కావలసిన పదార్థాలు : బియ్యప్పిండి- పెద్ద కప్పు, పల్లీలు, నువ్వులు- మూడు చెంచాల చొప్పున, కారం - పెద్ద చెంచా, ఉప్పు- తగినంత, జీలకర్ర, అల్లం వెల్లుల్లి ముద్ద, పచ్చిమిర్చి ముక్కలు- చెంచా చొప్పున, కరివేపాకు- రెండు రెమ్మలు, నూనె - వేయించడానికి సరిపడా

తయారు చేసే విధానం : పెద్ద గిన్నెలో బియ్యప్పిండితో సహా అన్ని పదార్థాలను వేసి కొన్ని నీళ్లు పోయాలి. ఇందులోనే ఒక చెంచా నూనె వేడి చేసి కలుపుతున్న పిండిలో వేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని గట్టి పిండిలా (పొడిపొడిగా) తడిపి పెట్టుకోవాలి. తర్వాత స్టవ్ మీద మందపాటి కడాయి పెట్టుకుని అందులో నూనె వేసుకోవాలి. ఈ లోగా కలిపి పెట్టుకున్న పిండికి కాస్త లైట్‌గా నీళ్ల కలిపి అరచేతిలో నూనె రాసి, చిన్న చిన్న అప్పాలుగా చేసుకుని కాగే నూనెలో వేసుకోవాలి. దోరగా వేయించుకుంటే వేడి వేడి చెక్కలు చక్కగా రెడీ అయిపోతాయి.

లడ్డూ

కావలసిన పదార్థాలు : బియ్యప్పిండి- కప్పు, పుట్నాల పప్పు, పల్లీలు- అర కప్పు చొప్పున, నువ్వులు- రెండు పెద్ద చెంచాలు, ఎండు కొబ్బరి తురుము- పావు కప్పు, యాలకుల పొడి - పావు చెంచా, బెల్లం - కప్పు, నెయ్యి - రెండు పెద్ద చెంచాలు, నీళు - తగినన్ని

తయారు చేసే విధానం : పల్లీలు, పుట్నాలు, నువ్వులు, ఎండుకొబ్బరి తురుము, బియ్యప్పిండి అన్నింటిని విడివిడిగా వేయించి పెట్టుకోవాలి. పల్లీలు, పుట్నాలను పొడి చేసుకోవాలి. ఆ తర్వాత గిన్నెలో బియ్యప్పిండి పుట్నాల పప్పు పొడి, పల్లీల పొడి, నువ్వులు, కొబ్బరి తురుము, యాలకుల పొడి వేసి కలపాలి. నెయ్యి కూడా జత చేసి ఉండలు లేకుండా మరోసారి కలుపుకోవాలి. స్టవ్ మీద మందపాటి బాండీ పెట్టి కప్పు బెల్లం వేసి, పావు కప్పు నీళ్ల పోసి చిన్న -మంటపై నెమ్మదిగా కలుపుతూ ఉండాలి. బెల్లం పూర్తిగా కరిగిన తర్వాత రెండు, మూడు నిమిషాలు మరిగించాలి. ఈ ద్రవాన్ని వడకట్టి పిండిలో పోసి బాగా కలియబెట్టాలి. చేతులకు నెయ్యి రాసుకుని ఈ మిశ్రమాన్ని ఉండలా చేసుకోవాలి. అంతే రుచికరమైన లడ్డూలు రెడీ.





అరిసెలు

కావలసిన పదార్థాలు : బియ్యం - 600 గ్రా., బెల్లం - 300 గ్రా., నీరు - 40 లేదా 50 మి.లీ., యాలకుల పొడి - చెంచా, నువ్వులు - ఒకటి లేదా రెండు చెంచాలు, నెయ్యి - అర కప్పు, నూనె - డీప్ ఫ్రైకి సరిపడా.

తయారు చేసే విధానం : బియ్యాన్ని రాత్రంతా నానబెట్టాలి. ఉదయాన్నే శుభ్రంగా రెండు మూడు సార్లు కడిగి జల్లెడలో వేసి నీళ్ల మొత్తం పూర్తిగా కారిపోయే వరకు ఉండాలి. బియ్యాన్ని కొద్ది కొద్దిగా చిన్న మిక్సీ జార్‌లో వేసి బాగా మెత్తగా పొడి కొట్టి పక్కన పెట్టుకోవాలి. ఈ పిండిని పిండి జల్లెడతో జల్లించాలి. ఇలా చేస్తే మెత్తని పిండి వేరవుతుంది. మిగిలిన పొడిని మళ్లీ మిక్సీలో వేసి పొడి చేసుకోవాలి. ఇలా చేస్తే పిండి మెత్తగా ఉంటుంది. పిండి పొడిబారకుండా ఉండేలా జాగ్రత్త వహించాలి.

బెల్లం పాకం కోసం : ఒక పెద్ద గిన్నెలో బెల్లం తరుము వేసి పొయ్యి మీద పెట్టాలి. అందులో నీళ్ల పోసి బెల్లాన్ని కరిగించాలి. ఈ మిశ్రమాన్ని స్టవ్ హై ఫ్లేమ్‌లో ఉంచి కలుపుకుంటూ మరిగించాలి. అడుగంటకుండా జాగ్రత్త వహించాలి. పాకం వచ్చిందో లేదో తెలుసుకునేందుకు ఒక గిన్నెలో కొన్ని నీళ్ల పోసుకుని పక్కన పెట్టుకోవాలి. బెల్లం మిశ్రమాన్ని కలిపేపుడు గరిటతో కలుపుతూ పరిశీలించుకోవాలి. కొద్ది సేపటికి ఈ మిశ్రమం తీగలా సాగడం మొదలవుతుంది. నీళ్ల పోసి పెట్టుకున్న గిన్నెలో ఈ పాకం వేస్తే అది కరిగి పోకుండా ఉన్నప్పుడు పాకం సరిగ్గా తయారయినట్లు లెక్క లేదంటే పాకం నీళ్లలో వేసి ఆ పాకాన్ని చేతిలో తీసుకుంటే ఉండలా అవుతుంటే పాకం వచ్చినట్లే. వెంటనే స్టవ్‌ను సిమ్‌లో పెట్టుకుని నెయ్యి, యాలకుల పొడి వేసి బాగా కలిపి స్టవ్ కట్టేసి పాకాన్ని పక్కన పెట్టుకోవాలి. ఆలస్యం చేయకుండా జల్లెడ పట్టి పక్కన పెట్టుకున్న పిండిని అందులో పిడికిళ్లతో కొద్దికొద్దిగా వేస్తూ బాగా కలుపుకోవాలి. అది చపాతీ పిండిలా గట్టిగా తయారయ్యే వరకు బియ్యం పిండి వేసి కలుపుతూ ఉండాలి.

అరిసెలు చేయుటకు : పెద్ద మందపాటి కడాయిలో మీడియం సెగ మీద నూనెని వేడి చేయాలి. నూనె వేడయ్యేలోగా చేతికి కొంచెం నూనె రాసుకుని పిండి తీసుకుని గుండ్రటి ముద్దలా చేసుకుని కవర్ మీద పెట్టి అప్పులా ఒత్తుకోవాలి. దీని మీద కొన్ని నువ్వులు అద్ది మెల్లగా నూనెలోకి జారవిడవాలి. నూనెలో వేయగానే అది మునిగి పోతుంది. కాబట్టి అది పైకి తేలే వరకు కదపకుండా ఆగాలి. పైకి తేలాక ఒక నిమిషం ఆగి అప్పుడు మెల్లగా రెండో వైపుకి తిప్పాలి. రెండు వైపులా తిప్పుతూ సమంగా బంగారు రంగులోకి మారే వరకు వేయించాలి. నూనెలో నుండి బయటకి తీశాక రెండు గరిటెల మధ్యన ఉంచి నూనె మొత్తం కారిపోయే వరకు గట్టిగా ఒత్తాలి. వీటిని ఒక పట్ట మీద పరుచుని చల్లారిన తర్వాత డబ్బాలో ఎత్తిపెట్టుకోవాలి. ఇవి నెల పాటు నిల్వ ఉంటాయి.

ఫిబ్రవరి 16న విద్యుత్ ఉద్యోగుల దేశవ్యాప్త ఆందోళనలు

(మొదటిపేజి తరువాయి)

ఇండియా (ఈఈఎఫ్ఐ) ప్రకటించింది. విద్యుత్ రంగ సంస్కరణల పేరుతో కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రమాదకరమైన నిర్ణయాలు తీసుకుంటూ గడచిన పదేండ్లుగా దేశ ప్రజల్ని అనేక కష్టనష్టాలకు గురిచేసిందని తెలిపారు. వాటినుంచి విముక్తి కోసం సమాజంలోని అన్ని వర్గాల ప్రజలనూ భాగస్వామ్యం చేస్తూ ప్రత్యేక ఫోరంలు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. దీనికోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామనీ, వాటికోసం మరికొన్ని చర్చలు జరగాల్సి ఉందని చెప్పారు. హైదరాబాద్‌లో జరుగుతున్న ఈఈఎఫ్ఐ వర్కింగ్ కమిటీ రెండ్రోజుల సమావేశాలు బుధవారం ముగిసాయి. ఈ సందర్భంగా హైదరాబాద్ కోఠిలోని ఐఎమ్ఏ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈఈఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రశాంత నంది చౌదరి, ఉపాధ్యక్షులు సుభాష్ లాంబా, జితేన్ నంది, కార్యదర్శులు దీపా కే రాజన్, సందీప్ దత్త, వీ గోవర్థన్, కోశాధికారి రాజేంద్రన్, అలిండియా వర్కింగ్ కమిటీ సభ్యులు కే ఈశ్వరరావు, వీ కుమారచారి మాట్లాడారు. విద్యుత్ చార్జీలు తగ్గించాలనీ, బొగ్గుసరఫరా సమస్యలు పరిష్కరించాలనీ, విదేశీ బొగ్గు దిగుమతులు నిలిపివేయాలని, థర్మల్ పవర్ స్టేషన్లపై రినవబుల్ ఎనర్జీ భారాల్ని నిలిపేయాలని కోరారు.

తిరోగమన విద్యుత్ ట్రాన్స్‌మిషన్ పాలసీ, విద్యుత్ సవరణ బిల్లు-2022 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల సాంకేతిక అప్‌గ్రేడేషన్‌ను డిస్కంలు లేదా ప్రభుత్వరంగ సంస్థలే చేపట్టాలనీ, థర్డ్ పార్టీ పేరుతో ప్రయివేటు ఏజెన్సీలకు అవకాశం కల్పిస్తూ, వినియోగదారుల డేటాను వారికి అందించవద్దని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రినవబుల్ ఎనర్జీ, విద్యుత్ నిల్వ సహా ఇతర ఇంధన అనుబంధరంగాల్లో ప్రయివేటు గుత్తాధిపత్యాన్ని నిలువరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల విద్యుత్ హక్కును లాగేసుకొని, వ్యాపారాన్ని ప్రయివేటు, కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నదని విమర్శించారు. విద్యుత్‌రంగంలో క్రాస్ సబ్సిడీని క్రమేణా ఎత్తేయాలని కేంద్రం భావిస్తున్నదనీ, దానికోసం ఇప్పటికే ఆయా రాష్ట్రాలకు అధికారిక ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు.

విద్యుత్ టారిఫ్‌లను కూడా పీక్, నాన్‌పీక్ డిమాండ్ల ప్రాతిపదికగా నిర్ణయించే చర్యలకు సిద్ధపడుతున్నారనీ, దీనివల్ల ప్రజలు విద్యుత్ వెలుగుల వివక్షను ఎదుర్కోవలసి వస్తుందని వివరించారు. దేశంలో నిరుద్యోగంతో పాటు నిత్యవసర వస్తువుల ధరలూ పెరిగాయనీ, సైన్యంలో అగ్నివీర్ పేరుతో సేవల్ని నాలుగేండ్లకు కుదించారనీ, ప్రభుత్వరంగ సంస్థల్ని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ఈ చర్యల్ని ప్రశ్నిస్తే అయోధ్య రామమందిరం అంటూ మత సెంటిమెంటును రాజేసి, రాజ్యాధికారాన్ని నిలుపుకోవాలని ప్రయత్నిస్తున్నారని వివరించారు. కేంద్రం అనుసరిస్తున్న ఈ ధోరణిని కచ్చితంగా విద్యుత్ ఉద్యోగులు ప్రజల ముందు పెడతారనీ, గ్రామస్థాయిలో ఏర్పటయ్యే ప్రత్యేక ఫోరంల్లో వీటిపై ప్రజల మధ్యే చర్చిస్తామని చెప్పారు. దేశంలో సప్లరు కంటే డిమాండ్ తక్కువగా ఉన్నా విద్యుత్ ఎక్సేంజీల్లో కరెంటు రేట్లు ఎందుకు పెరుగుతున్నారని ప్రశ్నించారు. విద్యుదుత్పత్తిని ప్రయివేటుపరం చేయడం వల్లే ఇలాంటి చర్యలు జరుగుతున్నాయని ఉదహరించారు. సమావేశంలో తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఉపాధ్యక్షులు ఎన్ స్వామి, సదాకర్, టీఎస్-ఎస్పీడీసీఎల్ కంపెనీ కార్యదర్శి సత్యం తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల డైరీని ఆవిష్కరించిన దీపాదాస్‌మున్షి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

టీఎస్‌ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం డైరీ-2024ను రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, ఆ సంఘం గౌరవాధ్యక్షులు, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మెన్ మధుయాష్కీగౌడ్ ఆవిష్కరించారు. బుధవారం హైదరబాద్‌లోని గాంధీభవన్‌లో డైరీ ఆవిష్కరించిన తర్వాత ఉద్యోగులకు వారు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఏ.రెహ్మాన్ సూఫీ, ప్రధాన కార్యదర్శి బీవి. కోటయ్య, కోశాధికారి బుచ్చిరెడ్డి, కార్యదర్శులు మునగాల మనోహర్, భూపాల్‌రెడ్డి, పూస నర్సింహా బెస్త తదితరులు పాల్గొన్నారు.

కర్నాటక శకటానికి కేంద్రం నో

బెంగళూరు : దేశ రాజధానిలో జరిగే రిపబ్లిక్ దినోత్సవ వేడుకల్లో కర్నాటక శకటాన్ని ప్రదర్శించేందుకు కేంద్రం అనుమతి నిరాకరించింది. దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర శకటానికి అనుమతి నిరాకరించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఏడు కోట్ల మంది కన్నడిగులను అవమానించిందని ఆయన చెప్పారు. గత సంవత్సరం కూడా కర్నాటక శకటానికి తొలుత తిరస్కరణే ఎదురైంది. అయితే ఆ తర్వాత దానిని అనుమతించారు. అయితే ఆ సమయంలో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉంది.

కర్నాటకలో శాసనసభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొనే గత సంవత్సరం రాష్ట్ర శకటాన్ని అనుమతించారని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో సిద్ధరామయ్య తెలిపారు. మైసూరు రాజు నల్వాది కృష్ణరాజ వడయార్, కిట్టూరు రాణి చెన్నమ్మ, విజయనగర సామ్రాజ్య ప్రముఖుడు నాదప్రభు కెంపెగౌడ అందించిన సేవలను కొనియాడే శకటాలతో పాటు బెంగళూరు నగర వైభవాన్ని చాటిచెప్పే శకటాన్ని అనుమతించాల్సిందిగా కేంద్రాన్ని కోరామని ఆయన వివరించారు. అయితే కేంద్రం తమ అభ్యర్థనను తిరస్కరించిందని, కర్నాటక సాధించిన విజయాలను, రాష్ట్ర ప్రముఖులను జాతికి పరిచయం చేసే అవకాశం లేకుండా చేసిందని మండిపడ్డారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండడం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి కంటగింపుగా ఉన్నదని వ్యాఖ్యానించారు. 'పన్నులలో వాటా, కరువు సాయం చెల్లింపు మొదలు కన్నడిగులు స్థాపించిన బ్యాంకులు, ఓడరేవులు, విమానాశ్రయాల అమ్మకం వరకూ అన్ని విషయాలలోనూ కేంద్రం రాష్ట్ర ప్రజలపై రాజకీయ దురుద్దేశంతో దాడి చేస్తూనే ఉంది. ఇప్పుడు శకటాన్ని తిరస్కరించడం ద్వారా మా గుర్తింపుపై మరోసారి దాడి చేసింది' అని ఆరోపించారు. ఈ అన్యాయాన్ని రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు ఎవరూ ప్రశ్నించడం లేదని, వారంతా ప్రధాని మోడీ చేతిలో కీలుబొమ్మలుగా మారిపోయారని విమర్శించారు. కేంద్రం తన తప్పిదాన్ని వెంటనే సరిచేసుకోవాలని, కర్నాటకకు చేసిన అన్యాయాన్ని సరిదిద్దాలని సిద్ధరామయ్య డిమాండ్ చేశారు. కాగా రిపబ్లిక్ దినోత్సవ వేడుకలలో కర్నాటక శకటాన్ని వరుసగా 14 సంవత్సరాలు ప్రదర్శించారు. గత సంవత్సరం మహిళా సాధికారతపై శకటాన్ని రూపొందించారు.

పరిపాలనపై దృష్టి సారించి.. పార్టీకి సమయమివ్వలేకపోయాం...

(మొదటిపేజి తరువాయి)

అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను పక్కనబెట్టి లోక్‌సభ ఎలక్షన్లపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వంద రోజుల సమయమివ్వాలని భావించామని కేటీఆర్ ఈ సందర్భంగా చెప్పారు. అయితే గవర్నర్ ప్రసంగంతోపాటు శ్వేతపత్రాల ద్వారా కేసీఆర్‌ను, ఆయన గత ప్రభుత్వాన్ని నిందించేందుకు రేవంత్ సర్కార్ పూనుకున్నదని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీల నుంచి తప్పుకునేందుకే ఇలా తమ పార్టీపై అకారణంగా నిందలు మోపుతున్నారని వాపోయారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ వైఖరిని అసెంబ్లీలో గట్టిగా ఎండగట్టామని తెలిపారు. జిల్లాల రద్దుపై ముఖ్యమంత్రి రేవంత్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. అలాంటి చర్యలకు పూనుకుంటే ప్రజలు చూస్తూ ఊరుకోబోరని హెచ్చరించారు. నెలరోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైందనీ, ఈ అంశాన్ని గుర్తించి, క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలపై పోరాడాలని ఆయన కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మెన్, సభ్యుల రాజీనామా ఆమోదం

(మొదటిపేజి తరువాయి)

మంగళవారం ప్రభుత్వ నిర్ణయాన్ని తెలియజేశారు. టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ పదవికి జనార్ధన్‌రెడ్డి డిసెంబర్ 11న రాజీనామా చేశారు. రెండు రోజుల తర్వాత అంటే అదేనెల 13న ముగ్గురు సభ్యులు రాజీనామాలను గవర్నర్‌కు సమర్పించారు. అయితే గత చైర్మెన్, బోర్డు హయాంలో జరిగిన ప్రశ్నాపత్రం లీకేజీ, ఇతర అవకతవకలపై సమగ్ర విచారణ కొనసాగించాలని ప్రభుత్వానికి సూచించామని గవర్నర్ కార్యదర్శి సురేంద్ర మోహన్ తెలిపారు. నిరుద్యోగుల జీవితాలతో మరెవరూ భవిష్యత్‌లో ఆటలాడకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రశ్నాపత్రాల లీకేజీపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ కొనసాగుతున్నదని పేర్కొన్నారు. నిరుద్యోగులు, ప్రజల ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకున్నామని వివరించారు. రాజ్యాంగం, న్యాయ సూత్రాలు, పారదర్శకత, అంకితభావంతో గవర్నర్ వ్యవహరించారని తెలిపారు. రాజీనామా ఒక్కరోజులో తీసుకునే నిర్ణయం కాదనీ, న్యాయ ప్రక్రియను అనుసరించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అయితే టీఎస్‌పీఎస్సీ సభ్యులు కోట్ల అరుణకుమారి, సుమిత్ర ఆనంద్ తనోబా రాజీనామా చేయలేదు. వారు ఇంకా కొనసాగుతూనే ఉండడం గమనార్హం. వారి పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి వైఖరి తీసుకుంటుందో చూడాల్సిందే.

కొత్త కమిషన్‌పై సర్కారు కసరత్తు

టీఎస్‌పీఎస్సీ చైర్మెన్, సభ్యుల రాజీనామాల ఆమోదంతో త్వరలో కొత్త కమిషన్ నియామకంపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. ఇందుకోసం పలువురి పేర్లను పరిశీలిస్తున్నట్టు సమాచారం. ఆశావహులైన పలువురు ఐఏఎస్, మాజీ ఐఏఎస్, ఐపీఎస్, ప్రొఫెసర్లు, ప్రముఖులు ప్రభుత్వానికి తమ బయోడేటాను ఇచ్చినట్టు తెలిసింది. యూపీఎస్సీ సహా కేరళలో అనుసరిస్తున్న విధానాలపై ఇప్పటికే అధికారుల బృందం అధ్యయనం చేసింది. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పించే అవకాశమున్నది. యూపీఎస్సీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సందర్శించి పలు అంశాలను పరిశీలించారు. అయితే సుప్రీం ఆదేశాలకనుగుణంగా టీఎస్‌పీఎస్సీ చైర్మెన్, సభ్యుల నియామకాల ప్రక్రియను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. ఈ దిశగా కసరత్తు ప్రారంభించినట్టు తెలిసింది. కొత్త పాలకమండలి ఏర్పాటైన తర్వాతే గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 రాతపరీక్షలకు తేదీలను ఖరారు చేసేందుకు అవకాశముంటుంది. గ్రూప్-4 రాతపరీక్షలు ముగిశాయి. వాటి ఫలితాలను వెల్లడించాల్సి ఉంది. ఇంకోవైపు కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా జాబ్ క్యాలెండర్‌ను రూపొందించి, అందుకనుగుణంగా నియామకాల ప్రక్రియను చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భావిస్తున్నారు. ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అందుకు అవసరమైన విధంగా నిష్పక్షపాతంగా, వివాదరహితంగా నిరుద్యోగులకు మేలు చేసే అధికారులను టీఎస్‌పీఎస్సీ చైర్మెన్, సభ్యులుగా నియమించే అవకాశమున్నది. ప్రశ్నాపత్రాల లీకేజీతో టీఎస్‌పీఎస్సీ అభాసుపాలైన విషయం తెలిసిందే. కాంగ్రెస్ హయాంలో అలాంటి వాటికి తావివ్వకుండా పారదర్శకంగా నియామకాల ప్రక్రియను చేపట్టాలని ప్రభుత్వం భావిస్తున్నది. టీఎస్‌పీఎస్సీని బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టే అవకాశమున్నది.

జనార్ధన్‌రెడ్డిపై విమర్శ వెల్లువ

బీఆర్ఎస్ హయాంలో ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారం వెలుగులోకి రావడంతో టీఎస్‌పీఎస్సీపై నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా చైర్మెన్ జనార్ధన్‌రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడారని పలు రాజకీయ పార్టీలు, నిరుద్యోగులు ఆరోపించారు. టీఎస్‌పీఎస్సీని ముట్టడించి బోర్డును ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో తన పదవికి రాజీనామా చేయాలని జనార్ధన్‌రెడ్డి అప్పుడే నిర్ణయించుకున్నారు. అయితే ఆయన నిర్ణయాన్ని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం తిరస్కరించింది. కమిషన్‌లో జరిగిన పొరపాట్లు సరిదిద్దాలనీ, సంస్కరణలు చేపట్టి కంప్యూటర్ ఆధారిత పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించింది. దీంతో ఆయన తన నిర్ణయాన్ని విరమించుకున్నారు. రెండోసారి నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను హైకోర్టు రద్దు చేయడంతో కమిషన్‌పై నిరుద్యోగుల్లో మరోసారి తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ సహా ప్రధాన రాజకీయ పార్టీలన్నీ బోర్డును ప్రక్షాళన చేస్తామంటూ హామీలు ఇచ్చాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దీంతో డిసెంబర్ 11న జనార్ధన్‌రెడ్డి తన చైర్మెన్ పదవికి రాజీనామా చేశారు. ఎట్టకేలకు గవర్నర్ ఆ రాజీనామాను ఆమోదించారు.

గృహజ్యోతికి ఏర్పాట్లు చేయండి

(మొదటిపేజి తరువాయి)

రూపకల్పనపై విద్యుత్ రంగ నిపుణులు, వివిధ రాష్ట్రాల విధానాలను అధ్యయనం చేసి, శాసనసభలో చర్చించి, రాష్ట్ర సమగ్ర విద్యుత్ విధానాన్ని ఆమోదించుకోవాల్సి ఉందన్నారు. దీనికోసం కసరత్తును ప్రారంభించాలని చెప్పారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి, వినియోగం, వివిధ కంపెనీల నుంచి చేసిన కొనుగోళ్లు, డిస్కంల పనితీరు, ఆర్థిక స్థితిగతులపై వేర్వేరుగా సమీక్షించారు. అలాగే తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీఎస్‌ఈఆర్సీ) ఇచ్చిన ఆర్డర్లు, వాటి అమలు, జరిగిన ఒప్పందాలు, చెల్లించిన ధరలు, పెంచిన అంచనాలు సహా అన్నింటిపై కూలంకషంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ ఒప్పందాలపై ఆర్థిక సంవత్సరాల వారీగా వివరాలు ఇవ్వాలని కోరారు. ఎక్కువ ధరకు కరెంటును కొంటే, దానికి గల కారణాలను కూడా నివేదికలో పొందుపర్చాలన్నారు. బహిరంగ మార్కెట్లో ఎక్కడ తక్కువ ధరకు విద్యుత్ లభిస్తే, ఆ కంపెనీల నుంచే కరెంటు కొనుగోలు చేయాలని చెప్పారు. గృహజ్యోతి పథకం అమలు కోసం ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లోని విధానాలను అధ్యయనం చేయాలనీ, అంతకంటే మెరుగైన ఆలోచనలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రభుత్వ రంగంలో విద్యుదుత్పత్తి పెంచడానికీ, మరిన్ని కొత్త ప్లాంట్ల ఏర్పాట్లకు ఉన్న అవకాశాలపై నివేదిక ఇవ్వాలన్నారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న విద్యుత్‌ప్లాంట్ల పనులను మరింత వేగవంతం చేయాలని చెప్పారు. అదే సమయంలో విద్యుత్ దుర్వినియోగాన్ని అరికట్టే చర్యలు కూడా తీసుకోవాలన్నారు. విద్యుత్‌పై ప్రతి 15 రోజులకు ఒకసారి పూర్తిస్థాయి సమీక్ష నిర్వహిస్తామనీ, అధికారులు దానికి సిద్ధంగా ఉండాలని చెప్పారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు, నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, టీఎస్ ట్రాన్స్‌కో సీఎమ్‌డీ రిజ్వీ, టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ ముషార్రఫ్ ఫారూఖీ, ముఖ్యమంత్రి కార్యాలయం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి. స్పెషల్ సెక్రటరీ అజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వారిలో 9 మంది కనబడుట లేదు

(మొదటిపేజి తరువాయి)

క్రితమే ఇంటి నుండి వెళ్లాడని తండ్రి చెప్పారు. అయితే అతనిని సుప్రీం తీర్పు రాకముందు తాము చూశామని చుట్టుపక్కల వారు, దుకాణాల యజమానులు తెలిపారు. చాలా మంది ముద్దాయిల ఆచూకీ తెలిపేందుకు పొరుగు వారు నిరాకరించారు. 'మీకు వారు కనిపించరు. వారందరూ ఇళ్లకు తాళం వేసి వెళ్లిపోయారు' అని ఓ వ్యక్తి చెప్పాడు. తాళం వేసిన ముద్దాయిల ఇళ్ల ముందు కానిస్టేబుల్‌ను నియమించారు. ఈ కేసులో మరో ముద్దాయి ప్రదీప్ మోదియా ఆ చిరునామాలోనే లేడు. ఇంకో ముద్దాయి రమేష్ చందన ఇచ్చిన చిరునామాలో ఉండడం లేదని, ఇప్పుడు గోద్రాలో ఉంటున్నాడని పొరుగువారు తెలిపారు. రాధేశ్యామ్ పొరుగునే ఉండే ముద్దాయిలు శైలేష్ భట్, మితేష్ భట్ కూడా కన్పించడం లేదు. వారి గురించి చెప్పేందుకు రాధేశ్యామ్ కుటుంబం ఇష్టపడలేదు. ఈ కేసులో ఇతర ముద్దాయిలైన రాజూభాయ్ సోనీ, కేసర్‌భాయ్ ఒహానియా, బాకాబాయ్ ఒహానియా, బిపిన్‌చంద్ర జోషి కూడా ఇచ్చిన చిరునామాలలో లేరు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించండి

- ఏపీలో ఎస్మాను ఎత్తేయండి
- ఏపీ, మహారాష్ట్ర సీఎంలకు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ లేఖలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలను పరిష్కరించాలనీ, వారిపై ఏపీలో ప్రయోగించిన ఎస్మాను ఎత్తేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి, అధ్యక్షులు కె.సునీత, కోశాధికారి మంగ డిమాండ్ చేశారు. బుధవారం ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్‌షిండేకు వారు లేఖలు రాశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు కనీస వేతనం, గ్రాట్యూటీ, తదితర బెనిఫిట్స్ ఇవ్వాలని డిసెంబర్ మూడో తేదీ నుంచి సమ్మె చేస్తున్నా మహారాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఏపీలో డిసెంబర్ 12 నుంచి లక్షకుపైగా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సమ్మె చేస్తున్నారని తెలిపారు.

కుర్రాళ్లకు సదవకాశం

నేడు ఆఫ్ఘనిస్తాన్‌తో తొలి టి20

రాత్రి 7.00గం॥లకు



మొహాలి : దక్షిణాఫ్రికా పర్యటనను దిగ్విజయంగా ముగించిన టీమిండియా స్వదేశంలో ఆఫ్ఘనిస్తాన్‌తో టి20 సిరీస్‌కు సిద్ధమైంది. ఐసిసి టి20 ప్రపంచకప్‌కు ముందు జరిగే ఆఖరి అంతర్జాతీయ సిరీస్ కూడా ఇదే కావడంతో యువ క్రికెటర్ల ప్రదర్శనపైనే బిసిసిఐ ప్రధానంగా దృష్టి సారించింది. ఆఫ్ఘనిస్తాన్‌తో మూడు టి20ల సిరీస్‌లో భాగంగా గురువారం పంజాబ్‌లోని బింద్రా స్టేడియంలో తొలి మ్యాచ్ జరగనుంది. దక్షిణాఫ్రికాతో వైట్‌బాల్ సిరీస్‌లకు దూరంగా రోహిత్ శర్మ విరాట్ కోహ్లితో ఈ సిరీస్‌లో బరిలో దిగనున్నారు. విరాట్ కోహ్లి వ్యక్తిగత కారణాల రీత్యా తొలి టి20కు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు బోర్డుకు తెలిపాడు. ఈ విషయాన్ని స్వయంగా భారత జట్టు హెడ్ కోచ్ రాహుల్ ద్రావిడే వెల్లడించాడు. పాత్రికేయులతో నిర్వహించిన ప్రీమ్యాచ్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ ద్రావిడ్ ఈ విషయాన్ని చెప్పాడు. వ్యక్తిగత కారణాలతోనే కోహ్లీ ఈ మ్యాచ్‌కు దూరమవుతున్నాడని, అయితే అతడు ఇండోర్‌తో ఈనెల 14న జరగబోయే రెండో మ్యాచ్‌కు అందుబాటులో ఉంటాడని తెలిపాడు. ఆఫ్గాన్‌తో సిరీస్‌కు రోహిత్ శర్మ ఇన్నింగ్స్‌ను ఆరంభిస్తాడని, అతడికి తోడు యశస్వి జైస్వాల్ ఇన్నింగ్స్‌ను ఓపెన్ చేస్తాడని తెలిపాడు. రైట్ హ్యాండ్, లెఫ్ట్ హ్యాండ్ కాంబినేషన్ వైపే టీమ్ మేనేజ్‌మెంట్ మొగ్గుచూపినట్లు తెలిపాడు. దీంతో 2022 టి20 ప్రపంచకప్‌లో ఆడిలైడ్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన సెమీఫైనల్ తర్వాత రోహిత్ టి20ల్లో బరిలోకి దిగనున్నాడు.

రషీద్‌ఖాన్ దూరం..



ఆఫ్ఘనిస్తాన్ స్టార్ స్పిన్నర్ రషీద్‌ఖాన్ భారత్‌తో జరిగే మూడు టి20ల సిరీస్‌కు దూరమయ్యాడు. వెన్నునొప్పికి ఆపరేషన్ చేయించుకున్న రషీద్ ఇంకా పూర్తిస్థాయిలో కోలుకోలేదని, అతడు ఈ సిరీస్ మొత్తానికి దూరమయ్యాడని కెప్టెన్ ఇబ్రహీం జద్రాన్ తెలిపాడు. అయితే సిరీస్ మొత్తానికి దూరమైనా రషీద్ మాత్రం జట్టుతో కలిసి భారత్‌కు వచ్చాడు. భారత పిచ్‌లపై అనుభవం ఉన్న రషీద్ లేకపోవడంతో ఆఫ్ఘన్ స్పిన్ దళాన్ని ముజీబ్ ఉర్ రెహ్మాన్, నూర్ అహ్మద్ నడిపించనున్నారు. వన్డే ప్రపంచకప్ తర్వాత లోయర్ బ్యాక్ పెయిన్‌తో ఇబ్బందిపడ్డ రషీద్.. ఇటీవలే సర్జరీ చేయించుకున్నాడు.

జట్లు(అంచనా)..

భారత్: రోహిత్(కెప్టెన్), జైస్వాల్, శుభ్‌మన్, తిలక్ వర్మ, రింకు సింగ్, సంజూ శాంసన్, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, అవేశ్ ఖాన్, కుల్దీప్, బిష్ణోయ్, ముఖేశ్ కుమార్.

ఆఫ్ఘనిస్తాన్: హజ్మతుల్లా గుర్బాజ్, జద్రాన్(కెప్టెన్), నజీబుల్లా, నబి, ఒమర్జాయ్, ముజీబ్, షరాఫుద్దీన్, ఖ్విజ్ అహ్మద్, నూర్ అహ్మద్/నవీన్, ఫారూఖీ.

నేపాల్ క్రికెటర్ సందీప్ లమిచానెకు జైలుశిక్ష



భూటాన్: నేపాల్ క్రికెటర్ సందీప్ లమిచానె జైలుపాలయ్యాడు. మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డ కేసులో లమిచానెను దోషిగా తేల్చిన నేపాల్ కోర్టు.. అతడికి ఎనిమిదేళ్ల జైలు శిక్షను ఖరారుచేసింది. 2022 ఆగస్టులో లమిచానె.. ఖాట్మాండులో 17ఏళ్ల బాలికపై లైంగికదాడికి పాల్పడ్డట్టు కేసు నమోదుకాగా సుమారు ఏడాదిన్నర విచారణ తర్వాత కోర్టు అతడిని దోషిగా తేల్చింది. జైలు శిక్షతో పాటు బాధితురాలికి నష్టపరిహారం కూడా చెల్లించాలని ఆదేశించింది. ఈ మేరకు షిషిర్ రాజ్ దకల్ నేతృత్వంలోని ధర్మాసనం తీర్పునిచ్చింది. 2018 వరకూ ఐపిఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరపున ఆడిన లమిచానె ఆ తర్వాత నేపాల్‌కు వలసవెళ్లాడు. బిగ్‌బాష్ లీగ్, పాకిస్తాన్ సూపర్ లీగ్‌తో పాటు కరేబియన్ ప్రిమియర్ లీగ్‌లలోనూ ఆడాడు. వన్డేలలో అత్యంత వేగంగా 50వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా ఘనత సాధించాడు. నేపాల్ తరపున 51వన్డేలు, 52టి20లు ఆడిన లమిచానె.. వన్డేలలో112 వికెట్లు, టీ20లలో 98 వికెట్లు పడగొట్టాడు. నేపాల్ జట్టుకు సారథిగానూ వ్యవహరించాడు.

జకో, స్వైటెక్‌కు టాప్ సీడింగ్

● ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్




మెల్‌బోర్న్: 2024 సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్ సీడింగ్‌ను నిర్వాహకులు గురువారం విడుదల చేశారు. పురుషుల సింగిల్స్‌లో సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్‌కు, మహిళల సింగిల్స్‌లో ఇగా స్వైటెక్(పోలండ్)కు టాప్ సీడింగ్ దక్కాయి. గ్రాండ్‌స్లామ్ నిర్వాహకులు సింగిల్స్‌లో మొత్తం 32మంది పురుషుల, మహిళల క్రీడాకారుల ర్యాంకింగ్స్‌ను విడుదల చేశారు. నేటినుంచి ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వాలిఫయింగ్ పోటీలు ముగియడంతో సీడింగ్ ప్రకటించారు. భారత్‌నుంచి సింగిల్స్‌లో ఆడే అవకాశం ఒక్కరికీ దక్కలేదు.

టాప్-10 సీడింగ్

1. నొవాక్ జకోవిచ్(సెర్బియా) 1. ఇగా స్వైటెక్(పోలండ్)
2. కార్లోస్ అల్కరాజ్(స్పెయిన్) 2. ఆర్యానా సబలెంకా
3. డానియెల్ మెద్వదెవ్
3.లెనా రైబకినా(కజకిస్తాన్)
4. జన్నిక్ సిన్నర్(ఇటలీ) 4. కోకా గాఫ్(అమెరికా)
5. ఆంద్రీ రుబ్లేవ్ 5. జెస్సికా(అమెరికా)
6. అలెగ్జాండర్ జ్వెరేవ్(జర్మనీ)
6.ఆన్స్ జబీర్(ట్యునీషియా)
7. స్టెఫానాస్ సిట్సిపాస్(గ్రీస్) 7. ఓంద్రుసోవా(చెక్)
8. హోల్గర్ రూనే(డెన్మార్క్) 8. మరియా సక్కారి(గ్రీస్)
9. రూబెర్ట్ హుర్కాజ్(పోలండ్)
9. బ్రబోరా క్రేజికోవా(చెక్)
10.అలెక్స్-డి-మినర్(ఆస్ట్రేలియా)
10.బీట్రిజ్ హద్దాడ్ మరియా(బ్రెజిల్)

టాప్-10లో విరాట్, రోహిత్

● ఐసిసి టెస్టు ర్యాంకింగ్స్



దుబాయ్ : అంతర్జాతీయ క్రికెట్‌మండలి(ఐసిసి) తాజా ర్యాంకింగ్స్‌లో విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ తమ తమ ర్యాంకింగ్స్‌ను మెరుగుపర్చుకున్నారు. విరాట్ కోహ్లి మూడు స్థానాలు ఎగబాకి 6వ స్థానానికి చేరుకున్నాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌లో టీమిండియా తరపున అత్యధిక పరుగులు చేసిన ఆటగాడు విరాట్ కోహ్లి. అతను నాలుగు ఇన్నింగ్స్‌లో 172 పరుగులు చేశాడు. దీంతో గతంలో ఉన్న 9వ ర్యాంకు నుంచి 775 పాయింట్లతో 6వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. ఇక కెప్టెన్ రోహిత్ శర్మ నాలుగు స్థానాలు ఎగబాకి టాప్-10లోకి దూసుకొచ్చాడు. గతంలో 14వ ర్యాంక్‌లో ఉన్న రోహిత్ శర్మ తాజా ర్యాంకింగ్స్‌లో 748 పాయింట్లతో 10వ స్థానానికి ఎగబాకాడు. ఐసీసీ టెస్ట్ ర్యాకింగ్స్ విభాగంలో తొలిస్థానంలో కేన్ విలియమ్సన్ (864 పాయింట్లు) నిలిచాడు. జో రూట్ (859), స్టీవ్ స్మిత్ (818 పాయింట్లు), మార్నస్ లబూషేన్ (802 పాయింట్లు), డారిల్ మిచెల్ (786 పాయింట్స్) టాప్ ఫైవ్ బ్యాటర్లుగా నిలిచారు. బౌలింగ్ విభాగంలో టీమిండియా స్పిన్నర్ అశ్విన్ అగ్రస్థానాన్ని నిలబెట్టుకోగా.. దక్షిణాఫ్రికాతో రెండో టెస్టులో 6/15తో భారత పేసర్ మహ్మద్ సిరాజ్ 13స్థానాలు ఎగబాకి 17వ ర్యాంకుకు చేరుకున్నాడు. జస్ప్రీత్ బుమ్రా 4వ స్థానానికి చేరుకోగా.. ఆస్ట్రేలియన్ కెప్టెన్ పాట్ కమ్మిన్స్ సౌతాఫ్రికా ప్లేయర్ రబాడను వెనక్కి నెట్టి రెండో స్థానానికి చేరుకున్నాడు. జాష్ హెజిల్ వుడ్ నాలుగు స్థానాలను మెరుగుపర్చుకొని జేమ్స్ ఆండర్సన్‌తో కలిసి ఏడో స్థానంలో నిలిచాడు.



కిదాంబి సంచలనం

● తొలిరౌండ్‌లో 5వ ర్యాంకర్ క్రిస్టీపై గెలుపు
● రెండో రౌండ్‌కు సాత్విక్-చిరాగ్ జోడి
● మలేషియా ఓపెన్ సూపర్-1000

కౌలాలంపూర్: మలేషియా ఓపెన్ సూపర్-1000లో హైదరాబాద్ స్టార్ షట్లర్, మాజీ నంబర్‌వన్ ఆటగాడు కిదాంబి శ్రీకాంత్ పెను సంచలనాన్ని నమోదు చేశాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 24వ ర్యాంకర్ శ్రీకాంత్ 12-21, 21-18, 21-16తో ప్రపంచ ఐదో ర్యాంకర్ జొనాథన్ క్రిస్టీ(ఇండోనేసియా)పై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. రెండో రౌండ్‌లో లాంగ్-అంగుస్(హాంకాంగ్)తో శ్రీకాంత్ తలపడనున్నాడు. డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ శెట్టి రెండోరౌండ్‌లోకి దూసుకెళ్లారు. గురువారం జరిగిన పురుషుల డబుల్స్‌లో 2వ ర్యాంక్ జోడీ సాత్విక్-చిరాగ్ జోడీ శుభారంభం చేశారు. తొలిరౌండ్ పోటీలో సాత్విక్-చిరాగ్ 21-18, 21-19తో మహ్మద్ షోహిబుల్, మౌలానా బగస్(మలేషియా)పై పోరాడి నెగ్గారు. ఈ మ్యాచ్‌ను భారత జోడీ కేవలం 44 నిమిషాల్లోనే ముగించింది. 2వ రౌండ్‌లో చైనా, థాయ్‌లాండ్ డబుల్స్ మ్యాచ్ విజేతతో తలపడనున్నారు. ఇక మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా(భారత్) జోడీ 21-13, 21-16తో ఫ్రాన్సెస్కా కోర్బి-అలీసన్ లీ(అమెరికా) జంటపై నెగ్గి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది. ప్రపంచ 8వ ర్యాంకర్ హెచ్‌ఎస్ ప్రణయ్ రాయ్ 14-21, 11-21 తేడాతో డెన్మార్క్ ప్లేయర్ అండర్ అంటోన్సెన్ చేతిలో ఓటమి పాలైన సంగతి తెలిసిందే.

మేం శత్రువులం కాదు..

హర్మన్‌ప్రీత్‌పై అలీసా ఆసక్తికర వ్యాఖ్యలు



మెల్‌బోర్న్: "క్రికెట్ అంటే పోటీ ఉండే గేమ్. మైదానంలో మా ఇద్దరి పాత్రలు వేరు. మా దేశాలను గెలిపించేందుకు కెప్టెన్లుగా మేం చేయాల్సింది చేస్తాం. ఇదంతా అక్కడి వరకే. ఒక్కసారి మైదానం వెలుపలికి వచ్చామంటే మా మధ్య ఏమీ ఉండదు. అందరూ అనుకుంటున్నట్టు మేం శత్రువులం కాదు" అని మైదానంలో తనపై హర్మన్‌ప్రీత్ విసిరిన బంతి గురించి విలేకరులు అడిగిన ప్రశ్నపై హీలీ స్పందించింది. భారత్‌లో ఆస్ట్రేలియా మహిళా జట్టు పర్యటన ముగిసింది. ఏకైక టెస్టులో టీమ్‌ఇండియా విజయం సాధించగా.. వన్డేలు, టీ20ల సిరీస్‌లను ఆసీస్ కైవసం చేసుకుంది. కంగారూల జట్టు మూడో టీ20 మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను చేజిక్కించుకున్న విషయం తెలిసిందే.



అశోక్ గల్లా, వారణాసి మానస

మరో మురారిలాంటి సినిమా

దేవకీ నందన వాసుదేవ


తన తొలి చిత్రం 'హీరో'తో ఆకట్టుకున్న సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేష్ బాబు మేనల్లుడు అశోక్ గల్లా తన రెండవ సినిమాను 'గుణ 369' ఫేమ్ అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో చేస్తున్నారు. లలితాంబిక ప్రొడక్షన్స్‌లో ప్రొడక్షన్ నెం. 1గా ఎస్ఆర్‌ఐ (ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్) సోమినేని బాలకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నల్లపనేని యామిని సమర్పిస్తున్నారు.

మేకర్స్ బుధవారం సినిమా టైటిల్‌ను అనౌన్స్ చేయటంతోపాటు టీజర్‌ను కూడా విడుదల చేశారు. ఈ చిత్రానికి 'దేవకీ నందన వాసుదేవ' అనే టైటిల్ పెట్టారు. కథానాయకుడి పాత్రతో పాటు సినిమా ప్రిమైజ్ కూడా పరిచయం చేసేలా టీజర్ ఉంది.

టీజర్ లాంచ్ ఈవెంట్‌లో అశోక్ గల్లా మాట్లాడుతూ,'టీజర్ అందరికీ నచ్చడం చాలా ఆనందంగా ఉంది. ఎన్నో పెద్ద సినిమాలకు మాటలు రాసిన సాయి మాధవ్ మా సినిమాకి పని చేయడం విశేషం. మూడు నాలుగు సినిమాల తర్వాత ఇంత మాస్ సినిమా చేయాలని అనుకున్నాను. కానీ బాల నన్ను ఇలా ప్రజెంట్ చేసే అవకాశం ఇచ్చారు. ఆయన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని భావిస్తున్నాను. ప్రశాంత్ వర్మ అద్భుతమైన కథ ఇచ్చారు. మానస చాలా అద్భుతంగా నటించింది. ఈ సినిమా నుంచి రాబోతున్న మిగతా కంటెంట్ కూడా మిమ్మల్ని అలరిస్తుంది' అని తెలిపారు.

'అర్జున్ ఈ కథ చెప్పినప్పుడు అద్భుతంగా అనిపించింది. ఇది నా మొదటి సినిమా. అందరూ చాలా సపోర్ట్ చేశారు' అని నాయిక మానస వారణాసి చెప్పారు. దర్శకుడు అర్జున్ జంధ్యాల మాట్లాడుతూ,'నిర్మాత బాలకృష్ణకి, నన్ను నమ్మి ఫ్రీడమ్‌తో పాటు ఈ కథ ఇచ్చిన ప్రశాంత్ వర్మకి థ్యాంక్స్. అందరూ అవుట్ పుట్ చూసి చాలా హ్యాపీగా ఫీలయ్యారు, బీమ్స్ ఇచ్చిన మ్యూజిక్ పెద్ద హిట్ అవుతుంది. ఇది చాలా కొత్త సినిమా. అన్ని కమర్షియల్ విలువలు ఉండే సినిమా. 'మురారి' తరహా సినిమా. తప్పకుండా అందరికీ నచ్చుతుంది' అని అన్నారు.

నిర్మాత సోమినేని బాలకృష్ణ మాట్లాడుతూ, 'నా కుటుంబం, ప్రశాంత్ వర్మ, అశోక్ సపోర్ట్ ఉండబట్టే ఈ చిత్రాన్ని ఇంత భారీ బడ్జెట్‌తో తీయగలిగాను. ఇది విజువల్ వండర్‌గా ఉంటుంది. ఈ సినిమా విజయం సాధించి మంచి డబ్బులు వస్తే ఆ డబ్బులని మళ్ళీ సినిమా పరిశ్రమలోనే పెడతాను. సినిమా అంటే నాకు అంత ఇష్టం' అని చెప్పారు. ఈ వేడుకలో చిత్ర యూనిట్ సభ్యులతోపాటు దర్శకుడు ప్రశాంత్ వర్మ, రచయిత సాయిమాధవ్ బుర్రా పాల్గొన్నారు.



పృథ్వీరాజ్ సుకుమారన్

వాస్తవ ఘటనల ఆధారంగా

ది గోట్ లైఫ్

మలయాళ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్న కొత్త సినిమా 'ది గోట్ లైఫ్' (ఆడు జీవితం). హాలీవుడ్ యాక్టర్ జిమ్మి జీన్ లూయిస్, అమలాపాల్, కేఆర్ గోకుల్, అరబ్ ఫేమస్ యాక్టర్స్ తాలిబ్ అల్ బలూషి, రిక్ ఆబే ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. బెన్యామిన్ రాసిన 'గోట్ డేస్' నవల ఆధారంగా ఈ సినిమాను డైరెక్టర్ బ్లెస్సీ రూపొందించారు.

విజువల్ రొమాన్స్ బ్యానర్ ఈ సినిమాను మలయాళ చిత్ర పరిశ్రమలో ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌గా భారీ బడ్జెట్‌తో నిర్మించింది. ఏప్రిల్ 10న ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో మలయాళంతో పాటు హిందీ, తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో బుధవారం ఈ సినిమా నుంచి పృథ్వీరాజ్ సుకుమారన్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను హీరో ప్రభాస్ రిలీజ్ చేసి, తన స్నేహితుడు పృథ్వీరాజ్ సుకుమారన్‌కు, మూవీ టీమ్‌కు ఆయన బెస్ట్ విషెస్ తెలియజేశారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ సుకుమారన్ మాట్లాడుతూ, 'నా ఫ్రెండ్ ప్రభాస్ చేతుల మీదుగా ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేసుకోవడం హ్యాపీగా ఉంది. ఈ ప్రాజెక్ట్ ఒప్పుకున్నప్పుడే ఈ సినిమా కోసం ఎంత కష్టపడాల్సి వస్తుంది అనేది నాకు తెలుసు. ఐదేళ్ల ఈ సినిమా కోసం కేటాయించాను. మానసికంగా, శారీరకంగా నజీబ్ క్యారెక్టర్‌లా మారిపోయాను. ఎన్నో సవాళ్లు ఎదుర్కొని ఈ మూవీ కోసం రాజీ లేకుండా కష్టపడ్డాను. ఈ సినిమాకు పనిచేస్తున్నప్పుడు మేము ఎంతగా ఎంజాయ్ చేశామో, రేపు థియేటర్స్‌లోనూ ప్రేక్షకులు కూడా అంతే హ్యాపీగా ఫీలవుతారు' అని చెప్పారు. 90వ దశకంలో జీవనోపాధి వెతుక్కుంటూ కేరళను వదిలి విదేశాలకు వలస వెళ్లిన నజీబ్ అనే యువకుడి జీవిత కథను వాస్తవ ఘటనల ఆధారంగా ఇందులో చూపించబోతున్నారు. ఇది పూర్తిస్థాయిలో ఎడారిలో రూపొందుతున్న తొలి భారతీయ సినిమా కావడం విశేషం.

నవచిత్రం

ఫిబ్రవరి 9న రిలీజ్‌కి రెడీ



కావ్యాథాపర్, సందీప్ కిషన్, వర్షబొల్లమ్మ

హీరో సందీప్ కిషన్, డైరెక్టర్ విఐ ఆనంద్ కాంబోలో రూపొందిన ఫాంటసీ అడ్వెంచర్ 'ఊరు పేరు భైరవకోన'. హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా నిర్మిస్తుండగా, ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర సమర్పిస్తున్నారు. బాలాజీ గుత్తా ఈ చిత్రానికి సహ నిర్మాత.

ఈ చిత్ర రిలీజ్ డేట్‌కి సంబంధించిన అప్‌డేట్‌ని బుధవారం మేకర్స్ ఇచ్చారు. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 9న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్లు అనౌన్స్ చేశారు. సందీప్ కిషన్ మంత్రదండం పట్టుకుని కనిపించిన రిలీజ్ డేట్ పోస్టర్ చాలా క్యూరియాసిటీని పెంచింది.

ఇందులో సూపర్ నేచురల్ ఎలిమెంట్స్ ఉన్నాయని, టీజర్ సినిమా ప్రిమైజ్‌ని అద్భుతంగా ప్రజెంట్ చేసింది. ఈ చిత్రానికి శేఖర్ చంద్ర సంగీతం అందించారు. మొదటి రెండు పాటలు- నిజమే నే చెబుతున్నా, హమ్మా హమ్మా ఇప్పటికే చార్ట్‌బస్టర్‌గా నిలిచాయి.

వర్ష బొల్లమ్మ, కావ్యా థాపర్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి రాజ్ తోట సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఛోటా కె ప్రసాద్ ఎడిటర్, ఎ రామాంజనేయులు ఆర్ట్ డైరెక్టర్. భాను భోగవరపు, నందు సవిరిగాన ఈ చిత్రానికి సంభాషణలు అందిస్తున్నారు.

'సందీప్ కిషన్, విఐ ఆనంద్ కాంబినేషన్‌కి పరిశ్రమలో మంచి క్రేజ్ ఉంది. వీరిద్దరి కలయికలో వస్తున్న సినిమా కావడంతో అందరిలో భారీ అంచనాలు ఉన్నాయి. ఆ అంచనాలకు దీటుగా సినిమా ఉంటుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. సరికొత్త కథతో ఎవ్వరూ ఊహించని మలుపులతో సాగే ఈ ఫాంటసీ అడ్వెంచర్ సినిమా ప్రతి ఒక్కరినీ విశేషంగా అలరిస్తుంది విజువల్స్ ఆహా అనేలా ఉంటాయి. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేసేలా ఉండే ఈ చిత్రం ఈ ఏడాది విజయవంతమైన చిత్రాలుగా నిలిచే వాటిల్లో కచ్చితంగా నిలుస్తుంది. ఫిబ్రవరి 9న ఈ సినిమాని విడుదల చేస్తున్నారు' అని చిత్ర బృందం తెలిపింది.



సంక్రాంతికి వస్తే బ్లాక్‌బస్టరే : మహేష్‌బాబు

'గుంటూరు కారం' కోసం సూపర్ స్టార్ మహేష్ బాబు, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ముచ్చటగా మూడోసారి చేతులు కలిపారు. అతడు, ఖలేజా వంటి కల్ట్ క్లాసిక్ సినిమాల తర్వాత వారి కలయికలో వస్తున్న మూడో చిత్రమిది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ(చినబాబు) నిర్మించారు. శ్రీలీల, మీనాక్షి చౌదరి కథానాయికలుగా నటించిన ఈ చిత్రానికి ఎస్.తమన్ సంగీతం అందించారు. భారీ అంచనాల నడుమ సంక్రాంతి కానుకగా ఈనెల 12న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం గుంటూరులోని నంబూరు క్రాస్ రోడ్స్‌లో అభిమానుల కోలాహలం సమక్షంలో ప్రీ రిలీజ్ వేడుకను వైభవంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా మహేష్ బాబు మాట్లాడుతూ, 'మీరు ఒక కొత్త మహేష్ బాబుని చూడబోతున్నారు. దానికి కారణం త్రివిక్రమ్. మా నిర్మాత చినబాబు ఇచ్చిన సపోర్ట్ నేను ఎప్పటికీ మర్చిపోలేను. శ్రీలీల గురించి చెప్పాలంటే.. చాలారోజుల తర్వాత ఒక తెలుగమ్మాయి పెద్ద హీరోయిన్ కావడం చాలా ఆనందంగా ఉంది. హార్డ్ వర్క్ చేసే డెడికేటెడ్ ఆర్టిస్టులలో ఆమె ఒకరు. మీనాక్షి మా సినిమాలో ప్రత్యేక పాత్ర చేసింది. అలాగే తమన్ ఎప్పుడూ తన బెస్ట్ ఇస్తాడు. నాకు, నాన్నకి సంక్రాంతి బాగా కలిసొచ్చిన పండగ. మా సినిమా సంక్రాంతికి రిలీజ్ అయితే అది బ్లాక్ బస్టరే. ఈసారి కూడా బాగా గట్టిగ కొడతాం' అని తెలిపారు.

'ఈరోజు గుంటూరు రావడానికి రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి ఈ సినిమా పేరు గుంటూరు కారం. రమణగాడు మీ వాడు, మనందరి వాడు. అందుకని మీ అందరి మధ్యలో ఈ ఫంక్షన్ చేయాలని అనుకున్నాం. ఈ సంక్రాంతిని చాలా గొప్పగా జరుపుకుందాం. ఆనందంగా జరుపుకుందాం. రమణగాడితో కలిసి జరుపుకుందాం' అని దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ చెప్పారు.

హను-మాన్‌లో అంజమ్మగా అలరిస్తా..



వరలక్ష్మి శరత్‌కుమార్

ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రూపొందిన సినిమా 'హను-మాన్'. తేజ సజ్జ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రాన్ని ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై కె నిరంజన్ రెడ్డి నిర్మించగా, శ్రీమతి చైతన్య సమర్పించారు. సంక్రాంతి కానుకగా ఈనెల 12న విడుదలౌతుంది.

ఈ నేపథ్యంలో ఈ సినిమాలో కీలక పాత్ర పోషించిన నటి వరలక్ష్మీ శరత్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ, 'ప్రశాంత్ వర్మ ఈ కథ చెప్పినపుడు చాలా నచ్చింది. తప్పకుండా చేయాలనే ఫీలింగ్ కలిగింది. ఇందులో తేజకి అక్క పాత్రలో కనిపిస్తాను. బ్రదర్, సిస్టర్ మధ్య ఉండే సరదా సన్నివేశాలు మంచి వినోదాన్ని పంచుతాయి. చాలా క్యూట్‌గా ఉంటాయి. ప్రేక్షకులు చాలా బాగా కనెక్ట్ అవుతారు. ఇది సూపర్ హీరో ఫిల్మ్. ఇందులో తేజ సూపర్ హీరో. నేను కూడా ఒక యాక్షన్ సీక్వెన్స్ చేశాను. ఒక మాస్ హీరోకి ఉన్నంత ఎలివేషన్ వుండే యాక్షన్ సీక్వెన్స్ అది. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. దర్శకుడు ఎంత అద్భుతంగా కథ చెప్పారో అంత అద్భుతంగా సినిమా తీశారు. ఆడియన్స్ నుంచి చాలా పాజిటివ్ ఎనర్జీ వస్తోంది. తేజ, ప్రశాంత్, నిర్మాత ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు. తప్పకుండా ఈ చిత్రం అద్భుతంగా అలరిస్తుందని ఆశిస్తున్నాను. వీరసింహారెడ్డి, క్రాక్, కోటబొమ్మాలి పీఎస్ చిత్రాల్లో నా పాత్రలకు గ్రే షేడ్ ఉంటుంది. హను-మాన్ లో చేస్తున్న అంజమ్మ పాత్ర కూడా భిన్నంగా ఉంటూ అందర్నీ కచ్చితంగా అలరిస్తుంది. ప్రీరిలీజ్ ఈవెంట్‌లో చిరంజీవి నన్ను అభినందించడం చాలా గొప్ప ఆనందాన్ని ఇచ్చింది. ఇన్నాళ్ళు పడిన కష్టానికి ఒక అవార్డ్‌లా అనిపించింది. ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతూ మెసేజ్ చేశాను' అని తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar. TELTEL/2014/59462.

కౌంట్‌డౌన్



భారత బడ్జెట్ 2024లో ఎలా ఉండబోతోంది..?

- మధ్యంతర బడ్జెట్ గణాంకాలపైనే అందరి దృష్టి

మోడీ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రవేశపెట్టనున్న భారత బడ్జెట్..2024పై దేశప్రజల దృష్టి కేంద్రీకృతమైంది.తొమ్మిదేండ్లుగా ప్రవేశపెట్టిన బడ్జెట్లు కేవలం కార్పొరేట్ వర్గాలకే ఊరట నిచ్చాయన్నది నూటికి నూరుపాళ్లు నిజమని ఆర్థిక నిపుణులు అంటున్నారు. మధ్యంతర బడ్జెట్‌లో కీలకమైన రంగాలు, కేటాయింపుల వైపే ఆసక్తి చూపుతున్నారు.

న్యూఢిల్లీ : బడ్జెట్‌కు ఒక నెల కంటే తక్కువ సమయం ఉన్నది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న తన ఆరో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఇది ఓట్ ఆన్ అకౌంట్ అవుతుంది. లోక్‌సభ ఎన్నికల తర్వాత పూర్తి బడ్జెట్ (కేంద్ర బడ్జెట్ 2024) సమర్పించనున్నారు. ఏప్రిల్, మే నెలల్లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. దీని తర్వాత ఏర్పాటయ్యే కొత్త ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి పూర్తి బడ్జెట్‌ను ప్రవేశపెడుతుంది. మధ్యంతర బడ్జెట్‌లో మోడీప్రభుత్వం పెద్దగా ప్రకటనలు చేయదని నిపుణులు చెబుతున్నారు. ఇది ఆదాయపు పన్ను నిబంధనలలో పెద్ద మార్పులను నివారిస్తుంది. కానీ, ఈ బడ్జెట్‌లో ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన ముఖ్యమైన డేటా ఉంటుందని సంకేతాలిస్తోంది. బడ్జెట్‌లో కీలక రంగాలు, కేటాయింపులు ఉంటాయి. అయితే ముఖ్యమైన కొన్నింటిని పరిశీలిద్దాం..

ఆర్థిక వ్యవస్థకు ద్రవ్య లోటు గణాంకాలు చాలా ముఖ్యమైనవి. ప్రభుత్వ ఆర్థిక లోటు ఎంత తగ్గితే అంత మంచిది. ప్రతి సంవత్సరం కేంద్ర బడ్జెట్‌లో వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక లోటు లక్ష్యాన్ని ప్రభుత్వం ప్రకటిస్తుంది. ఫిబ్రవరి 1, 2023 న సమర్పించిన బడ్జెట్‌లో, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ద్రవ్య లోటును 5.9 శాతానికి ప్రకటించారు. ద్రవ్యలోటు ఈ లక్ష్యానిక నుగుణంగానే ఉంటుందని అంచనా. 2022-23 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో ప్రభుత్వం 6.4 శాతం ఆర్థిక లోటును లక్ష్యంగా పెట్టుకుంది. ఫిబ్రవరి 1, 2024న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక లోటు లక్ష్యాన్ని ప్రకటిస్తారు.

జీడీపీ అంచనా

కేంద్ర బడ్జెట్‌లో జీడీపీ నామమాత్రపు వృద్ధిని ప్రభుత్వం ప్రకటించింది. ఇది వచ్చే ఆర్థిక సంవత్సరానికి జరుగుతుంది. ఆర్థిక వ్యవస్థకు సంబంధించి ప్రభుత్వ అంచనా ఏమిటో ఇది తెలియజేస్తోంది. ద్రవ్యోల్బణం కోసం సర్దుబాటు చేసినప్పుడే జీడీపీ వాస్తవ వృద్ధి ఎంతో తెలుస్తోంది. ఫిబ్రవరి 1, 2023న సమర్పించిన బడ్జెట్‌లో జీడీపీ నామమాత్రపు వృద్ధిని 10 శాతంగా ప్రభుత్వం అంచనా వేసింది.

బడ్జెట్ పరిమాణం

ఏప్రిల్, మే నెలల్లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నందున ఈసారి బడ్జెట్ పరిమాణం పెద్దదిగా ఉంటుందని భావిస్తున్నారు. ఓటర్లను ఆకట్టుకునేలా తాయిలాలు ప్రకటించే అవకాశాలు లేకపోలేదని కేంద్రం లీకులు ఇస్తోంది. దీన్ని పరిగణనలోకి తీసుకుంటే సామాజిక పథకాలపై వ్యయాన్ని పెంచనున్నది. ప్రభుత్వం కొత్త పథకాన్ని ప్రకటించవచ్చు. ఇలా చేయడం వల్ల బడ్జెట్ పరిమాణం పెరుగుతుంది. 2019 మధ్యంతర బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజనను ప్రకటించింది. ఫిబ్రవరి 1, 2023న సమర్పించిన కేంద్ర బడ్జెట్ పరిమాణం రూ. 45 లక్షల కోట్లు. ఈసారి ఈ సంఖ్య రూ.50 లక్షల కోట్లు దాటవచ్చు.

మూలధన వ్యయం

వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ మూలధన వ్యయం ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఆర్థిక వ్యవస్థ వేగాన్ని పెంచేందుకు మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తుండటమే ఇందుకు కారణం. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ మూలధన వ్యయం రూ.10 లక్షల కోట్లకు పైగా ఉంది.

ఇది ఆర్థిక వృద్ధిపై ప్రభావం చూపింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి మూలధన వ్యయం కోసం ప్రభుత్వం రూ.7 లక్షల కోట్లకు పైగా లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర బడ్జెట్‌లో, ప్రభుత్వ మూలధన వ్యయం గణాంకాలపై దృష్టి పెట్టొచ్చు.

పెట్టుబడుల ఉపసంహరణ

ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రూ.51,000 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. కానీ ఇప్పటి వరకు రూ.10,051 కోట్లు మాత్రమే వచ్చాయి. పెట్టు బడుల ఉపసంహరణ లక్ష్యాన్ని చేరుకోలేకపోయిందని మోడీ సర్కార్ తెగ తర్జనభర్జన పడుతోంది. యూపీఏ ప్రభుత్వం విక్రయించిన దానికి మించి కేంద్రంలోని బీజేపీ సర్కార్ హెూల్‌సేల్‌గా ప్రభుత్వరంగసంస్థలను బేరానికి పెట్టిందని ఆర్థిక నిపుణులు అంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో పెట్టుబడుల ఉపసంహరణకు ప్రభుత్వం ఏ లక్ష్యాన్ని నిర్దేశిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

షిండే గ్రూపే అసలైన శివసేన

- మహారాష్ట్ర స్పీకర్ తీర్పు



ముంబయి: మహారాష్ట్రలో శివసేన చీలికపై ఆ రాష్ట్ర స్పీకర్ ఊహించినట్టుగానే తీర్పు ఇచ్చారు. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే గ్రూపే అసలైన శివసేన అని రాష్ట్ర స్పీకర్ రాహుల్ నర్వేకర్ బుధవారం తీర్పు ఇచ్చారు. శివసేన ఎమ్మెల్యేల్లో చీలికకు సంబంధించి ఉద్ధవ్ ఠాక్రే, షిండే గ్రూపుల పరస్పర ఫిర్యాదుల నేపథ్యంలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు బుధవారం స్పీకర్ తన నిర్ణయాన్ని ప్రకటించారు. షిండే గ్రూపులోనే మెజార్టీ ఎమ్మెల్యేలు ఉన్నారన్న స్పీకర్.. ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరతూ దాఖలైన పిటిషన్లన్నింటినీ తిరస్కరించారు. అలాగే, శివసేన పార్టీ 2018 రాజ్యాంగాన్ని పరిగణించాలన్న ఉద్ధవ్ గ్రూపు అభ్యర్థనను స్పీకర్ తోసిపుచ్చారు. ఎన్నికల కమిషన్‌కు 1999లో సమర్పించిన ఆ పార్టీ రాజ్యాంగమే చెల్లుబాటవుతుందని తెలిపారు.

సుప్రీంకోర్టు వెళతాం : ఉద్ధవ్ ఠాక్రే

స్పీకర్ రాహుల్ నర్వేకర్ నిర్ణయంపై ఉద్ధవ్ ఠాక్రే తీవ్రస్థాయిలో స్పందించారు. స్పీకర్ నిర్ణయం సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించడమే కాకుండా ప్రజాస్వామ్యాన్ని హత్య చేసే కుట్రగా విమర్శించారు. స్పీకర్ నిర్ణయాన్ని శివసేన (యూబీటీ) గ్రూపు సుప్రీంకోర్టులో సవాల్ చేయనున్నట్టు చెప్పారు. "స్పీకర్ రాహుల్ నర్వేకర్ తీరు చూస్తే ఆయన కుమ్మక్కైనట్టు తేలిపోయింది. ఆయన ప్రకటించిన నిర్ణయం ప్రజాస్వామ్యాన్ని హత్య చేసే పన్నాగమనే సందేహం నిన్ననే వ్యక్తం చేశాను. సుప్రీంకోర్టులో ధిక్కరణ కేసు వేయాలా.. లేదా అనేది చూస్తాం. ఒకవేళ మా పార్టీ రాజ్యాంగం చెల్లకపోతే.. మరి మమ్మల్ని ఎందుకు అనర్హులుగా ప్రకటించలేదు? సుప్రీంకోర్టులో న్యాయం జరుగుతుందన్న విశ్వాసం మాకు పూర్తిగా ఉంది. మహారాష్ట్ర ప్రజలకు, శివసేనకు సుప్రీంకోర్టులో పూర్తి న్యాయం జరుగుతుంది" అని ఉద్ధవ్ అన్నారు.

ఇది బిజెపి కుట్ర: సంజయ్ రౌత్

షిండే గ్రూపే అసలైన శివసేన అని స్పీకర్ రాహుల్ నర్వేకర్ వెల్లడించిన నిర్ణయంపై శివసేన (యూబీటీ) నేత, ఎంపి సంజయ్ రౌత్ స్పందించారు. 'ఇది బిజెపి కుట్ర. ఏదో ఒకరోజు బాలాసాహెబ్ ఠాక్రే ఏర్పాటు చేసిన శివసేనను అంతం చేయాలన్నది వారి కల అన్నారు. అయితే, ఈ ఒక్క నిర్ణయంతో శివసేన ముగిసిపోదని.. తాము సుప్రీంకోర్టులో తేల్చుకుంటాం' అని అన్నారు.

2022 జూన్‌లో ఏక్‌నాథ్ షిండే దాదాపు 50 మంది ఎమ్మెల్యేలతో శివసేనలో చీలిక తెచ్చి, బిజెపికి మద్దతు ప్రకటించారు. తరువాత బిజెపితో కలిసి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. జూన్ 30న ఏక్‌నాథ్ షిండే మహారాష్ట్ర కొత్త సీఎంగా నియమితులయ్యారు. ఈ పరిణామాలన్నింటిపై ఉద్ధవ్ గ్రూపు సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అలాగే ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై 2024 జనవరి 10లోగా నిర్ణయం తీసుకోవాలని డిసెంబర్ 15న మహారాష్ట్ర స్పీకర్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే స్పీకర్ రాహుల్ నర్వేకర్ తన నిర్ణయాన్ని ప్రకటించారు.

భూటాన్ ప్రధానిగా త్సెరింగ్ టోగ్బే ?

- నేషనల్ అసెంబ్లీ ఎన్నికల్లో పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ విజయం
- భారత ప్రధాని మోడీ అభినందనలు



థింపూ : మంగళవారం జరిగిన భూటాన్ పార్లమెంట్ ఎన్నికల్లో పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పిడిపి) విజయం సాధించింది. బుధవారం ఎన్నికల కమిషన్ అధికారికంగా వెలువరించిన ఫలితాల్లో మొత్తం 47 నేషనల్ అసెంబ్లీ సీట్లకు గానూ 30సీట్లను పిడిపి గెలుచుకోగా, భూటాన్ టెండరల్ పార్టీ 17 స్థానాలను కైవసం చేసుకుంది. కాగా, లిబరల్ పిడిపి అధ్యక్షుడు త్సెరింగ్ టోగ్బే రెండోసారి ప్రధాని పదవిని చేపట్టనున్నారు. తొలుత 2013 నుండి 2018 వరకు ఆయన ప్రధానిగా చేశారు. 2008లో మొదటిసారిగా భూటాన్ పార్లమెంట్ ఏర్పడినపుడు టోగ్బే ప్రతిపక్ష నేతగా వున్నారు. స్థూల జాతీయాభివృద్ధి కన్నా స్థూల జాతీయ ఆనందానికే ప్రాధాన్యతనిస్తూ సుదీర్ఘంగా అనుసరిస్తూ వచ్చిన భూటాన్ విధానాన్ని ప్రశ్నించేలా ఈసారి తీవ్ర ఆర్థిక సవాళ్ళు ఎన్నికల్లో ముఖ్య పాత్ర పోషించాయి. యువతలో నిరుద్యోగం రేటు 29శాతంగా వుండగా, గత ఐదేళ్ళుగా సగటున ఆర్థిక వృద్ధి రేటు 1.7శాతంగా వుంది. ప్రజల సంతోషం, సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తామని టోగ్బే హామీ ఇచ్చారు.

కాగా భూటాన్ కీలక వాణిజ్య భాగస్వామి అయిన భారత్ ప్రధాని నరేంద్ర మోడీ, టోగ్బేకు అభినందనలు తెలియచేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. మోడీకి కృతజ్ఞతలు చెబుతూ, రైలు మార్గాలను అభివృద్ధిపరుచుకోవడంతో సహా భారత్‌తో సంబంధాలను మెరుగుపరుచుకోవడానికి కృషి చేస్తామని టోగ్బే హామీ ఇచ్చారు. ఇరు దేశాల మధ్య గల విశిష్ట స్నేహ సంబంధాలను, సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి తాను కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు టోగ్బే బుధవారం ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

చాంగ్-6 లూనార్ మిషన్‌కు చకచకా జరుగుతున్న ఏర్పాట్లు

- ప్రయోగ వేదిక వద్దకు చేరుకున్న రోదసీ నౌక విడిభాగాలు

బీజింగ్ : ఈ ఏడాది మొదటి అర్థభాగంలో చాంగ్-6 లూనార్ మిషన్‌ను ప్రారంభించడానికి చైనా జాతీయ రోదసీ సంస్థ (సిఎన్ఎస్ఎ) సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చకా చకా పూర్తవుతున్నాయి. అంతరిక్ష నౌక విడి భాగాలు సోమ, మంగళవారాల్లో రెండు రవాణా విమానాల్లో హైనన్ ప్రావిన్స్‌లోని వెన్‌చాంగ్ రోదసీ ప్రయోగ వేదిక వద్దకు చేరుకున్నాయని గ్లోబల్ టైమ్స్ పేర్కొంది. చంద్రునిపై అన్వేషణలో భాగంగా నాల్గో దశ కార్యక్రమాల్లో భాగంగా ఇవన్నీ జరుగుతున్నాయని సిఎన్ఎస్ఎ పేర్కొంది. ప్రయోగ వేదిక వద్ద అన్ని సదుపాయాలు చక్కగా వున్నాయని, అనుకున్న ప్రణాళిక ప్రకారమే కావాల్సిన ఏర్పాట్లు జరుగుతున్నాయని, ఈ ఏడాది మొదటి అర్థభాగంలో చాంగ్-6ను ప్రయోగించనున్నట్లు సిఎన్ఎస్ఎ తెలిపింది. చంద్రుని తిరోగమన కక్ష్య రూపకల్పన, నియంత్రణలో కొత్త పుంతలు తొక్కాలన్నది చాంగ్-6 మిషన్ లక్ష్యంగా వుంది. చంద్రుని ఆవల వైపు నుండి నమూనాలు సేకరించడం, చంద్రుని ఉపరితలంపై దిగడం వంటి లక్ష్యాలు కూడా ఈ మిషన్‌లో వున్నాయి. రోదసీ నౌక చంద్రునిపై దిగే ప్రాంతం శాస్త్రీయ అన్వేషణ కూడా దీనితో పాటు కొనసాగుతుందని సిఎన్ఎస్ఎ తెలిపింది.

గాజాలో ఒకే రోజు 147మంది పాలస్తీనియన్లు మృతి

- సురక్షిత జోన్‌లనూ విడిచిపెట్టని ఇజ్రాయిల్ బలగాలు
- ఆస్పత్రుల్లో పరిస్థితులు దారుణం : రెడ్‌క్రాస్
- అబ్బాస్‌తో బ్లింకెన్ భేటీ



గాజా : సెంట్రల్, దక్షిణ గాజాల్లో ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న ముమ్మర దాడుల్లో మంగళవారం నాడు 147మంది పాలస్తీనియన్లు మరణించారు. వీరిలో రఫా నగరంలోని ఒకే కుటుంబానికి చెందిన 15మంది కూడా వున్నారు. ఒకప్పుడు సురక్షిత జోన్ అని ప్రకటించిన రఫా నగరంలో కూడా ఇజ్రాయిల్ భీకరంగా దాడులకు దిగుతోంది. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో ఇజ్రాయిల్ బలగాలు వరుస దాడులు చేపడుతున్నాయి. పేలుడు పదార్థాలతో పాలస్తీనా ఫైటర్లను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఇదిలావుండగా, రమల్లా నగరంలో అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్, పాలస్తీనా అథారిటీ అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంపై అమెరికా విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. గాజాలో పౌరులకు జరుగుతున్న నష్టాన్ని తగ్గించేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై బ్లింకెన్ చర్చించారని, అలాగే మానవతా సాయాన్ని ఎలాంటి ఆటంకాలు లేకుండా అందచేయడం కూడా వేగంగా సాగాలని కోరినట్లు ఆ ప్రకటన పేర్కొంది. రెండు దేశాల ఏర్పాటు దిశగా స్పష్టమైన చర్యలు తీసుకోవడానికి అమెరికా మద్దతిస్తుందని విదేశాంగ శాఖ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ చెప్పారు. ఇప్పటివరకు ఇజ్రాయిల్ దాడుల్లో 23,357మంది మరణించగా, 59,410మంది గాయపడ్డారు.

సెంట్రల్ గాజాలోని డేర్ ఎల్ బాలాహ్‌లో అల్ అక్సా ఆస్పత్రికి సమీపంలోని ఇంటిపై ఇజ్రాయిల్ బలగాలు దాడి చేయడం 40మందికి పైగా మరణించారు, పలువురు గాయపడ్డారని గాజా ప్రభుత్వ మీడియా కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. సెంట్రల్ గాజాలో ఇజ్రాయిల్ ఆర్మీ సురక్షిత ప్రాంతమని ప్రకటించిన చోటే జరిగిన ఈ భీకర దాడితో వారు చెబుతున్న అసత్యాలు, చేస్తున్న మోసాలు తేటతెల్లమవుతున్నాయని మీడియా కార్యాలయం విడుదల చేసిన ప్రకటన పేర్కొంది. గాజాలో ఎక్కడా కూడా సురక్షితమైన ప్రాంతమనేదే లేదని దీంతో స్పష్టమైందని పేర్కొంది. గాజాలో ఇళ్ళను విధ్వంసం చేయడాన్ని ఊచకోతకు సాక్ష్యాధారాలుగా అంతర్జాతీయ న్యాయస్థానం పరిగణించాలని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల నిపుణుడు బాలకృష్ణన్ రాజగోపాల్ వ్యాఖ్యానించారు.

ఇప్పటివరకు గాజాలో 56శాతానికి పైగా ఇళ్ళు ధ్వంసమయ్యాయని చెప్పారు. ఉత్తర గాజాలో పరిస్థితి మరీ దారుణంగా వుందన్నారు. 82శాతం గృహాలు నేలమట్టమయ్యాయన్నారు.

గాజాలో ఆస్పత్రుల్లో పరిస్థితి చాలా దారుణంగా వుందని రెడ్ క్రాస్ తెలిపింది. అంతర్జాతీయ రెడ్‌క్రాస్ కమిటీ డైరెక్టర్ రాబర్ట్ మార్దిని మాట్లాడుతూ, అన్ని ఆస్పత్రుల్లోనూ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయిందన్నారు. ఇది ఎంత మాత్రమూ ఆమోదయోగ్యం కానిదని, ప్రమాదకరమైనదని వ్యాఖ్యానించారు.

గాజాలో పౌరుల మరణాలు సహించరానివి !

ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో భారత రాయబారి రుచిరా కాంభోజ్

ఐక్యరాజ్య సమితి : గాజాలో పౌరుల మరణాలు సహించరానివని ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో భారత శాశ్వత రాయబారి రుచిరా కాంభోజ్ అన్నారు. గాజాపై ఇజ్రాయిల్ యుద్ధం ఆరంభించినప్పటి నుండి ఇజ్రాయిల్, పాలస్తీనా నేతలతో భారత్ నిరంతరంగా సంబంధాలను కలిగివుందని చెప్పారు. గాజాలో తక్షణమే కాల్పుల విరమణ జరగాలని భారత్ కోరుతూ వస్తోందన్నారు. మానవతా సాయం నిరంతరంగా అందేలా చర్యలు తీసుకోవాలని, శాంతి, సుస్థిరతలు త్వరగా పునరుద్ధరించాలన్నది భారత్ వైఖరని స్పష్టం చేశారు.

గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న భీకర దాడుల్లో పెద్ద ఎత్తున ప్రాణ నష్టం జరుగుతోందని, ముఖ్యంగా మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో చనిపోతున్నారని రుచిరా కాంభోజ్ బుధవారం పేర్కొన్నారు. దాడుల ఫలితంగా మానవతా సంక్షోభం నెలకొందన్నారు. ఇది ఎంత మాత్రమూ సహించరానిది, ఆమోదించరానిదని అన్నారు. పౌరుల మరణాలను భారత్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. తీవ్రవాదం ఏ రూపంలో, ఎలా వున్నా భారత్ ఎన్నడూ సహించబోదన్నారు. పౌరులను బందీలుగా చేపట్టడం సమర్థనీయం కాదన్నారు. తక్షణమే బందీలను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మధ్య ప్రాచ్యంలోని నేతలతో భారత నాయకత్వం సంబంధాలను కలిగివుందని చెబుతూ, చర్చలు, దౌత్య మార్గం ద్వారా ఈ ఘర్షణలకు శాశ్వత, శాంతియుత పరిష్కారాన్ని కనుగొనాలన్నదే భారత్ వైఖరని, తాము మొదట నుండి ఇదే చెబుతున్నామని అన్నారు. గాజాలో మానవతా సాయాన్ని అందించడంపై భద్రతా మండలిలో ప్రవేశపెట్టిన తీర్మానానికి రష్యా సవరణను ప్రతిపాదించగా, అమెరికా గత నెల 22న వీటో చేసింది. అనంతరం జరిగిన జనరల్ అసెంబ్లీ సమావేశంలో రుచిరా కాంభోజ్ ప్రసంగించారు.

అంతర్జాతీయ న్యాయ స్థానంలో దక్షిణాఫ్రికాకు పెరుగుతున్న మద్దతు

- ఇజ్రాయిల్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఒత్తిడి

ప్రిటోరియా : గాజాలో ఇజ్రాయిల్ సైనిక చర్యలను నిలుపు చేస్తూ తక్షణమే అత్యవసర చర్యలు చేపట్టాలని అంతర్జాతీయ న్యాయ స్థానాన్ని (ఐసిజె) దక్షిణాఫ్రికా కోరింది. ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా దక్షిణాఫ్రికా తీసుకున్న ఈ చర్యకు మద్దతు పెరుగుతోంది. ఇప్పటికే బొలీవియా, మలేసియా, బంగ్లాదేశ్‌లు మద్దతుగా ప్రకటనలు జారీ చేశాయి. ఈ అంశంపై అంతర్జాతీయ న్యాయ స్థానం గురువారం విచారణ చేపట్టనుంది. పాలస్తీనియన్లకు మద్దతుగా దక్షిణాఫ్రికా తీసుకున్న చారిత్రక చర్యను బొలీవియా ప్రభుత్వం గుర్తించిందని తెలిపింది. పాలస్తీనాలో ఇజ్రాయిల్ పాల్పడుతున్న నేరాలపై దర్యాప్తు చేయాలని బొలీవియా కోరుతోంది. గాజాలో సాగుతున్న అత్యాచారాలకు ఇజ్రాయిల్‌ను జవాబుదారీని చేసే దిశగా సకాలంలో, స్పష్టమైన చర్యలు తీసుకోవాలని మలేసియా కోరింది. టర్కీ, 57 దేశాలతో కూడిన ఇస్లామిక్ సహకార సమాఖ్య (ఒఐసి)లు కూడా ఈ విషయంలో దక్షిణాఫ్రికాకు మద్దతు పలికాయి. ఇజ్రాయిల్ విచక్షణా రహితంగా పాలస్తీనియన్లపై జరిపే దాడులు, సాగించే హత్యలు, విధ్వంసం, ఇవన్నీ కూడా మారణకాండ కిందకే వస్తాయని, పాలస్తీనా జాతి నిర్మూలన చర్యలుగానే పరిగణించాలని ఓఐసి పేర్కొంది. 30ఏళ్ళ క్రితం ఇజ్రాయిల్‌తో శాంతి ఒప్పందంపై సంతకాలు చేసిన జోర్డాన్ కూడా ఐసిజెలో దక్షిణాఫ్రికాకు మద్దతిచ్చింది. అంతర్జాతీయ న్యాయ స్థానంలో దక్షిణాఫ్రికా పెట్టిన దరఖాస్తుకు మద్దతుగా ఈ నెల 8న 900కి పైగా ప్రజా ఉద్యమాలు, రాజకీయ పార్టీలు, యూనియన్లు, ఇతర సంస్థలు, సంఘాలు 'డిక్లరేషన్ ఆఫ్ ఇంటర్‌వెన్షన్' దాఖలు చేయాల్సిందిగా ప్రపంచవ్యాప్తంగా గల దేశాలకు పిలుపిచ్చాయి.

భారత్‌తో సంబంధాలను చక్కదిద్దడంపై కఠిన చర్యలు తీసుకోవాలి

- మాల్దీవుల ప్రభుత్వానికి ప్రతిపక్ష నేత ఇస్మాయిల్ సూచన

మాలె : భారత్, మాల్దీవుల మధ్య దౌత్య వివాదం తలెత్తిన నేపథ్యంలో భారత్‌తో సంబంధాలను చక్కదిద్దడంపై తమ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని మాల్దీవుల ప్రతిపక్ష నేత ఫయాజ్ ఇస్మాయిల్ సూచించారు.. భారత్‌పై, ప్రధాని మోడీపై చేసిన వివక్షాపూరిత వ్యాఖ్యలను వారి వ్యక్తిగ అభిప్రాయాలుగా పరిగణించాలన్నారు. ఈ వివాదం ప్రభుత్వాల స్థాయిని దాటి ఈనాడున్న సోషల్ మీడియా కారణంగా ప్రజల్లోకి బాగా చొచ్చుకుపోయిందని అన్నారు. అందువల్ల ఇరు పక్షాల మధ్య వాదనలు చెలరేగడం, దాంతో రెండు వైపులా అవమానాలు జరగడం కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో తమ వైపు నుండి ఎలాంటి దురుద్దేశ్యం లేదని మాల్దీవుల ప్రభుత్వం స్పష్టం చేయాల్సిన అవసరం వుందని ఆయన అభిప్రాయపడ్డారు. కొంతమంది వ్యక్తులు వెలిబుచ్చిన అభిప్రాయాలే అవని, అయితే దురదృష్టవశాత్తూ వారు ప్రభుత్వ పదవుల్లో వుండడం విచారకరమని అన్నారు. ఈ నేపథ్యంలో మాల్దీవుల ప్రభుత్వం భారతీయులకు, మాల్దీవుల ప్రజలకు, మొత్తంగా ప్రపంచానికి ఈ విషయంలో వివరణ ఇవ్వాల్సిన అవసరం వుందని స్పష్టం చేశారు. సుదీర్ఘకాలంగా ఇరు దేశాల మధ్య సంబంధాలు అభివృద్ధి చెందుతూ వస్తున్న తరుణంలో ఇలాంటి ఒక్క సంఘటనతో జరిగిన నష్టం ఆర్థిక నష్టం కన్నా ఎక్కువని అన్నారు.

పెరుగుతున్న గ్రామీణ నిరుద్యోగం

సీఎంఐఈ తాజా నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ : దేశంలో 20-34 సంవత్సరాల మధ్య వయసున్న యువతలో నిరుద్యోగం పెరుగుతోందని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) తన తాజా నివేదికలో తెలియజేసింది. దీని ప్రకారం... గత సంవత్సరం అక్టోబర్-డిసెంబర్ మధ్య కాలంలో 20-24 సంవత్సరాల మధ్య వయస్కుల్లో నిరుద్యోగం 43.65% (గత సంవత్సరం జూలై-సెప్టెంబర్ మధ్య) నుండి 44.49%కి పెరిగింది. మరోవైపు 25-29 సంవత్సరాల మధ్య వయసున్న వారిలో నిరుద్యోగం ఇదే కాలంలో 13.35% నుండి 14.33%కి పెరిగింది. 25-29 సంవత్సరాల మధ్య వయసున్న యువతలో నమోదైన 14.33% నిరుద్యోగం 14 త్రైమాసికాలలో అత్యధికం కావడం గమనార్హం. 30-34 సంవత్సరాల మధ్య వయస్కులలో నిరుద్యోగ రేటు కూడా 2.06% నుండి 2.49%కి పెరిగి పది త్రైమాసికాలలో అత్యధిక స్థాయికి చేరుకుంది. పట్టణ నిరుద్యోగంతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాలలో నిరుద్యోగమే అధికంగా ఉన్నదని సీఎంఐఈ తెలిపింది. గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి 20-24 సంవత్సరాల మధ్య వయసున్న యువతలో నిరుద్యోగం గరిష్ట స్థాయికి



(43.79%) చేరింది. ఈ రేటు 25-29 సంవత్సరాల మధ్య వయసున్న వారిలో 13.06%, 30-34 సంవత్సరాల మధ్య వయస్కులలో 2.24%గా నమోదైంది.

దీనికి భిన్నంగా పట్టణ ప్రాంతాలలో నిరుద్యోగ రేటులో కొంత మెరుగుదల కన్పించింది. 2023-24 సంవత్సరపు రెండో త్రైమాసిక కాలంతో పోలిస్తే మూడు, నాలుగు త్రైమాసికాలలో 20-24, 30-34 సంవత్సరాల మధ్య వయసున్న వారిలో నిరుద్యోగం తగ్గింది. 20-24 సంవత్సరాల వారిలో నిరుద్యోగ రేటు 47.61% నుండి 45.98%కి, 30-34 సంవత్సరాల వారిలో 3.04% నుండి 3.29%కి తగ్గిపోయింది. అయితే 25-29 సంవత్సరాల వారిలో మాత్రం నిరుద్యోగ రేటు 15.61% నుండి 16.54%కి పెరిగింది.

గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగానికి సంబంధించి మహాత్మాగాంధీ జాతీయ జాతీయ ఉపాధి హామీ చట్టం నుండి తీసుకున్న గణాంకాలు, సీఎంఐఈ గణాంకాల మధ్య సామీప్యత కన్పించింది. గ్రామీణ ప్రాంతాలలో ఈ చట్టం ద్వారానే ఎక్కువ మందికి ఉపాధి లభిస్తోంది. అధికారిక లెక్కల ప్రకారం గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే 2023-24 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో గ్రామీణ కుటుంబాలు 1.3% ఎక్కువ పనిని డిమాండ్ చేశాయి. అయితే రెండో త్రైమాసికంలో నమోదైన 15.1% పెరుగుదలతో పోలిస్తే ఇది చాలా తక్కువ.

సీఎంఐఈ సమాచారంపై కొందరు ఆర్థికవేత్తలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని 'ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్' పత్రిక తెలిపింది. నెలవారీ గణాంకాలలో కన్పిస్తున్న అస్థిరతను వారు ఇందుకు కారణంగా చూపుతున్నారు. అయినప్పటికీ సీఎంఐఈ సమాచారానికి ప్రాధాన్యత ఉంది. దేశంలో నెలకొన్న నిరుద్యోగ పరిస్థితిని గురించి ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందిస్తున్న ఏకైక సంస్థ ఇదే. నిరుద్యోగ రేటుకు సంబంధించి సీఎంఐఈ అందిస్తున్న సమాచారం నెలనెలకూ మారుతుంటుంది. అనధికారిక రంగంలో ఉన్న ఉద్యోగాలు శాశ్వతాలు కాకపోవడమే దీనికి కారణమని బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రధాన ఆర్థికవేత్త మదన్ సబ్నవీస్ తెలిపారు.

తులిప్‌తో 100 రెట్ల జీవిత బీమా

- కొటాక్ లైఫ్ నుంచి కొత్త ప్లాన్

హైదరాబాద్ : కొటాక్ మహీంద్రా లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ (కొటాక్ లైఫ్) కొత్తగా వార్షిక ప్రీమియం కంటే 100 రెట్లు వరకు జీవిత బీమాను అందించే తులిప్ ప్లాన్‌ను ఆవిష్కరించింది. ప్రమాదవశత్తు మరణం, తీవ్ర అనారోగ్యాల నుంచి ఇది రక్షణ కల్పిస్తుందని ఆ సంస్థ పేర్కొంది. ఇది యూనిట్ లింక్డ్ టర్మ్ ఇన్సూరెన్స్ ప్లాన్ అని ఆ సంస్థ సీనియర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ మనిష్ అలగ్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో మనీశ్ తులిప్ ప్లాన్ వివరాలను వెల్లడించారు. ఈ పథకంలో ఆర్థిక అత్యవసర పరిస్థితుల్లో డబ్బు వెనక్కి తీసుకునే వెసులుబాటు ఉందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో కొటాక్ లైఫ్ స్థూల వ్యాపారంలో 37 శాతం వృద్ధిని నమోదు చేసిందన్నారు. 2023-24 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో 13 శాతం పెరుగుదల చోటు చేసుకుందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వ్యక్తిగత ప్రీమియంలో 10 శాతం వృద్ధిని అంచనా వేస్తున్నామన్నారు. తెలుగు రాష్ట్రాల్లో 13 శాతం పెరుగుదల చోటు చేసుకోవచ్చన్నారు. జీవిత బీమా కంపెనీల్లో అత్యల్ప ఫిర్యాదులతో తమ సంస్థ మెరుగైన సేవలందిస్తుందన్నారు.

సున్మిత్ ఇన్‌ఫ్రా నుంచి బయో సీఎన్‌జీ ప్లాంట్

హైదరాబాద్ : బయో సిఎన్‌జి ప్లాంటు ఏర్పాటు ప్రతిపాదనలకు సన్మిత్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ బోర్డు ఆమోదం తెలిపింది. రాబోయే రెండు మూడేండ్లలో బహుముఖ విస్తరణలో భాగంగా ఈ ప్రాజెక్టును చేపడుతున్నట్టు ఆ సంస్థ తెలిపింది. రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు, పెట్రోలియం ఉత్పత్తులు, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రంగాల్లో ఉన్న సన్మిత్ ఇన్‌ఫ్రా అందుబాటులో రవాణా పథకం కింద సుస్థిర ప్రత్యామ్నాయం (సతత్)లో భాగంగా లిమిటెడ్ సంస్థ త్వరలో బయో సీఎన్‌జీ ప్లాంటు పెట్టనున్నట్టు పేర్కొంది.

ఆథెర్ 450ఎస్‌పై రూ.20వేల తగ్గింపు..

న్యూఢిల్లీ: విద్యుత్ ద్విచక్ర వాహనాల తయారీదారు ఆథెర్ ఎనర్జీ తన అథెర్ 450ఎస్ స్కూటర్‌పై భారీ తగ్గింపును ప్రకటించింది. ఈ ఇవి స్కూటర్‌పై రూ.20,000 మేర తగ్గించినట్లు ఆ సంస్థ తెలిపింది. దీంతో బెంగళూరులో అథెర్ 450ఎస్ ధర రూ.1.09 లక్షలకు, ఢిల్లీలో రూ.97,500కు లభ్యం కానుందని ఆ సంస్థ పేర్కొంది.